


ESTD: 1999

www.voodayam.com

# వుదయం




ఆదిలాబాద్ 09-08-2026 ఆదివారం | సంపుటి : 13 | సంచిక : 279 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal | Follow us on

సాగునీటి పనులకు నిధుల కొరత రానివ్వం
ఉమ్మడి కరీంనగర్ ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ సమీక్ష
యుద్ధప్రాతిపదికన భూసేకరణ
మిడ్ మానేరు ఎడమ కాలువ పనులను తక్షణమే

# సాగునీటి రూ.5,000 కోట్లు ప్రాజెక్టుల భూసేకరణ

**హైదరాబాద్, ఆగస్టు 8 (వుదయం)**
రాష్ట్రంలో భూసేకరణ, పునరావాసం (ఆర్ అండ్ ఆర్) మరియు చట్టబద్ధమైన అనుమతుల కారణంగా నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం రూ.5,000 కోట్లను ప్రాధాన్యతా ప్రాతిపదికన కేటాయించేందుకు సీఎం ఎ. రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ నిధుల్లో ఇప్పటికే రూ.2,000 కోట్లు విడుదలయ్యాయని, మిగిలిన రూ.3,000 కోట్ల విడుదల ప్రక్రియ తుది దశలో ఉందని వెల్లడించారు. శనివారం ఆయన ఉమ్మడి కరీంనగర్ జిల్లా (కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల) పరిధిలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమగ్ర సమీక్ష నిర్వహించారు.

**యుద్ధప్రాతిపదికన భూసేకరణ, అనుమతులు**
దాదాపు పూర్తయ్యే దశకు చేరుకున్న ప్రాజెక్టు పనులు నిధుల కొరత కారణంగా ఆలస్యం కాకూడదని మంత్రి స్పష్టం చేశారు. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, అటవీ మరియు పర్యావరణ అనుమతుల సమస్యలను ప్రాధాన్యతా అంశాలుగా భావించి, యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్లు తమ ఆర్థిక అవసరాలను వెంటనే ప్రభుత్వానికి నివేదించి, టోకెన్లను ఆలస్యం లేకుండా పొందాలని సూచించారు. సాధ్యమైన చోట ఇంజనీరింగ్ పనులతో పాటు భూమి కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లింపు, నిర్వాసితుల పునరావాస ప్రక్రియలను సమాంతరంగా వేగవంతం చేయాలన్నారు.


**రైతాంగానికి త్వరితగతిన ప్రాజెక్టు ఫలాలు**
భారీ ప్రాజెక్టులపై ఇప్పటికే చేసిన పెట్టుబడుల ఫలితాలు త్వరితగతిన రైతులకు సాగునీటి రూపంలో అందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాగునీటి రంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రాజెక్టుల నిర్వహణలో ఎదురవుతున్న అవరోధాలను తొలగించి, ఆశించిన స్థాయిలో ఆయకట్టుకు నీరందించడమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని వివరించారు.

**మిడ్ మానేరు ఎడమ కాలువ పనుల పునరుద్ధరణ**
ఈ సమీక్షా సమావేశంలో ప్రధానంగా గత నాలుగున్నరేళ్లుగా పనులు నిలిచిపోయిన మిడ్ మానేరు ఎడమ కాలువ అంశంపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. కాలువ నిర్మాణానికి సంబంధించి ఉన్న భూసమస్యలను తక్షణమే పరిష్కరించి, మిగిలిపోయిన పనులను వెంటనే పునఃప్రారంభించాలని ఆదేశించారు. సవరించిన అంచనాలు (రివైజ్డ్ ఎస్టిమేట్స్), భూసేకరణ, టెండర్ల ప్రక్రియలు మరియు చట్టబద్ధమైన అనుమతులను ఒకేసారి వేగవంతం చేయాలని స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.



# వికసిత్ భారత్ భవిష్యత్తు

- సమస్యలకు పరిష్కారాలన్వేషణే అసలైన ప్రగతి
- దేశ ప్రయోజనాలే ప్రామాణికం కావాలి
- ఐఐటీ దిల్లీ స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 8 (వుదయం) :**
దేశ ప్రగతి చక్రంలో యువత పాత్ర అత్యంత కీలకమని, 'వికసిత్ భారత్' కల నెరవేరడంలో యువత సామర్థ్యాలపై తమకు పూర్తి విశ్వాసం ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఐఐటీ దిల్లీ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని, పట్టభద్రులైన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సాంకేతికతతో పాటు బయటి ప్రపంచం శీఘ్రగతిన మారుతోందని, రాబోయే రెండు మూడు దశాబ్దాల్లో ఊహించని మార్పులు రానున్నాయని తెలిపారు. ఏ తరానికి చెందిన వారైనా జాతీయ బాధ్యతను మరిచిపోకూడదని హితవు పలికారు. సవాళ్లను చూసి భయపడొద్దు.. పరిష్కారంపైనే దృష్టి పెట్టండి మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతీ ఒక్కరూ నిత్య విద్యార్థిలా నేర్చుకునేందుకు కుతూహలం చూపాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లే నూతన అవకాశాలకు బాటలు వేస్తాయని చెప్పారు. "పెద్ద సమస్య ఎదురైనప్పుడు అధైర్యపడకుండా దాన్ని చిన్న చిన్న భాగాలుగా విభజించి చూస్తే కొత్త పరిష్కారాలు లభిస్తాయి. కేవలం ప్రశ్నలు వేయడానికే పరిమితం కాకుండా, సమస్యలను అధిగమించే మార్గాలను అన్వేషించే వారే నిజమైన విజేతలుగా నిలుస్తారు" అని మార్గదర్శనం చేశారు. దేశ శ్రేయస్సే పరమావధిగా నిర్ణయాలు ఉండాలి రాబోయే 3035 సంవత్సరాల్లో యువత తీసుకునే నిర్ణయాలు, చేపట్టే పనులే భారత భవిష్యత్తును నిర్ణయిస్తాయని ప్రధాని పేర్కొన్నారు. విద్యార్థులు ఏ రంగంలో అడుగుపెట్టినా, తాము తీసుకునే ప్రతి నిర్ణయం దేశ ప్రయోజనాలకు ఏ విధంగా ఉపయోగపడుతుందో ఆలోచించుకోవాలని పిలుపునిచ్చారు. 'పరం ప్రజ్ఞ' సూపర్ కంప్యూటింగ్ కేంద్రం ప్రారంభం ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రధాని 'దీన్‌దయాల్ శర్మ స్వర్ణ పతకం', 'డైరెక్టర్ స్వర్ణ పతకాలను' అందజేశారు. పతకాలు సాధించిన వారిలో మహిళా విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంపై స్పందిస్తూ, భవిష్యత్తులో ఈ సంఖ్య మరింత పెరగాలని ఆకాంక్షించారు. అనంతరం, ఐఐటీ దిల్లీ సోనిపత్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ఏఐ (AI) ఆధారిత 'పరం ప్రజ్ఞ' సూపర్ కంప్యూటింగ్ కేంద్రాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు.

# భూమాఫియాతో చేతులు కలపొద్దు



**హైదరాబాద్, ఆగస్టు 8 (వుదయం)**
నగరంలోని పారిశ్రామిక భూములను బహుళ వినియోగ (మల్టీ యూజ్) జోన్లుగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ లాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్' (హిల్ట్) పాలసీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ విధానం పేరుతో సుమారు 10 వేల ఎకరాల విలువైన భూములను కొందరికి ధారాదత్తం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. 'హిల్ట్' పాలసీకి వ్యతిరేకంగా సెప్టెంబర్ నెలలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, పారిశ్రామిక సంఘాలకు లేఖలు రాయనున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఈ పాలసీని పూర్తిగా రద్దు చేస్తామని తేల్చిచెప్పారు. మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన ఆయన, ఈ పాలసీ కింద ఎవరైనా సొమ్ములు చెల్లిస్తే తీవ్రంగా నష్టపోతారని, భూమాఫియాతో చేతులు కలిపి మోసపోవద్దని పారిశ్రామికవేత్తలను హెచ్చరించారు.

**యాగాలు చేయొచ్చు.. బాధ్యత విస్మరించొద్దు**
కాంగ్రెస్ నాయకులు నిర్వహిస్తున్న వరుణ యాగాలపై స్పందిస్తూ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో ఎవరూ చేయలేదని కేటీఆర్ గుర్తుచేశారు. "యాగాలు నిర్వహించడం మంచిదే, కానీ ప్రభుత్వం తన ప్రాథమిక బాధ్యతలను నిర్వర్తించాలి. దైవకృపకు మానవ ప్రయత్నం కూడా తోడైనప్పుడే ఫలితాలు వస్తాయి" అని హితవు పలికారు. బీఆర్ఎస్ నాయకుడు హరీశ్‌రావు ఆలయ దర్శనానికి వెళ్తే కాంగ్రెస్ నేతలు 'క్షుద్ర పూజలు' అంటూ చిల్లర వ్యాఖ్యలు చేయడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యవసాయం, రైతాంగ సమస్యలపై కనీస అవగాహన లేదని, సొంత జిల్లా పాలమూరుకే సాగునీరు అందించడంలో విఫలమయ్యారని ఎద్దేవా చేశారు.

**తెలంగాణ నీటి హక్కుల కోసం మళ్లీ ఉద్యమిస్తాం**
అధికారంలో ఉన్నా లేకున్నా రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో 24 గంటల ఉచిత విద్యుత్ ఎక్కడ ఇస్తున్నారో చూపాలని సవాలు విసిరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు ద్వారా తెలంగాణ నీటిని కొల్లగొడుతున్నా ప్రస్తుత ప్రభుత్వం నోరుమెదపకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర నీటి హక్కులను కాపాడుకునేందుకు కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ మలిదశ ఉద్యమం తరహాలోనే మళ్లీ పెద్దఎత్తున పోరాటం చేస్తామని ప్రకటించారు. గోదావరి యాజమాన్య బోర్డు (GRMB) సమావేశంపై ప్రభుత్వం తన స్పష్టమైన వైఖరిని బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో 'హైడ్రా' పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పొట్ట కొడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

# పేలిన గ్యాస్ సిలిండర్




**హైదరాబాద్, ఆగస్టు 8 (వుదయం)**
మియాపూర్ ప్రాంతంలోని జీఎస్ఎమ్ (GSM) మాల్ వద్ద తీవ్ర దిగ్భ్రాంతి కలిగించే ఘటన చోటుచేసుకుంది. మాల్ ప్రాంగణంలో బెలూన్లలో గ్యాస్ నింపే సిలిండర్ ఒక్కసారిగా పేలడంతో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. హఠాత్తుగా సంభవించిన ఈ పేలుడు ధాటికి చుట్టుపక్కల ఉన్నవారు భయాందోళనతో పరుగులు తీశారు. ఐస్‌క్రీమ్ విక్రేత పరిస్థితి విషమం ఈ ప్రమాదంలో ఐస్‌క్రీమ్ బండి నడుపుకునే ఓ యువకుడు తీవ్రంగా గాయపడగా, అతడి పరిస్థితి ప్రస్తుతం అత్యంత విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. గమనించిన స్థానికులు వెంటనే అతడిని సమీప ఆస్పత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. గాయపడిన మిగిలిన క్షతగాత్రుల్లో ఓ కళాశాల విద్యార్థిని, ఒక ఐటీ మహిళా ఉద్యోగినితో పాటు మరొక వ్యక్తి ఉన్నారని సమాచారం రంగంలోకి దిగిన పోలీసులు ఘటనపై సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

# ఇరాన్ యుద్ధం నుంచి తప్పుకోవడమే మేలు

**వాషింగ్టన్ :**
ఇరాన్‌తో గత ఐదు నెలలుగా సాగుతున్న దాడుల పరంపర కారణంగా అమెరికా సైనిక ఆయుధ నిల్వలు వేగంగా తరిగిపోతుండటం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ ఘర్షణలను తక్షణమే నిలిపివేసి, యుద్ధం నుంచి సురక్షితంగా బయటపడే మార్గాలను అన్వేషించాలని అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డాన్ కేన్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగానికి స్పష్టమైన సూచనలు చేసినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఇకనైనా ఈ పోరుకు ముగింపు పలక్కపోతే తీవ్ర ప్రతికూల పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. వైమానిక దాడులతోనే లక్ష్యాలు సాధించలేం పశ్చిమాసియాలో ఘర్షణల తీవ్రతను పెంచడం వల్ల అమెరికాకు ఎలాంటి ప్రయోజనం ఉండదని డాన్ కేన్ స్పష్టం చేసినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. "స్వల్పకాలంలో ముగియాల్సిన ఈ యుద్ధం ఇప్పటికే హద్దులు దాటిపోయింది. కేవలం వైమానిక దాడుల ఆధారంగానే నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడం అసాధ్యం. కాబట్టి యుద్ధ విరమణ దిశగా అడుగులు వేయడం అత్యవసరం" అని ఆయన వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్‌లతో పాటు పలువురు కేబినెట్ ఉన్నతాధికారుల వద్ద ఆయన ఈ అంశాన్ని లేవనెత్తినట్లు నివేదికలు చెబుతున్నాయి. వేగంగా కరిగిపోతున్న క్షిపణి నిల్వలు ఇరాన్‌పై నేరుగా పదాతి దళాలను మోహరించేందుకు విముఖత చూపుతున్న ట్రంప్, వైమానిక దాడులను మరింత తీవ్రతరం చేయడం ద్వారా ఆ దేశాన్ని ఒప్పందానికి తీసుకురావచ్చని భావిస్తున్నారు.

## ఇంతే కదా...!









# పిల్లల ఉచిత దుస్తుల్లో 'కమ్మేస్తే' కఠిన చర్యలే!



- కొలతలు తప్పినా.. కుట్లలో తేడాలొచ్చినా తోలు తీస్తాం: ఎంఈఓ ఆగ్రహం
- టైలరింగ్ సెంటర్‌పై విద్యాశాఖ 'రాబందు' దాడి.. అధికారుల హడల్!

ధరూర్ ఆగస్టు 08 (వుదయం బ్యూరో)

ప్రభుత్వ బడుల్లో చదువుకునే పేద విద్యార్థుల కడుపు కొడుతూ, వారికి అందే ఉచిత యూనిఫామ్‌ల కుట్టింపులో నకిలీ నాణ్యతతో నాటకాలేడిస్తే ఊరుకునేది లేదని ధరూర్ ఎంఈఓ రవీంద్రబాబు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం మండల కేంద్రంలోని టైలరింగ్ కేంద్రాన్ని ఆయన ఒక్కసారిగా ముట్టడించి, కుడుతున్న దుస్తుల కటింగ్, కుట్ల గట్టితనాన్ని రచ్చ రచ్చగా తనిఖీ చేశారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ఇస్తున్న గుడ్డను నాసిరకం కుట్లతో నాశనం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రతి చిన్నారి కొలతలకు మిల్లీమీటర్ తేడా వచ్చినా, వేసుకుంటే గుచ్చుకునేలా బిగుతుగా కుట్టినా సదరు టైలర్లపై వేటు తప్పదని స్పష్టం చేశారు. "పిల్లల దుస్తుల తయారీలో వ్యాపార ధోరణి చూపిస్తే కఠిన చర్యలు ఉంటాయి. దర్జాగా, సౌకర్యవంతంగా ఉండేలా కుట్టాల్సిందే" అని హెచ్చరించారు. విద్యార్థుల హక్కుల విషయంలో నయా పైసా నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, ప్రతి రోజూ సర్‌ప్రైజ్ రైడ్స్ ఉంటాయని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో సీఆర్‌పీ నరసింహులు, వెలుగు ప్రతినిధి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు




- మెదక్ జిల్లా కోర్టు మెజిస్ట్రేట్ నీలిమ...

వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 8

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని సికింద్లాపూర్ గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని నేడు మెదక్ జిల్లా కోర్టు మెజిస్ట్రేట్ నీలిమ కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. జిల్ల మెజిస్ట్రేట్ నీలిమ కుటుంబని ఆలయ అర్చకులు పూర్ణకుంభం తో స్వాగతం తెలిపారు . మెజిస్ట్రేట్ నీలిమ కుటుంబ సభ్యులు శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం జరుపుకొన్నారు . అనంతరం మెజిస్ట్రేట్ నీలిమ మాట్లాడుతూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆశీర్వాదంతో తెలంగాణలోని ప్రజ లు ఆయురారోగ్యాలతో పాడిపంటలతో సుభిక్షంగా జీవించేలా చూడమని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని వేడుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో. ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాస్. జూనియర్ సహాయకులు నరసింహారెడ్డి. అలా అర్చకులు పాల్గొన్నారు

# బుద్ధుల బిక్షపతి సేవలు అభినందనీయం



- సొంత ఖర్చులతో దేవాలయాలకు పెయింటింగ్ ....
- అభినందించిన దొంతి గ్రామస్తులు.....

వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 8.....

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని దొంతి గ్రామంలో నేడు గ్రామ దేవతలకు తెలంగాణ సంస్కృతి. సంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ. ఈ పండుగ పురస్కరించుకొని గ్రామంలోని శ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయానికి. మరియు దుర్గమ్మ దేవాలయాలకు. ప్రముఖ సంఘ సేవకులు B.R.S. శివంపేట మండల ప్రచార కమిటీ కార్యదర్శి బుద్ధుల బిక్షపతి. తన సొంత కష్టార్జితంలో కొంత వెచించి గ్రామంలోని దేవాలయాలకు 31000వేల తో పెయింటింగ్ వేయించడం జరిగింది. అనంతరం బుద్ధుల బిక్షపతి మాట్లాడుతూ మండలంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకుంటూ బోనాలకు విచ్చేస్తున్న అతిథులకు గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ బిక్షపతి చేస్తున్న సేవలు అభినందనీయమని గ్రామం తరపున కృతజ్ఞతలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు. గ్రామస్తులు పాల్గొన్నారు.

# బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ద్వారకా రవి



సంగారెడ్డి వుదయం

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సంగారెడ్డి పట్టణానికి చెందిన ద్వారకా రవి నియమితులయ్యారు. ఈ మేరకు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా ద్వారకా రవి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, బీజేపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# మ్మాయిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ నిలిపివేత

- నిర్వహణ పనుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు అంతరాయం

బిజినపల్లి, ఆగస్టు 08 (వుదయం ప్రతినిధి):

నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం మమ్మాయిపల్లి 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో నేడు నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.ఈ మేరకు ఆగస్టు 09, 2026 ఆదివారం ఉదయం 08:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు నూతన బ్రేకర్ల బిగింపు మరియు ఇతర మెయింటెన్స్ పనులు జరుగుతాయి. ఈ కారణంగా మమ్మాయిపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది.
విద్యుత్ అంతరాయాన్ని గమనించి తమ పనులను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని వినియోగదారులకు విద్యుత్ శాఖ అధికారులు సూచించారు. మెయింటెన్స్ పనులు పూర్తయ్యే వరకు ఓర్పుతో ఉండి అధికారులకు సహకరించాలని కోరారు.

# ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, తన్వీర్ ల జన్మదిన వేడుకలు

- "మున్సిపల్ కార్మికులకు , ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందికి చీరలు, పంపిణీ"

కోహీర్ ఆగస్టు 8( వుదయం ప్రతినిధి )

మండల కేంద్రమైనా కోహీర్ మున్సిపల్ పరిధిలో జహీరాబాద్ లోక్‌సభ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, పూర్వ తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (టీఎస్ఐడిసి ) ఛైర్మన్ మహమ్మద్ తన్వీర్ ల జన్మదినాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోహిర్ లో ఒక విశేష సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కోహీర్ మున్సిపల్ టౌన్ ప్రెసిడెంట్ మహమ్మద్ ముజఫర్ హుస్సేన్ నాయకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించడం.జరిగింది. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్మికులకు మరియు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందికి ఉచితంగా చీరలు, పండ్లను పంపిణీ చేశారు. ప్రజాసేవలో నిరంతరం శ్రమిస్తున్న కార్మికుల సేవలను గుర్తించి, వారిని గౌరవించుకోవడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు.ఈ వేడుకల్లో పలువురు ముఖ్య ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొని సభను ఉద్దేశించి మాట్లాడారు:ముఖ్య అతిథులు. మున్సిపల్ ఛైర్మన్ ఎమ్. అశోక్, వైస్ ఛైర్మన్ ఎమ్. ఎ. హన్నాన్ జావేద్,



మాజీ వైస్ ఎంపీపీ షాకీర్ అలీ. కౌన్సిలర్లు శిరీష రాణి, అనసూయ. జగదీష్, అజ్జు పటేల్ , యూసుఫ్ పటేల్, అబ్దుల్ సత్తార్.కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ మతీన్ తో పాటు పలువురు స్థానిక , కార్యకర్తలు పాల్గొన్నారు.
కార్యక్రమం లో మున్సిపల్ కార్మికులు, ఆస్పత్రి సిబ్బంది నాయకులతో కలిసి ఎంపీ సురేష్ షెట్కార్, తన్వీర్ లకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఘనంగా పండగ సాయన్న జయంతి ఉత్సవాలు

- "పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ సిద్దు రావణ్"
- "చరిత్రపుటల్లో స్వర్ణాక్షరాలతో లిఖించదగిన మహావీరుడు పండుగ సాయన్న" *
- "చరిత్ర మరచిన ఓ వీరుడి జన్మదిన పండగ "

కోహీర్ ఆగస్టు 8 (వుదయం ప్రతినిధి )



జహీరాబాద్ పట్టణంలో పండగ సాయన్న 135వ జయంతిని పురస్కరించుకొని జహీరాబాద్ బస్టాండ్ నుండి ప్రధాన కూడలిని దాటుతూ అంబేద్కర్ విగ్రహానికి వరకు బైక్ ర్యాలీలతో చేరుకోవడం జరిగింది మొదటగా అంబేద్కర్ గారికి పూలమాలలు వేసి పండుగ సాయన్న ముదిరాజ్ కి చిత్రపటానికి పూలమాలలువేయడం జరిగింది ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ సిద్దు రావణ్ పండుగ సాయన్న జయంతిని పురస్కరించుకొని మాట్లాడుతూ రాజ్యం భ్రష్టమై అవినీతి దోపిడి అన్యాయం పెరిగినప్పుడు ప్రజల్లో నుండి వీరులు ఉద్భవిస్తారు అలా అన్యాయాన్ని ఎదిరించి అణగారిన వర్గాలకై గొంతు ఎత్తిన మహా పురుషుడు పండుగ సాయన్న .భారత స్వాతంత్రోద్యమ కాలంలో నిజాం రాజ్యంలో జరిగిన తిరుగుబాటు ఉద్యమాలలో రజాకార్ల రాజ్యం కొనసాగుతూ ఉండే అప్పట్లో రజాకార్లు భూస్వాములను గుప్పెట్లో పెట్టుకొని పరిపాలన కొనసాగించారు వారి పరిపాలనకు వ్యతిరేకంగా రజాకార్ల మీద ఉక్కు పాదం మోపిన వీరుడు పండుగ సాయన్న . పెత్తందారులను కొట్టి పేదలకు పెట్టాడని బందిపోటు అన్నారు రజాకార్లకు తిరుగుబాటు చేశాడని తల నరికేశారు రాజ్యాంగంలోని హక్కుల కోసం ప్రశ్నిస్తే దేశద్రోహులు తీవ్రవాదులుగా ముద్ర వేశారు వ్యవస్థను ప్రశ్నిస్తే మరణమే శాసనం అనే సందేశాన్ని ఈ దేశంలోనే పాలక వ్యవస్థలు ఇస్తున్నాయి . కానీ వీరులకు మరణం ఉండదు. విప్లవాలకు అంతం ఉండదు అని మరోసారి నిరూపించిన పండుగ సాయన్న ముదిరాజ్ గారికి జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రభుత్వం అధికారికంగా పండగ సాయన్న ముదిరాజ్ జయంతిని నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ సిద్దు రావణ్ డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పలువురు విద్యావేత్తలు ఉద్యమకారులు కార్యకర్తలతో పాటుభీమ్ ఆర్మీ నియోజకవర్గ నాయకులు మండల నాయకులు శంకర్ నరసింహ గోపాల్ బాలరాజు విజయ్ రాములు మహమ్మద్ అలీం, సలీం నర్సింలు ముదిరాజ్, వెంకన్న ముదిరాజ్ ప్రేమ కుమార్ అనంతరం సదానంద్ రామచందర్ ధనరాజ్ అనంతరం బక్కన్న బుద్ధిష్ట్ రాహుల్ ,బీసీ సంఘ నాయకులు నర్సింలు ముదిరాజ్, సిద్ధార్థ్ అడ్వకేట్ రాకేష్ ముదిరాజ్ శ్రీకాంత్ ముదిరాజ్ వెంకన్న ముదిరాజ్ తదితరాలు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడులతో కార్మికులకు తీవ్ర అన్యాయం

- లేబర్ కోడులను వెంటనే రద్దు చేయాలి - సిఐటియు జిల్లా కోశాధికారి పొదిల రామయ్య

బిజినపల్లి, ఆగస్టు 8 (వుదయం ప్రతినిధి):

నాలుగు లేబర్ కోడుల అమలు వల్ల దేశంలో కార్మిక వర్గానికి తీవ్ర నష్టం జరుగుతుందని, కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తెచ్చిన ఈ చట్టాలను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి పొదిల రామయ్య డిమాండ్ చేశారు. శనివారం బిజినపల్లి మండల కేంద్రంలో జరిగిన మండల సదస్సులో ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాల అమలు వల్ల కార్మికులు, ఉద్యోగులపై పని భారం పెరుగుతుందని, జీతభత్యాలు పెరగవని, ఉద్యోగ భద్రత ఉండదని, సంక్షేమ పథకాల అమలు నీరుగారిపోతుందని అన్నారు. కార్మిక చట్టాల రద్దు వల్ల కార్మిక వ్యవస్థకే నష్టం జరుగుతుందని, కార్మికులు తమ హక్కులు కోల్పోతారని తెలిపారు.
కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా జైలు బరో కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు కార్మిక చట్టాల సవరణను, అమలను వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు.బిజెపి పాలనలో వ్యవసాయ కార్మికుల ఉపాధి పూర్తిగా దెబ్బతిన్నదని, ఉపాధి లేక ప్రజల ఆదాయం గణనీయంగా తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, పెట్టుబడుల ఉపసంహరణ పెద్ద ఎత్తున పెరిగిందని, దీనివల్ల దేశంలో సామాజిక న్యాయం అంతరించిపోయే దశకు చేరిందని అన్నారు.
బిజెపి అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, వ్యవసాయ, ఉపాధి కూలీల అణచివేత విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగే జైలు భరో కార్యక్రమంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జ్ జస్వంత్ రవి, శ్రీశైలం కృష్ణయ్య, వెంకటయ్య, బాలస్వామి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నమ్మ, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, ఐకెపి వివో ఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు సునీత, అంగన్వాడి జిల్లా యూనియన్ నాయకురాలు మల్లీశ్వరి, తిరుపతమ్మ, నాగమణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కాశన్న, సిఐటియు మండల నాయకులు శుభాకర్, కృష్ణమ్మ, వెంకటమ్మ, అలివేల, లక్ష్మి, భవనమ్మ, మంగమ్మ, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు



# మనిషి ఆచరించవలసిన తపస్సులను మూడు

- రకాలుగా (కాయిక, వాచిక, మానసిక) విభజించాడు....
- ప్రముఖ సంఘ సేవకులు శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ...

వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 8....



మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లో కొలువు దీరిన శ్రీ దత్తాత్రేయ మహా స్వామి.శిరిడి సాయి బాబా దేవత మూర్తుల ఆలయం లో నేడు శ్రీ పరహాభవ నామ సంవత్సరం బహుళ దశమి పురస్కరించుకొని . శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ ప్రముఖ సంఘ సేవకులు హైకోర్టు సీనియర్ న్యాయవాది పెద్దగోని జిన్నారం శివకుమార్ గౌడ్ శ్రీకృష్ణ భగవానుడు మనిషి ఆచరించవలసిన తపస్సులను మూడు రకాలుగా (కయిక. వాచిక. మానసిక) విభజించాడు వీటి గురించి శివకుమార్ గౌడ్ వివరిస్తూ. భగవద్గీతలోని 17వ అధ్యాయం (శ్రద్ధాత్రయవిభాగ యోగం)లో శ్రీకృష్ణుడు తపస్సును ఎక్కడో అడవుల్లో, పర్వతాల్లో చేసే కఠోర దీక్షగా కాకుండా.. మనిషి తన దైనందిన జీవితంలో నిత్యం ఆచరించాల్సిన ఒక గొప్ప సాధనగా, క్రమశిక్షణగా వర్ణించాడుమనిషి తన దేహంతో, మాటతో, మనస్సుతో చేసే ఈ మూడు రకాల తపస్సుల గురించి కృష్ణ పరమాత్మ చేసిన విశ్లేషణ ఇక్కడ చూద్దాం:

1. కాయిక తపస్సు (శారీరక తపస్సు) శరీరం ద్వారా, కర్మల ద్వారా ఆచరించే తపస్సు ఇది. (భగవద్గీత 17.14)

పెద్దలను గౌరవించడం: దేవతలను, గురువులను, పండితులను, జ్ఞానులను మరియు పెద్దలను పూజించడం, వారి పట్ల భక్తి గౌరవాలు కలిగి ఉండటం.
శౌచం (శుభ్రత): శరీరాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం.
ఆర్జవం (సరళత్వం): ప్రవర్తనలో నిరాడంబరత, నిజాయితీ, మరియు కుటిలత్వం (వక్రబుద్ధి) లేకుండా ఉండటం.
బ్రహ్మచర్యం, అహింస: ఇంద్రియ నిగ్రహం కలిగి ఉండటం మరియు ఏ ప్రాణికీ మనసా, వాచా, కర్మణా హాని తలపెట్టకపోవడం (అహింస).

2. వాచిక తపస్సు (వాక్కుతో చేసే తపస్సు)మనం మాట్లాడే మాటల ద్వారా చేసే తపస్సు ఇది (భగవద్గీత 17.15)

**అనుద్వేగకరం, సత్యం: ఎదుటివారి మనస్సును కలచివేయని, భయపెట్టని మాటలు మాట్లాడటం.**
ఎల్లప్పుడూ సత్యాన్నే పలకడం.
ప్రియహితం: మాట్లాడే మాట సత్యమైనప్పటికీ దానిని కఠినంగా కాకుండా, వినడానికి కంపుగా (ప్రియంగా) మరియు ఎదుటివారికి మేలు చేసేలా (హితంగా) పలకడం.
స్వాధ్యాయం: పవిత్ర గ్రంథాలను, శాస్త్రాలను నిత్యం పఠించడం, భగవన్నామ స్మరణ చేయడం.

3. మానసిక తపస్సు (మనస్సుతో చేసే తపస్సు)

మనస్సును, ఆలోచనలను అదుపులో ఉంచుకోవడం ద్వారా చేసే తపస్సు ఇది. (భగవద్గీత 17.16)మనఃప్రసాదం: కష్టనష్టాలు, సుఖదుఃఖాలు ఎదురైనప్పుడు చలించకుండా మనస్సును ఎల్లప్పుడూ ప్రశాంతంగా, ఉల్లాసంగా ఉంచుకోవడం.
సౌమ్యత్వం: ఆలోచనలలో మృదుస్వభావం, అందరి పట్ల దయ కలిగి ఉండటం.
మౌనం: ఇక్కడ మౌనం అంటే కేవలం పెదవులు మూసుకోవడం కాదు, మనస్సులోని వ్యర్థమైన ఆలోచనలను, సంకల్పాలను ఆపి అంతర్ముఖం కావడం.
ఆత్మవినిగ్రహం, భావసంశుద్ధి: మనస్సును పూర్తిగా అదుపులో పెట్టుకోవడం. ఇతరుల పట్ల ఈర్ష్య, ద్వేషం, మోసం వంటి మలినాలు లేకుండా భావాలను అత్యంత పవిత్రంగా ఉంచుకోవడం.

**సారాంశం:**
ఈ మూడింటిని ఎవరైతే ఒకేసారి ఆచరిస్తారో వారిలో "త్రికరణ శుద్ధి" (మనో, వాక్, కాయ కర్మల ఏకత్వం) సిద్ధిస్తుంది. మనిషి ఆంతరంగిక ఎదుగుదలకు ఈ మూడు తపస్సులు అత్యంత ఆవశ్యకం అని గీతాచార్యుని ఉవాచ. అని చక్కగా వివరించారు. కార్యక్రమంలో భక్తులు వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన భక్త బృందం. శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరి వేస్తే.. నీళ్లు ఎక్కడి నుంచి?

**ఎల్‌నినో ఎఫెక్ట్‌తో వర్షా లు తక్కువే.. ఖరీఫ్‌లో కాలువ నీటిపై గ్యారంటీ లేదు!**

- ఆరుతడి పంటలే శ్రేయస్కరం..
- ఆయిల్‌పామ్‌తో అదనపు ఆదాయం: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల, ఆగస్టు 08 (వుదయం బ్యూరో)

ఈసారి వరి సాగు చేస్తే నీటి పరిస్థితి ఏంటి? కాలువలకు నీరు ఎన్ని రోజులు వస్తుంది? ఇదే ఇప్పుడు ఆయకట్టు రైతుల ముందున్న ప్రధాన ప్రశ్న. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో వరి సాగుకు దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ రైతులకు సూచించారు.ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు ఎగువన ఉన్న జలాశయాల నుంచి భారీగా వరద నీరు వస్తున్నప్పటికీ, ఆ నీటిని చూసి ఖరీఫ్ మొత్తం వరి సాగుకు భరోసా పెట్టుకోవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు.ఇప్పటికే ఇరిగేషన్ శాఖ అధికారులు ఆయకట్టు రైతులకు వరి సాగు చేయవద్దని సూచించినట్లు వెల్లడించారు. ఈ నెల 7న హైదరాబాద్ నుంచి మంత్రులు, ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లోనూ అన్ని జిల్లాల్లో వరి స్థానంలో ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని సూచించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

**వరి ఒక్కటే పంట కాదు!**

రైతులు కందులు, మిర్చి, మొక్కజొన్న, పెసర్లు, మినుములు, కూరగాయలు వంటి ఆరుతడి పంటలను సాగు చేసి మంచి ఆదాయం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. వరి పంటకు నాలుగు నెలల పాటు మడుల్లో నీరు నిల్వ ఉంచాల్సి ఉంటుంది. అదే ఆరుతడి పంటలకు తక్కువ నీటితో సాగు సాధ్యమవుతుంది. దీంతో నీటి వినియోగం తగ్గడంతో పాటు పంటల వైవిధ్యం, పంట మార్పిడి ద్వారా నేల సారవంతత కూడా మెరుగు పడుతుందని వివరించారు.

**పప్పు పంటలకు సబ్సిడీ.. రైతులకు మరో అవకాశం**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆత్మ నిర్భర్ భారత్ పప్పు దినుసుల పథకం కింద కందులు, మినుముల విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు సమీప వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

**ఆయిల్‌పామ్‌తో దీర్ఘకాలిక లాభాలు**

వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగుపై కూడా రైతులు దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. ఆయిల్‌పామ్ మొక్కల మధ్య మొదటి మూడేళ్లపాటు పప్పు దినుసులు, కూరగాయలు వంటి అంతర పంటలు సాగు చేసుకుని అదనపు ఆదాయం పొందవచ్చన్నారు.ప్రస్తుతం ఆయిల్‌పామ్‌కు మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున రైతులు సంప్రదాయ వరి సాగుతో పాటు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని కలెక్టర్ కోరారు. వర్షాలు, నీటి లభ్యత, మార్కెట్ పరిస్థితులను అంచనా వేసుకుని పంటను ఎంచుకోవడం ద్వారా రైతులు నష్టాలను నివారించి ఆర్థికంగా బలపడాలని ఆయన ఆకాంక్షించారు.



**రైతులకు కలెక్టర్ కీలక సందేశం:**

"ఈ ఏడాది నీటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంచుకోండి. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని ఆదాయం పెంచుకోండి."

# కేటీఆర్ వ్యాఖ్యలు అహంకారానికి పరాకాష్ట

- జైపాల్ రెడ్డి సేవలను అవమానిస్తే ప్రజలు ఊరుకోరు : కాయితి విజయ్ కుమార్ రెడ్డి

కల్వకుర్తి, ఆగస్టు 8 (వుదయం ప్రతినిధి) :



స్వర్గీయ జైపాల్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు అహంకారానికి పరాకాష్ట అని కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితి విజయ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.శనివారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి, పార్లమెంటరీ రాజకీయాల్లో జైపాల్ రెడ్డి చేసిన సేవలకు ఉన్న విలువను కేటీఆర్ కానీ, బీఆర్ఎస్ నాయకులు కానీ నిర్ణయించే స్థితిలో లేరని అన్నారు. తెలంగాణ నిబద్ధతను శంకించడం అంటే ఆయన దశాబ్దాల ప్రజా జీవితాన్ని, పార్లమెంటరీ పోరాటాన్ని అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ లో తెలంగాణ కోసం జైపాల్ రెడ్డి వాణి వినిపిస్తున్న సమయంలో కేసీఆర్ ఏం చేశారని ప్రశ్నించారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ఒక్క కుటుంబం సొంత ఆస్తిలా భావించి, తెలంగాణ కోసం జీవితాంతం పనిచేసిన నాయకుల చరిత్రను ప్రశ్నించడం హాస్యాస్పదమని అన్నారు.జైపాల్ రెడ్డిని విమర్శించడం అంటే తెలంగాణ కోసం పోరాడిన ఒక తరాన్ని, ఆయన పార్లమెంటరీ సేవలను తక్కువ చేసి మాట్లాడటమేనని, ఇది భారత పార్లమెంటరీ చరిత్రను అవమానించడమేనని పేర్కొన్నారు.మేధావుల జాబితా ఎవరు తయారు చేయాలో కేటీఆర్ నిర్ణయించాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్ర సాధన కోసం ఎవరు ఏం చేశారో తెలంగాణ ప్రజలకు తెలుసునని, చరిత్రను ట్విట్టర్ పోస్టులతో మార్చలేరని, రాజకీయ ప్రసంగాలతో వక్రీకరించలేరని తెలిపారు. జైపాల్ రెడ్డి సేవలను అవమానిస్తే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ వెంటనే ఉపసంహరించుకుని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# తెలంగాణ మంగళవాయిద్య కళాకారుల జిల్లా అధ్యక్షుడిగా సదుర్ల తిర్పతయ్య



నాగర్ కర్నూల్, ఆగస్టు 08 (వుదయం ప్రతినిధి):

తెలంగాణ మంగళ వాయిద్య కళాకారుల జిల్లా సంఘం అధ్యక్షుడిగా సదుర్ల తిర్పతయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం నాగర్‌కర్నూల్ శ్రీ సీతారామస్వామి దేవాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సాయిపల్లి శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.చంద్రశేఖర్, టి.రామకృష్ణ, టి.సురేష్ కుమార్, జె.మహేష్ అధ్యక్షతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కమిటీలో ప్రధాన కార్యదర్శిగా సదుర్ల నాగరాజు, కోశాధికారిగా జి.రాజు, జాయింట్ కోశాధికారిగా సదుర్ల అనిల్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా సదుర్ల సాంబశివుడు, సదుర్ల గోపాల్, సింగోటం నారాయణ, సింగోటం వెంకట్ స్వామి, కుడికిల్ల తిర్పతయ్య ఉన్నారు. ఉపాధ్యక్షులు, జాయింట్ సెక్రటరీలు, ప్రచార కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను కూడా ఎన్నుకున్నారు.ఈ కమిటీ ఐదేళ్ల పాటు పనిచేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలిపారు. కొత్త అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ కళాకారుల సంక్షేమం, ఉద్యోగాలు, వృద్ధులకు రూ.10 వేల ఫించన్, పక్కా గృహాల కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



- 32 బ్యాగుల బియ్యంతో బొలెరో సీజ్

అచ్చంపేట, ఆగస్టు 08 (వుదయం ప్రతినిధి):

అచ్చంపేట శివారులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎస్ఐ నరేష్ పట్టుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. అచ్చంపేట శివారు ప్రాంతంలో టీఎస్ 31 టిఏ 2726 నెంబర్ గల మహేంద్ర బొలెరో వాహనంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ పై కేసు నమోదు చేశారు.శనివారం ఎన్ఫోర్స్‌మెంట్ డిటి హేమ్లు నాయక్ సమక్షంలో పంచనామా నిర్వహించగా బొలెరో వాహనంలో 32 బ్యాగుల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ వాహనం గత సంవత్సరం కూడా అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుబడి కేసు నమోదైనట్లు డిటి హేమ్లు నాయక్ తెలిపారు.

# 22A నిషేధిత జాబితా పేరుతో కాంగ్రెస్ కొత్త అవినీతి నాటకం




- సామాన్యుల భూములను జాబితాలో చేర్చి వేధిస్తున్నారు - బిజెపి అధికార ప్రతినిధి దిలీపాచారి

హైదరాబాద్, ఆగస్టు 08 (వుదయం బ్యూరో):

22A నిషేధిత జాబితా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్యులపై కొత్త అవినీతి నాటకానికి తెరలేపిందని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీపాచారి ఆరోపించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ చట్టబద్ధమైన పత్రాలు, రిజిస్ట్రేషన్, అనుమతులు, పన్నులు ఉన్న ప్రైవేటు భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చి సామాన్యులను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనే దాదాపు 4.5 లక్షల ఎకరాల ప్రైవేటు భూమి నిషేధిత జాబితాలో ఉందని తెలిపారు. ఒకవైపు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతుండగా, చట్టబద్ధమైన ప్రజల ఆస్తులను మాత్రం జాబితాలో చేర్చి విక్రయించకుండా చేస్తున్నారని విమర్శించారు. పెద్దల భూములను రాత్రికి రాత్రే తొలగిస్తుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22A జాబితా నుంచి ఎన్ని భూములు తొలగించారు, ఎవరికి లబ్ధి చేకూరిందనే వివరాలతో వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధమైన ఆస్తులను నిర్ణీత గడువులో జాబితా నుంచి తొలగించి, టైమ్ బౌండ్ పరిష్కార వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. సామాన్యులను వేధిస్తే బిజెపి ఉద్యమాలు చేస్తుందని హెచ్చరించారు



# గ్రేటర్ హైదరాబాద్



## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

- ఉద్యోగ భద్రత కల్పించి. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలి
- సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి: తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ



**ముషీరాబాద్,ఆగస్టు 08(ఉదయం):** తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీలు, వైద్య, విద్య, వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, అటవీ, పోలీస్, సచివాలయం, విశ్వవిద్యాలయాలు, సంక్షేమ శాఖలు తదితర విభాగాల్లో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సుమారు ఐదు లక్షల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సేవలందిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ పేర్కొంది.ప్రభుత్వ పాలనలో కీలకంగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రం ఉద్యోగ భద్రత లేకపోవడం, తక్కువ వేతనాలు, ఏజెన్సీల దోపిడీ, కార్మిక హక్కుల ఉల్లంఘన కొనసాగడం దారుణమని జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

**ఘనంగా జేఏసీ ఆవిర్భావ దినోత్సవం**

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధించాలనే లక్ష్యంతో 2023 ఆగస్టు 23న హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లోని శాతవాహన ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ కమిటీ ఆవిర్భవించిందని తెలిపారు.రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వారి హక్కుల సాధన కోసం జేఏసీ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు.జేఏసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించినట్లు రాష్ట్ర కమిటీ వెల్లడించింది. కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన పెద్ద సంఖ్యలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు హాజరయ్యారు.

**మూడేళ్లుగా నిరంతర పోరాటం**

గత మూడు సంవత్సరాలుగా జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉద్యోగుల ఆత్మీయ సమావేశాలు, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, మహాధర్నాలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు, ప్రెస్‌మీట్లు, కలెక్టర్లకు వినతిపత్రాలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఉన్నతాధికారులతో సమావేశాలు, రాష్ట్రస్థాయి నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను శాసనసభ, మీడియా, ప్రజా చర్చల్లో ప్రధాన అంశంగా నిలబెట్టడంలో జేఏసీ కీలక పాత్ర పోషించిందన్నారు. వేలాది మంది ఉద్యోగులను సంఘటితం చేసి ఉద్యమ శక్తిగా తీర్చిదిద్దామని చెప్పారు.

**హామీలు అమలు చేయాలి**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పేరుకుపోయాయని, జేఏసీ నిరంతర ప్రజాస్వామ్య ఉద్యమాల ఫలితంగానే ప్రభుత్వం స్పందించే పరిస్థితి ఏర్పడిందని నాయకులు పేర్కొన్నారు.అయితే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఉద్యోగులకు కల్పిస్తామని ప్రకటించిన భరోసాలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. అనేక శాఖల్లో ఉద్యోగులు నెలల తరబడి జీతాల కోసం ఎదురుచూస్తున్నారని, ఏజెన్సీల దోపిడీ, కార్మిక హక్కుల ఉల్లంఘనలు ఇంకా కొనసాగుతున్నాయని ఆరోపించారు.ఇకనైనా ప్రభుత్వం ఆలస్యం చేయకుండా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించి, శాశ్వత పరిష్కారం చూపాలని జేఏసీ డిమాండ్ చేసింది.

**జేఏసీ ప్రధాన డిమాండ్లు**

కాంట్రాక్టర్, ఏజెన్సీ వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి ప్రభుత్వం నేరుగా ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి.సుప్రీంకోర్టు తీర్పుల స్ఫూర్తి మేరకు "సమాన పనికి సమాన వేతనం" అమలు చేయాలి.ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించే ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి.పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, వార్షిక ఇంక్రిమెంట్లు, చెల్లింపు సెలవులు, ప్రసూతి సెలవులు తదితర కార్మిక హక్కులు పూర్తిస్థాయిలో అమలు చేయాలి.విధి నిర్వహణలో మరణించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలి.మహిళా ఉద్యోగులకు పూర్తి స్థాయి భద్రత కల్పించి, ప్రసూతి హక్కులను అమలు చేయాలి. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు కేవలం ఉద్యోగుల సమస్యలు మాత్రమే కాదని, ఇవి సామాజిక న్యాయం, కార్మిక హక్కులు, గౌరవప్రదమైన ఉపాధికి సంబంధించిన అంశాలని జేఏసీ నాయకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కోదండరాం, పృథ్వీరాజ్, బక్క జడ్సన్, మురళీధర్ రావు, పులి లక్ష్మయ్య (రాష్ట్ర అధ్యక్షులు), దోయిపడి శ్రీధర్ (ప్రధాన కార్యదర్శి), దుర్గం శ్రీనివాస్, సంతోష్, రాజమహ్మద్, జ్యోతి, పద్మ, విజయలక్ష్మి, క్రాంతికుమార్, గుగులోత్ ప్రవీణ్ నాయక్, సురేందర్ గౌడ్, రవికిరణ్, బాలకృష్ణ రెడ్డి, శేఖర్ రెడ్డి, నజీర్ తదితర రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు లేకపోయినా ఆందోళన చెందవద్దు

### నోటీసు అందిన ఓటర్లు మాత్రమే సంబంధిత AEROలకు అవసరమైన పత్రాలు సమర్పించాలి



**రంగారెడ్డి జిల్లా ఆగస్టు7(ఉదయం)** రంగారెడ్డి జిల్లా పరిధిలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR-2026) ప్రక్రియలో భాగంగా డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు కనిపించని లేదా సంబంధిత కారణాలతో నోటీసులు అందుకున్న ఓటర్లు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని జిల్లా ఎన్నికల యంత్రాంగం స్పష్టం చేసింది. నోటీసు జారీ చేయడం అనేది ఓటరు పేరు తుది ఓటరు జాబితా నుంచి తొలగించినట్లు కాదని, సంబంధిత ఓటరు తన అర్హతను నిరూపించుకునేందుకు అవసరమైన పత్రాలను సమర్పించేందుకు అవకాశం కల్పించడమేనని అధికారులు తెలిపారు.నోటీసులు అందుకున్న ఓటర్లు మాత్రమే తమకు వర్తించే పత్రాలలో సంబంధిత పత్రం యొక్క స్వయంగా ధృవీకరించిన (Self Attested) ప్రతిని సంబంధిత **AERO (Assistant Electoral Registration Officer)**కు సమర్పించాలని సూచించారు.

సమర్పించగల పత్రాలు

- కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు లేదా ప్రభుత్వ రంగ సంస్థల్లో (PSU) పనిచేసే ఉద్యోగి/పెన్షనర్‌కు జారీ చేసిన గుర్తింపు కార్డు లేదా Pension Payment Order (PPO).
- 01.07.1987కు ముందు భారతదేశంలో ప్రభుత్వం, స్థానిక సంస్థలు, బ్యాంకులు, పోస్టాఫీసు, LIC లేదా ప్రభుత్వ రంగ సంస్థలు జారీ చేసిన గుర్తింపు కార్డు/ధృవీకరణ పత్రం/ఇతర అధికారిక పత్రం.
- సంబంధిత అధికార సంస్థ జారీ చేసిన జనన ధృవీకరణ పత్రం (Birth Certificate).
- పాస్‌పోర్ట్.
- గుర్తింపు పొందిన విద్యా బోర్డులు/విశ్వవిద్యాలయాలు జారీ చేసిన మెట్రిక్యులేషన్/విద్యా ధృవీకరణ పత్రం.
- సంబంధిత రాష్ట్ర అధికార సంస్థ జారీ చేసిన శాశ్వత నివాస ధృవీకరణ పత్రం (Permanent Residence Certificate).
- అటవీ హక్కుల ధృవీకరణ పత్రం (Forest Rights Certificate).
- సంబంధిత అధికార సంస్థ జారీ చేసిన OBC/SC/ST లేదా ఇతర కుల ధృవీకరణ పత్రం.
- వర్తించే చోట **National Register of Citizens (NRC)**కు సంబంధించిన పత్రాలు.
- చట్టం/పరిపాలనా నిబంధనల ప్రకారం ప్రభుత్వ అధికారులు నిర్వహించే Family Register.
- ప్రభుత్వం జారీ చేసిన భూమి/ఇంటి కేటాయింపు ధృవీకరణ పత్రం.
- ఆధార్‌కు సంబంధించి, భారత ఎన్నికల సంఘం 09.09.2025న జారీ చేసిన లేఖ నం. **23/2025ERS/Vol.II (AnnexureII)**లో పేర్కొన్న మార్గదర్శకాలు వర్తిస్తాయి.

జనన తేదీ ఆధారంగా సమర్పించాల్సిన పత్రాలు01.07.1987కు ముందు భారతదేశంలో జన్మించిన వారు:

తమ జనన తేదీ మరియు/లేదా జన్మస్థలాన్ని నిర్ధారించే పై జాబితాలోని ఏదైనా ఒక పత్రాన్ని సమర్పించాలి.01.07.1987 నుంచి 02.12.2004 మధ్య భారతదేశంలో జన్మించిన వారు:తమ జనన తేదీ మరియు/లేదా జన్మస్థలాన్ని నిర్ధారించే పత్రంతో పాటు, తండ్రి లేదా తల్లి జనన తేదీ/జన్మస్థలాన్ని నిర్ధారించే పత్రాన్ని కూడా సమర్పించాలి.02.12.2004 తర్వాత భారతదేశంలో జన్మించిన వారు:

తమకు సంబంధించిన పత్రంతో పాటు తండ్రి మరియు తల్లి జనన తేదీ/జన్మస్థలాన్ని నిర్ధారించే పత్రాలను సమర్పించాలి. తల్లిదండ్రుల్లో ఎవరైనా భారతీయ పౌరులు కాకపోతే, వారి జనన సమయంలో చెల్లుబాటులో ఉన్న పాస్‌పోర్ట్, వీసా ప్రతులను సమర్పించాలి.భారతదేశం వెలుపల జన్మించిన వారు:

విదేశాల్లోని భారత రాయబార కార్యాలయం/మిషన్ జారీ చేసిన జనన నమోదు ధృవీకరణకు సంబంధించిన ఆధారాన్ని సమర్పించాలి. రిజిస్ట్రేషన్/నేచురలైజేషన్ ద్వారా భారతీయ పౌరసత్వం పొందిన వారు:

భారతీయ పౌరసత్వ నమోదు ధృవీకరణ పత్రం (Certificate of Registration of Citizenship) సమర్పించాలి.

నోటీసు అందిన వారికి మాత్రమే పత్రాల సమర్పణడ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు లేకపోయిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని జిల్లా ఎన్నికల యంత్రాంగం స్పష్టం చేసింది. సంబంధిత AERO నుంచి నోటీసు అందుకున్న ఓటర్లు మాత్రమే, నోటీసులో సూచించిన విధంగా అవసరమైన పత్రాలను సమర్పించాలి.నోటీసు అందినంత మాత్రాన ఓటరు పేరు తొలగించబడినట్లు భావించరాదని, సంబంధిత పత్రాలను నిర్ణీత విధానంలో సమర్పించి తమ అర్హతను నిర్ధారించుకునే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.అందువల్ల నోటీసులు అందుకున్న ఓటర్లు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా, నోటీసులో పేర్కొన్న సూచనల ప్రకారం సంబంధిత AEROను సంప్రదించి అవసరమైన పత్రాలను సమర్పించాలని జిల్లా ఎన్నికల యంత్రాంగం సూచించింది.అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, పారదర్శకంగా మరియు నిబంధనలకు అనుగుణంగా SIR-2026ప్రక్రియను నిర్వహించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.

## పోతరాజు తెలంగాణ సంస్కృతికి ప్రతిరూపం

- భక్తిని చాటాలి.. భయాన్ని కాదు



**చేవెళ్ల ఆగస్టు8(ఉదయం)** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగలో పోతరాజుకు ప్రత్యేక స్థానం ఉందని విశ్వహిందూ పరిషత్ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల సురేందర్ శనివారం పేర్కొన్నారు.పోతరాజు సంప్రదాయాన్ని భక్తి, వీరత్వానికి ప్రతిరూపంగా కొనసాగించాలి తప్ప భయపెట్టే ప్రదర్శనలకు వేదికగా మార్చకూడదని ఆయన సూచించారు.అమ్మవారి వెంట నడుస్తూ వీరత్వాన్ని ప్రతిబింబించే పోతరాజు రూపం తరతరాలుగా ప్రజల భక్తిభావంతో ముడిపడి ఉందన్నారు.గతంలో పోతరాజు వేషధారణ, నృత్యాలు, విన్యాసాలను చూసి పెద్దల్లో భక్తి భావం ఉప్పొంగేదని, చిన్నారులు సైతం ఆసక్తిగా వేడుకలను తిలకించేవారని గుర్తుచేశారు.అయితే కాలానుగుణంగా కొన్ని ప్రాంతాల్లో పోతరాజు ప్రదర్శనల తీరు మారుతోందని, భక్తి, వీరత్వం స్థానంలో భయపెట్టే వేషధారణలు, మితిమీరిన విన్యాసాలు కనిపించడం ఆందోళన కలిగిస్తోందన్నారు.కుటుంబ సమేతంగా బోనాల వేడుకలను వీక్షించేందుకు వచ్చే చిన్నారులు కొన్ని ప్రదర్శనలను చూసి భయపడుతున్న పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు.

**భక్తికి బదులు భయం ఎందుకు?**

పోతరాజు సంప్రదాయం భయాన్ని కలిగించేందుకు ఉద్దేశించినది కాదని మద్దెల సురేందర్ అన్నారు.అమ్మవారి శక్తికి ప్రతీకగా, .కొన్ని వేడుకల్లో మద్యం వంటి వ్యసనాల ప్రభావం కనిపించడం కూడా ఆందోళనకరమని పేర్కొన్నారు.భక్తి కార్యక్రమాల్లో సంయమనం ,నియమ నిష్ఠలు పాటించాలని సూచించారు.పండుగ పేరుతో సంప్రదాయానికి విరుద్ధమైన చర్యలకు తావిస్తే బోనాల అసలు స్ఫూర్తి దెబ్బతింటుందని అన్నారు. సోషల్ మీడియా కోసం సంప్రదాయాన్ని మార్చొద్దుసామాజిక మాధ్యమాల్లో ప్రచారం పొందాలనే ఆరాటంతో కొన్ని సందర్భాల్లో సంప్రదాయ ప్రదర్శనల స్వరూపం మారుతోందని సురేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువ మంది దృష్టిని ఆకర్షించాలనే ఉద్దేశంతో మితిమీరిన విన్యాసాలు, భయపెట్టే రూపాలను ప్రదర్శించడం సంప్రదాయ పరిరక్షణకు ఏమాత్రం ఉపయోగపడదన్నారు.

**సంప్రదాయానికి గౌరవం ఇవ్వాలి**

బోనాల పండుగకు ప్రజలు కేవలం వినోదం కోసం కాకుండా అమ్మవారిని దర్శించుకోవడానికి, మొక్కులు చెల్లించుకోవడానికి కుటుంబాలతో కలిసి వస్తారని తెలిపారు.అందులో చిన్నారులు కూడా ఉంటారని, వారికి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవం, భక్తి భావం కలిగించేలా వేడుకలు నిర్వహించాలని సూచించారు.పోతరాజు ప్రదర్శనల్లో భక్తి, వీరత్వం, సంప్రదాయ విలువలు ప్రతిబింబించాలని, భయపెట్టే వేషధారణలు, మితిమీరిన విన్యాసాలు, అసభ్యకరమైన ప్రదర్శనలకు చోటు ఉండకూడదని స్పష్టం చేశారు.

సంప్రదాయ స్ఫూర్తిని కాపాడాలి

కాలానికి అనుగుణంగా వేడుకల్లో కొత్తదనం రావచ్చని, అయితే ఆ కొత్తదనం సంప్రదాయానికి భంగం కలిగించేలా ఉండకూడదని అన్నారు.పోతరాజు రూపం కనిపించినప్పుడు అమ్మవారి జాతర, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ వైభవం గుర్తుకు రావాలే తప్ప భయానక దృశ్యాలు గుర్తుకు రాకూడదన్నారు.

ఇప్పటికైనా నిర్వాహకులు, పోతరాజు కళాకారులు, భక్తులు ఈ అంశంపై ఆలోచించాలని మద్దెల సురేందర్ సూచించారు. పిల్లలు భయపడకుండా, కుటుంబాలు ఇబ్బంది పడకుండా, ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పాల్గొనేలా బోనాల వేడుకలు నిర్వహించాలని కోరారు."సంప్రదాయం అంటే కాలంతో పాటు మారిపోవడం కాదు.. కాలం మారినా దాని అసలు స్ఫూర్తిని కాపాడటం.పోతరాజును చూసినప్పుడు భక్తి కలగాలి.. భయం కాదు. అదే బోనాల పండుగకు, తెలంగాణ సంప్రదాయానికి మనం ఇచ్చే నిజమైన గౌరవం" అని మద్దెల సురేందర్ పేర్కొన్నారు.

## బీరంగూడలో సీసీ రోడ్డును ప్రారంభించిన కాట దంపతులు







**అమీనపూర్ ఆగస్టు 08, ఉదయం** అమీనాపూర్ , బీరంగూడ డివిజన్ పరిధిలోని ఎస్.ఎల్.ఎన్. హోమ్స్ నుంచి నల్లూరి హైట్స్ అపార్ట్మెంట్స్ వరకు మాజీ కౌన్సిలర్ లావణ్య శశిధర్ రెడ్డి సొంత నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కాట దంపతులు మాట్లాడుతూ..ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు వ్యక్తిగతంగా ముందుకొచ్చి సీసీ రోడ్డు నిర్మించడం అనేది చాల అభినందనీయమని పేర్కొన్నారు . ఇక రహదారి నిర్మాణంతో స్థానిక ప్రజల రోడ్డు మరియు రాకపోకలకు ఇబ్బందులు పూర్తిగా తొలగనున్నాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పురాతన శ్రీ అనంతపద్మనాభస్వామి ఆలయంలో వైభవంగా 'అన్న సమర్పణ'





**శంకర్‌పల్లి ఆగస్టు 08(ఉదయం)** శంకర్‌పల్లి మండలంలోని మహాలింగాపురం-లింగయ్యగూడెం పరిధిలో ఉన్న పురాతన శ్రీశ్రీశ్రీ అనంతపద్మనాభస్వామి ఆలయంలో నిర్వహించిన అన్న సమర్పణ కార్యక్రమంలో బీజేపీ ఎండోమెంట్ సెల్ ధార్మిక రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్ ఆర్. సతీష్ కుమార్ (నరేష్ కుమార్) పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భోజనాన్ని కూర్చొని తినడం మన సనాతన సంప్రదాయంలో భాగమని, దీనివల్ల ఆరోగ్యపరమైన ప్రయోజనాలు కూడా ఉన్నాయని తెలిపారు.

అలాగే "నిత్యకల్యాణం పచ్చతోరణం" అనే సంప్రదాయానికి అనుగుణంగా ఆలయాన్ని మామిడి ఆకులతో అలంకరించాలని సూచిస్తూ, స్వయంగా మామిడి ఆకుల తోరణాలను కట్టించారు.చిన్నారులు కూడా మన సనాతన సంప్రదాయాలను పాటించేలా బొట్టు పెట్టుకోవడం, సంప్రదాయాలను గౌరవించడం వంటి విషయాలను వారికి వివరించారు.మన సంస్కృతి, సంప్రదాయాలు,

ఆచారాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మహాలింగాపురం బిజెపి సీనియర్ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ శ్రీ కృష్ణారెడ్డి , ఎన్ నరసింహా రెడ్డి, ఆలయ పూజారి నర్సింలు, శివ ఫౌండేషన్ సభ్యులు సి నరసింహ రెడ్డి, మహిళా భక్తులు గ్రామస్తులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## అధికారం పోతే తిరిగి సాధించుకోవచ్చు..

## సంస్కృతి పోతే మూలాలను తిరిగి పొందలేం



- తెలంగాణ అస్తిత్వం, వనరుల పరిరక్షణ కోసం జయశంకర్ సార్ చేసిన ఆలోచనలు చిరస్మరణీయం
- టాస్క్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ స్మారకోపన్యాసం సీనియర్ సంపాదకుడు అల్లం నారాయణ

**ముషీరాబాద్,ఆగస్టు08(ఉదయం)** అధికారం కోల్పోతే తిరిగి సాధించుకోవచ్చని.. కానీ ఒకసారి సంస్కృతిని కోల్పోతే దాని మూలాలను తిరిగి సాధించుకోవడం సాధ్యం కాదనే విషయాన్ని ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ముందుగానే గుర్తించారని సీనియర్ సంపాదకుడు అల్లం నారాయణ అన్నారు. తెలంగాణ అస్తిత్వం, సంస్కృతి, వనరుల పరిరక్షణ కోసం జయశంకర్ చేసిన ఆలోచనలు, సూచనలు నేటికీ ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ స్మారకోపన్యాసం కార్యక్రమంలో అల్లం నారాయణ మాట్లాడారు. నిర్మాణాత్మక ఆలోచనలు, స్పష్టమైన లక్ష్యాలతో సాగిన తెలంగాణ ఉద్యమానికి.. ప్రస్తుతం దేశంలో కనిపిస్తున్న ఉద్యమాలకు ఎంతో తేడా ఉందన్నారు. ప్రస్తుతం దేశంలో ఉద్యమాల స్వరూపం మారుతోందని, వ్యంగ్యం, మీమ్స్, సోషల్ మీడియా వంటి వాటి ద్వారా యువత తమ నిరసనను వ్యక్తం చేస్తోందని చెప్పారు. గత 12 ఏళ్లుగా దేశ రాజకీయాల్లో తిరుగులేని నాయకుడిగా కొనసాగుతున్న ప్రధాని నరేంద్ర మోదీ ప్రభావాన్ని జంతర్‌మంతర్ వద్ద నిరసనలు తెలిపిన యువత సవాల్ చేసిందని పేర్కొన్నారు. కేవలం మూడు నెలల్లోనే యువత ఆ ప్రభావాన్ని ప్రశ్నించే స్థాయికి వచ్చిందని అన్నారు.

**తెలంగాణే సర్వస్వంగా భావించిన జయశంకర్**

తెలంగాణనే సర్వస్వంగా భావించిన వ్యక్తి ఆచార్య జయశంకర్ అని అల్లం నారాయణ అన్నారు. తెలంగాణ విఫలమైన చోటే అందుకు గల కారణాలను అన్వేషించి.. పరిష్కార మార్గాలను సూచించారని తెలిపారు. తెలంగాణ ఏం కోల్పోయిందో గుర్తించేందుకు జయశంకర్ అనేక నిర్మాణాత్మక ప్రతిపాదనలు చేశారని, వాటికి ప్రాంతీయ అభివృద్ధి కోణాన్ని జోడించారని వివరించారు. తెలంగాణ ఉద్యమాన్ని కొందరు అస్తిత్వ ఉద్యమంగానో, విచ్ఛిన్నకారుల ఉద్యమంగానో చిత్రీకరించినప్పటికీ.. తన వనరులను తానే కాపాడుకోవడం, అభివృద్ధిని సాధించడం, స్వీయ అస్తిత్వాన్ని నిర్మించుకోవడం కోసం సాగిన పోరాటమే తెలంగాణ ఉద్యమం అని జయశంకర్ స్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు.ముల్కీ ఉద్యమం నుంచి మలిదశ ఉద్యమం వరకు కీలక పాత్ర

1952 ముల్కీ 'గో బ్యాక్' ఉద్యమం నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు ఆచార్య జయశంకర్ కీలక పాత్ర పోషించారని అల్లం నారాయణ అన్నారు. ఒప్పందాల ఆధారంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లో అనేక ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయని, వాటి వల్ల ఏర్పడిన వైరుధ్యాలకు పరిష్కారమే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు దారితీస్తుందని జయశంకర్ విశ్లేషించారని చెప్పారు. వైరుధ్యం ఎక్కడ ఉందో.. పరిష్కారం కూడా అక్కడే ఉంటుందని ముందుగానే గుర్తించిన దూరదృష్టి గల ఆలోచనాపరుడు జయశంకర్ అని అల్లం నారాయణ కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన కృషి, అందించిన సిద్ధాంతపరమైన దిశానిర్దేశం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు.


**పత్రికా ప్రకటన**

యావత్ ప్రజానీకానికి తెలియజేయునది. నేను షేక్ మొహమ్మద్ శంషాద్. తండ్రి మహమ్మద్ అబ్దుల్ అజీజ్. పాత పాల్వంచ. అది గతము పేరు. ప్రస్తుతం నా యొక్క పేరు మొహమ్మద్ శంషాద్. (Mohammad Shamshad S/o MohammadAJIJ) తండ్రి మొహమ్మద్ అజీజ్. (HNO R 311/2 RT Colony OLd Palvancha) పాత పాల్వంచ. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గా పేరు మార్చుకున్నాను కావున ఇప్పటినుండి అన్ని లావాదేవీలు (Mohammad Shamshad ) మొహమ్మద్ శంషాద్ పేరు మీదనే జరుగుతాయని పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాను.



IN THE COURT OF THE HON'BLE PRL DISTRICT AND SESSIONS JUDGE RANGA REDDY DISTRICT AT : L.B NAGAR
GWOP NO. 38 OF 2026

BETWEEN :
Smt. Kamal Rajesh Patel & others ...Plaintiff
AND
The Tahsildhar,
Saroorangar Mandal & others
2. All Concerned ...Defendants

To,
To whomever so it may be all concerned

Take notice that the plaintiffs have filed the above suit for a declaration that they are the legal heirs of late Senghani Rajesh Patel, vide GWOP. No. 38 of 2026 on the file of the Hon'ble Prl District and Sessions Judge, Ranga Reddy District at L.B. Nagar, against you and other defendants. The suit is posted to 31-08-2026 at 10:30 A.M. for your appearance.

Therefore, you are hereby called upon to appear before the said Hon'ble Court on the aforesaid date and file your objections, if any. Failing which, the Hon'ble Court shall proceed to decide the matter on merits and pass appropriate orders based on the material available on record.

//By Order of the Court//

Sd/-
G.Shankaraiah
Advocate
Office: Flat No.301,
DKR MANSION
Ushodhaya colony,
Hayathnagar Hyderabad.
Cell: 9848082431
shankaraiahadv@gmail.com




ఇక సాంప్రదాయక రాజకీయాలు కష్టమే

"దేశంలో యువతకు ప్రాధాన్యం మరింతగా పెరిగింది. దక్షిణ ఆసియాలోని రాజకీయ పార్టీలు గతంలో మాదిరిగా సాంప్రదాయ రాజకీయాలను కొనసాగించడం కష్టమే. రాబోయే 2029 ఎన్నికల్లో జెన్ జీ అతిపెద్ద ఓటరు సమూహంగా ఉండబోతోంది. ఒక్కోసారి మా పార్టీకి వ్యతిరేకంగా నేను స్వతంత్రంగా అభిప్రాయాలు వ్యక్తం చేస్తుంటా. కాంగ్రెస్‌లోని ప్రజాస్వామ్య స్ఫూర్తికి ఇదే నిదర్శనం. ఇది భారతీయ జనతా పార్టీలో సాధ్యమేనా? నా మనసుకు దగ్గరైంది కాబట్టి కాంగ్రెస్‌లో కొనసాగుతున్నా. దేశవ్యాప్తంగా కాక్రోచ్ జనతా పార్టీ లేవనెత్తిన అంశాలను మా పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇది వరకే ప్రస్తావించారు. కానీ, సీజేపీకి వచ్చిన స్థాయిలో అప్పుడు ప్రజాస్పందన రాలేదు."

**- శశి థరూర్, కాంగ్రెస్ ఎంపీ**

## వే'మన' పద్యం

ఎద్దుకైనఁగాని యేడాది తెల్పిన
మాట దెలిసి నడచు మర్మ మెఱిఁగి
మొప్పె తెలియలేడు ముప్పదేండ్లకునైన
విశ్వదాభిరామ! వినురవేమ!



# సంపాదకీయం

పశ్చిమాసియాలో ఎప్పుడు ఏం జరుగనుందో, శాంతి ఎప్పుడు నెలకొంటుందో ఎవరికీ తెలియని స్థితి. సంక్షోభంపై తొలి రోజుల్లో తాపీగా అసలేమీ జరగనట్లు, జరిగినా మనకేమీ కాదన్నట్లు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్న మన ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల మనకు అవసరమైన ఎరువులు, ఇంధనం, గ్యాస్ దిగుమతుల గురించి సమీక్ష జరపాల్సి వచ్చింది. అఫ్ కోర్స్, పార్లమెంటుకు వచ్చి ఇరాన్‌పై దాడులతో దేశం ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఇంతవరకు చర్చించాలన్న ఆలోచన రాలేదనుకోండి. ఇక మోడీ జిగినీ దోస్తు డోనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని అమెరికాకు దెబ్బమీద దెబ్బ తగులుతున్నా బుద్ధిరావటం లేదు. ఫిబ్రవరి 28న ఇజ్రాయిల్‌తో కలసి ఇరాన్ మీద ఉత్తి పుణ్యానికి చేసిన దాడులతో స్వయంగా సృష్టించిన సంక్షోభం నుంచి బయటపడేందుకు దిక్కు తోచటం లేదు. ఇరాన్‌తో ఒక రోజు యుద్ధం అంటారు మరోరోజు శాంతి ఒప్పందం అని చెబుతారు. మరుసటి రోజే ఉల్లంఘించి ఇరాన్‌ను చావు దెబ్బతీస్తా అంటూ దాడు లకు తెగబడతాడు. కొద్ది రోజుల తరువాత ఇరాన్ దిగివచ్చింది గనుక నిలిపివేశా నంటాడు. ప్రారంభం నుంచి ఇదే తంతు. ఇప్పుడు మరోసారి ఒప్పందం గురించి మాట్లాడుతున్నాడు. 'క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్' అని కవి ఆడవారిని ఆడిపోసుకున్నాడు గానీ ట్రంప్‌ను చూస్తే కచ్చితంగా తిరగరాసి ఉండేవాడు. నవంబరు మూడవ తేదీన జరిగే మధ్యంతర ఎన్నికల్లో ఏదోవి

## పశ్చిమాసియాలో ట్రంప్ కుట్రలు

దంగా గట్టేందుకు పశ్చిమా సియాలో ట్రంప్ ఇంకా కుట్రలను కొనసాగిస్తూనే ఉన్నాడు. ఎక్కడో జరిగిన పేలుడుకు ఇద్దరు తమ సైనికులు మరణించారనే సాకుతో ఒప్పందాన్ని పక్కన పెట్టి లెబనాన్‌పై మరోసారి దాడులకు ఇజ్రాయిల్ పూనుకుంది. ఐక్య అరబ్ ఎమిరేట్స్(యుఏఇ) గల్ఫ్ దేశాల్లో ఇరాన్‌కు వ్యతిరేకంగా ఇజ్రాయిల్‌తో నేరుగా జట్టుకట్టింది, విభిన్న ఇసిడి పాత్ర పోషిస్తున్నది. దానికి అమెరికా మద్దతు సరేసరి. లెబనాన్‌లో సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్న ఇరాన్ అనుకూల హిజబుల్లా నాయకత్వాన్ని హత మార్చేందుకు, దానికి పట్టున్న దక్షిణ లెబనాన్ ప్రాంతాలపై ఇజ్రాయిల్ దాడులు చేయటమే కాదు, అనేక ప్రాంతాలను ఆక్రమించుకున్న ది.యుఏఇ నగరమైన దుబాయ్‌లో ఏడు చోట్ల పేలుళ్లు జరిగాయంటే ఎందుకు అన్నది వేరే చెప్ప నవసరం లేదు. ఇరాన్ మద్దతు ఉన్న ఎమెన్‌లోని హౌతీలు ఎర్ర సముద్రం,అరేబియా సముద్రాలను కలిపే బాబ్ ఎల్ మండాబ్ జల సంధిలో ఆంక్షలు విధించి ఉల్లంఘించిన సౌదీ అరే బియా నౌకలపై దాడి చేశారు. దానికి ప్రతిగా ఇరాక్‌లోని ఇరాన్ అనుకూల సాయుధ శక్తులపై అమెరికాతో కలసి సౌదీ వైమానిక దాడులు చేసింది. ఫిబ్రవరి నుంచి చూసినపుడు నేరుగా దాడులు చేసే జరిగిందేమీ లేకపోగా పరువు పోగొట్టుకోవాల్సి వస్తుందనే ఎత్తుగడతో అమెరికా తన తొత్తులతో ఆ పని చేయిస్తున్నది. అమెరికా అతి తెలివితేటలను గమనించి ఇరాన్ కూడా తన వ్యూహాన్ని మార్చుకున్నది. ట్రంప్‌ను ఒక పక్కకు నెట్టేందుకు పశ్చిమాసియాలో తనకు అనుకూలంగా పనిచేసే సాయుధ శక్తులన్నింటిని రంగంలోకి దించింది. ప్రాంతీయ రంగాలను విస్తరిస్తామని, ఉక్కిరిబిక్కిరి చేసే ఎత్తుగడలను అనుసరిస్తామని పరోక్షంగా ప్రత్యక్షంగా చెబుతూనే ఉంది. అమెరికా మాదిరే తాను కూడా మద్దతుదార్లతో కాగల కార్యాలను నడిపి స్తామని చెబుతోంది. పాకిస్తాన్ ద్వారా భుజాలపై పెట్టుకొని విమానాలు, క్షిపణులను కూల్చివేసే ఆయుధాలను టెహరాన్‌కు చైనా అందించిందనే వార్తలు వచ్చాయి. అవి నిజమో కాదో గానీ తన మిత్రదేశాలకు అమెరికా ఎలా ఆయుధాలు పంపుతున్నదో ఇరాన్ కూడా తన శ్రేయోభిలాషుల నుంచి అలాంటి సాయం పొందితే తప్పేమిటి! ఇరాన్‌పై దాడుల ప్రారంభంలో సంయమనం పాటించిన హౌతీ సాయుధులు తొమ్మిది నెలల విరామం తరువాత గతనెల మూడో వారంలో ఎర్ర సముద్రంలో దాడులకు ఉపక్రమించారు. హోర్ముజ్ జలసంధిపై అమెరికా కేంద్రీకరణను దెబ్బతీసేందుకే ఇది అన్నది స్పష్టం. కీలకమైన ఎర్రసముద్రం, ఏడెన్ జలసంధిపై పట్టుకోసం సౌదీని ప్రోత్సహించిన అమెరికా ఎమెన్ మీద దీర్ఘకాలం దాడులు చేయించింది. అక్కడ ఇరాన్‌కు మద్దతిచ్చే హౌతీలు రాజధాని సనాతో సహా అనేక ప్రాంతాలపై పట్టు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సౌదీ అరేబియా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా చమురు ఎగుమతి చేస్తున్నది. దాన్ని దెబ్బతీసే ఎత్తుగడ కూడా హౌతీల దాడుల వెనుక ఉందని చెబుతున్నారు.

**రచనలు పంపండి**

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయ పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించగలరు.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# ఆశలు నింపిన కొత్త తరం

ఈ ఏడాది మే 15న నిరుద్యోగ యువతపై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు వ్యంగ్య ప్రతిస్పందనగా 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఆవిర్భ వించి ఉండవచ్చు. అయితే కొద్ది నెలల్లోనే అది ఊహించని రీతిలో జాతీయ రాజకీయాల్లోచర్చనీయాంశంగా మారింది. ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలపై అభిజిత్ దీప్కే మరుసటి రోజే "బొద్దింకలన్నీ ఒక్కటైతే ఏమవుతుంది?" అంటూ చేసిన చమత్కార వ్యాఖ్యకు విశేష స్పందన లభించింది. అనంతరం వ్యంగ్యాత్మక 'కాక్రోచ్ జనతా పార్టీ'లో చేరదలిచిన వారి కోసం ఆయన ఒక ఆన్‌లైన్ ఫారమ్‌ను అందుబాటులోకి తెచ్చారు. తొలి 24 గంటల్లోనే దానికి యాభైవేల మంది స్పందించగా, కొద్ది రోజుల్లోనే ఆ సంఖ్య లక్షలకు చేరింది. ఢిల్లీలో నిరసనలకు అనుమతి ఉన్న ముఖ్యమైన ప్రదేశాల్లో జంతర్‌మంతర్ ఒకటి. ప్రారంభంలో సీజేపీ చేపట్టిన నిరసన దీక్షలో పాల్గొన్న వారి సంఖ్య తక్కువగానే ఉన్నా, క్రమంగా అది పెరిగింది. అనంతరం సీజేపీతో పాటు వామపక్ష విద్యార్థి సంఘాలు జూలై 20న 'పార్లమెంట్ మార్చ్'కు పిలుపునిచ్చాయి. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు లాఠీచార్జి, బాష్పవాయువు, పెల్లెట్ గన్స్ వినియోగంతో సహా తీవ్ర బలప్రయోగానికి దిగారు. జంతర్‌మంతర్ పరిసరాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం, మెట్రో సర్వీసులను నిలిపేయడం ద్వారా నిరసనకారులను ఒంటరి చేయవచ్చని వారు భావించారు. కానీ పరిస్థితి అందుకు విరుద్ధంగా మారింది.

సోషల్ మీడియాలో వరుసగా పోస్టులు వెల్లువెత్తడంతో పోలీసుల చర్యలు దేశవ్యాప్తంగా క్షణాల్లో చేరాయి. నేమ్‌ప్లేట్లు కూడా లేని



పోలీసులు యువ విద్యార్థులు, యువకులు, యువతు లపై ప్రయోగించిన హింసను ఆ పోస్టులు స్పష్టంగా చూపించాయి. యూనిఫాం లేని పోలీసులు లేదా పోలీసులతో కలిసి పనిచేస్తున్న వ్యక్తులు కూడా దాడుల్లో పాల్గొన్నట్లు కనిపించింది. ఎలాంటి రెచ్చగొట్టింపు లేకుండానే ఒక సీనియర్ పోలీసు అధికారి యువతిపై దాడి చేసిన దృశ్యాలు కూడా వైరల్ అయ్యాయి. దీంతో ఈ ఉద్యమం జంతర్‌మంతర్‌కే పరిమితం కాకుండా, ఇంటర్నెట్‌లోని వర్చువల్ ప్రపంచంలోనూ ప్రత్యక్షంగా కొనసాగింది.పోలీసులు అధిక బలప్రయోగంతో విద్యార్థులను, యువతను చెదరగొట్టేందుకు ప్రయత్నించడం ప్రభుత్వాలకు కొత్త విషయం కాదు. కొన్ని సందర్భాల్లో అది ఫలిస్తుంది, మరికొన్ని సందర్భాల్లో విఫలమవుతుంది. ఈసారి మాత్రం అది పూర్తిగా బెడిసికొట్టింది. జంతర్‌మంతర్‌కు మరింత మంది తరలిరావడమే కాకుండా, దేశవ్యాప్తంగా నిరసనలకు ఊపు నిచ్చింది. త్వరలోనే బీహార్, ఉత్తరప్రదేశ్, ముంబై, కోల్‌కతా తదితర ప్రాంతాల నుంచి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ నిరసనలు వ్యక్తమైన దృశ్యాలు సోషల్ మీడియాలో వెల్లువెత్తాయి. దీంతో ఇది ఢిల్లీలోని కొద్దిమంది విద్యార్థుల డిమాండ్‌గా కాకుండా, దేశవ్యాప్తంగా యువత గొంతుకగా మారింది. ఫలితంగా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే విషయంలో మోడీ ప్రభుత్వం తన ఆధిపత్యాన్ని కోల్పోయింది. భారత్‌లో రేడియోపై ప్రభుత్వ నియంత్రణ ఉండటానికి మరో కారణం, ఇతర దేశాల మాదిరిగా అది పూర్తిగా వ్యాపారీకరణ చెందకపోవడమే. అరవై, డెబ్భయ్యవ దశకాలను గుర్తుంచు కున్న వారికి రేడియో సిలోన్ గుర్తుండే ఉంటుంది. హిందీ సినీ పాటలను ప్రసారం చేస్తూ అది విస్తృత శ్రోతలను సంపాదిం చడంతో పాటు ప్రకటనల ఆదాయంలోనూ పెద్ద వాటాను దక్కించు కుంది. అనంతరం 1980-90 దశకాల్లో ఆర్థిక ఉదారీకరణతో టెలివిజన్ వేగంగా వ్యాపారీకరణ చెందింది. ప్రధానమంత్రి అయిన తర్వాత మోడీ చాలా వరకు వార్తల అజెండాను నియంత్రించగలిగారు. అయితే ఈసారి పరిస్థితి ఎందుకు మారింది? మొదటిది... దాదాపు అన్ని ప్రధాన ప్రవేశ, నియామక పరీక్షలను కేంద్రం పరిధిలోకి తీసుకు రావడంతో విద్యా వ్యవస్థలో ఒకే వైఫల్య కేంద్రం (సింగిల్ పాయింట్ ఆఫ్ ఫెయిల్యూర్) ఏర్పడిందనే అసంతృప్తి పెరిగింది. రెండోది... నీట్ మాత్రమే కాకుండా అనేక ఇతర పరీక్షల ప్రశ్నాపత్రాలు కూడా వరుసగా లీక్ కావడం. యువతకు, విద్యార్థులకు నిరంతరం నీతులు చెప్పే ప్రభుత్వం, తన సొంత వైఫల్యాలకు మాత్రం బాధ్యత వహించకపోవడం పట్ల యువతలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది.

**మారుతున్న వార్తల స్వరూపం**

'జెన్ జీ' లేదా మిల్లెనియల్స్ తర్వాతి తరం పూర్తిస్థాయి డిజిటల్ తరం. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జన్మించిన మా తరం 'బేబీ బూమర్స్', ఆ తర్వాత వచ్చిన మిల్లెనియల్స్‌తో పోలిస్తే జెన్ జీ పూర్తిగా భిన్నమైన సమాచార ప్రపంచంలో పెరిగింది. బూమర్స్ వార్తల కోసం ప్రధానంగా వార్తాపత్రికలపై ఆధారపడే వారు. మిల్లెనియల్స్ టెలివిజన్‌ను ప్రధాన సమాచార వనరుగా మలుచుకున్నారు. ప్రధాన టీవీ ఛానళ్లలో రాత్రి తొమ్మిది గంటల వార్తల్లో ఏది ప్రధానంగా ప్రసారమైతే, అదే మరుసటి రోజు వార్తాపత్రికల ప్రధాన శీర్షికగా మారేది. మా బూమర్స్ తరానికి రోజు ప్రారంభం ప్రముఖ పత్రికల మొదటి పేజీ వార్తలతోనే అయ్యేది. భారతదేశంలో రేడియో ఇతర దేశాల్లో మాదిరిగా పెద్ద పాత్ర పోషించలేదు. ఎందుకంటే దానిని చాలామంది ప్రభుత్వ గొంతుకగానే భావించేవారు. అయినప్పటికీ అరవై, డెబ్బై దశకాల్లో ప్రతి సాయంత్రం తొమ్మిది గంటల రేడియో వార్తలను క్రమం తప్పకుండా వినడం మా తల్లిదండ్రుల తరం దైనందిన అలవాటుగా ఉండేది. నేడు వార్తలను పత్రికలు లేదా టెలివిజన్ మాత్రమే నిర్ణయించడం లేదు. సోషల్ మీడియానే వార్తల ప్రవాహాన్ని ఎక్కువగా నిర్దేశిస్తోంది. ఏది వైరల్ అవుతుందో అదే వార్తగా మారుతోంది. ఏ అంశానికి ప్రాధాన్యం దక్కాలనేది ప్లాట్‌ఫారమ్‌ల కంటే వాటిని ఉపయోగించే ప్రజలే ఎక్కువగా నిర్ణయిస్తున్నారు. అల్గారిథమ్‌ల ద్వారా ప్లాట్‌ఫారమ్‌లు కొంతవరకు నియంత్రించగలిగినా, వేలాది మంది ఒకే అంశంపై ఒకేసారి పోస్టులు, ట్వీట్లు, రీల్స్ చేస్తే వాటిని పూర్తిగా అడ్డుకోవడం కష్టం.

డిజిటల్ మీడియా కూడా ప్రధానంగా ప్రకటనల ఆదాయంపైనే ఆధారపడుతుంది. అందువల్ల ఎక్కువ వీక్షణలు, ఎక్కువ స్పందన తెచ్చే కంటెంట్‌కే అల్గారిథమ్‌లు ప్రాధాన్యం ఇస్తాయి. ఫలితంగా వైరల్ అయ్యే అంశాలే ప్రజల ముందుకు ఎక్కువగా వస్తుంటాయి. సీజేపీ ఉద్యమం సాధించిన విజయం కేవలం తమ డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించేలా చేయడమే కాదు. ప్రభుత్వం తన వైఫల్యాలకు బాధ్యత వహించే పరిస్థితి తీసుకురావడం కూడా అంతే ముఖ్యమైన విజయం. కీలక అంశంలో విఫలమైతే సంబంధిత మంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలనే ప్రజాస్వామ్య సంప్రదాయాన్ని మోడీ ప్రభుత్వం అంగీకరించక తప్పలేదు. గతంలో ఒక పెద్ద రైలు ప్రమాదం అనంతరం రైల్వే మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి నైతిక బాధ్యత స్వీకరించి రాజీనామా చేశారు. కానీ ఇప్పుడు ప్రభుత్వంలో అలాంటి రాజకీయ నైతికత కనిపించడం లేదు. ప్రభుత్వ వైఫల్యాలకు బాధ్యత స్వీకరించే బదులు వాటిని స్వతంత్ర భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై నెట్టే ధోరణి కొనసాగుతోంది. గత కొన్ని వారాలుగా ఢిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా వీధుల్లోకి వచ్చిన ఈ తరం, భారత రాజకీయాల్లో ఒక కొత్త తరాన్ని కేంద్రస్థానానికి తీసుకొచ్చింది. ప్రస్తుత వాస్తవాలను తమ అనుభవాల ద్వారా అర్థం చేసుకున్న ఈ యువత, ప్రభుత్వాన్ని ఎదిరిస్తూ పెద్ద సంఖ్యలో సమీకృతమై 'తొలి పరీక్ష'లోనే తన సత్తా చాటింది. తమ వయస్సుకు మించిన పరిణతిని ప్రదర్శించింది. తీవ్రమైన రెచ్చగొట్టింపులు ఎదురైనా వారు సంయమనం కోల్పోలేదు. పోలీసులు ఎలాంటి బలప్రయోగానికి దిగినా ధైర్యంగా ఎదుర్కొన్నారు. "రాజకీయాలకు దూరమైన తరం"గా చాలామంది కొట్టిపారేసిన యువతే వేలాదిమందిని ఉద్యమంలోకి ఆకర్షించింది. వారు సాంప్రదాయ రాజకీయ పరిభాషను ఉపయోగించక పోయినా, తమదైన భాషలో, తమదైన పద్ధతిలో రాజకీయ చైతన్యాన్ని వ్యక్తం చేశారు. ఈ ఉద్యమంలో యువతులు ముందువరుసలో నిలిచి, పోలీసు వాహనాలను అడ్డుకోవడమే కాకుండా లాఠీచార్జీలను కూడా ధైర్యంగా ఎదుర్కొన్నారు. చివరగా ఒక విషయాన్ని ప్రస్తావించాలనుకుంటున్నాను. ఈ కాలాలలో నేను ఇంతకుముందే రాశాను. సత్యంతో పాటు వామపక్షాలకు ఉన్న ప్రధాన బలం సమాజంలో నిజంగా ఏమి జరుగుతుందో విశ్లేషించే సామర్థ్యం, గతాన్ని వర్తమానంతో అనుసంధానించి అర్థం చేసుకునే దృష్టి, అలాగే హాస్యచతురత. అయితే ఇవన్నీ ఆచరణ అనే గీటురాయిపై, మన జీవిత అనుభవాల ద్వారానే పరీక్షించబడాలి. జెన్ జీకి ఈ ఉద్యమం, అందులో వారు పొందిన అనుభవం రాజకీయ శాస్త్రంపై ఎన్ని ఉపన్యాసాలు విన్నా లభించని పాఠాలను నేర్పింది. నా తరం తరపున చెప్పాలంటే, ఇప్పుడు కొత్త తరం ఈ బాధ్యతను అందిపుచ్చుకుని ముందుకు సాగుతుండటం నాకు ఎంతో సంతృప్తినిస్తోంది.

# కృష్ణా–గోదావరి జల యుద్ధం...

నీరు... ఒక చుక్క కాదు, ఒక రాష్ట్ర భవిష్యత్తు. నదులు కేవలం ప్రవహించే జలధారలు కావు... అవి కోట్లాది ప్రజల జీవనాధారాలు. కృష్ణా, గోదావరి నదులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ప్రకృతి ప్రసాదించిన వరాలు. కానీ ఈ జలాల వినియోగం, పంపకం, ప్రాజెక్టుల నిర్మాణం అంశాలు తరచూ రాజకీయ వేడిని రాజేస్తున్నాయి. రాష్ట్ర విభజన జరిగి దశాబ్దం దాటినా కృష్ణా-గోదావరి జలాల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించకపోవడం రెండు తెలుగు రాష్ట్రాల రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. నీటి సమస్య కేవలం రాజకీయ అంశం కాదు... ఇది వ్యవసాయం, తాగునీరు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో ముడిపడిన జీవన సమస్య.

**జలాలపై మళ్లీ మొదలైన రాజకీయ రగడ**

తెలంగాణలో కృష్ణా, గోదావరి జలాల అంశం మరోసారి రాజకీయ చర్చకు కేంద్రంగా మారింది. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. తెలంగాణ జల ప్రయోజనాల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం మరింత అప్రమత్తంగా ఉండాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ గురువు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. అయితే ఇవి రాజకీయ ఆరోపణలేనని, తెలంగాణ ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

**అసలు సమస్య ఎక్కడ ఉంది?**

కృష్ణా, గోదావరి జలాల పంపకం అనేది కొత్త సమస్య కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి కొనసాగుతున్న అంశం. రాష్ట్ర విభజన తర్వాత రెండు రాష్ట్రాల మధ్య నీటి వాటాలు, ప్రాజెక్టుల నిర్వహణ, కొత్త ప్రాజెక్టుల అనుమతులు వంటి అంశాలపై విభేదాలు కొనసాగుతున్నాయి.కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు, గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు, జల వివాద పరిష్కార ప్రక్రియలు ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

**రాజకీయాలకు అతీతంగా రైతుల ప్రయోజనం ముఖ్యం**



నీటి విషయంలో ప్రభుత్వాలను ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో సహజం. ప్రతిపక్షాల విమర్శలు ప్రభుత్వాలను అప్రమత్తం చేస్తాయి. అదే సమయంలో ప్రభుత్వం కూడా ప్రజలకు వాస్తవ పరిస్థితులను పారదర్శకంగా వివరించాల్సిన బాధ్యత ఉంది.ఎవరి రాజకీయ విజయాల కోసం కాదు... రైతు పొలాల్లో పచ్చదనం కోసం నీరు కావాలి. ఒక ప్రాజెక్టు ద్వారా వచ్చే నీరు వేలాది కుటుంబాలకు జీవనాధారం అవుతుంది. సాగునీరు అందితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది.

**చర్చలే శాశ్వత పరిష్కారం**

కృష్ణా, గోదావరి నదులు రాజకీయ సరిహద్దులను గుర్తించవు. అవి ప్రకృతి ప్రసాదించిన జీవనధారలు. జల హక్కుల పరిరక్షణ ప్రతి రాష్ట్ర బాధ్యతే అయినా, వివాదాలను రాజకీయ ఆయుధాలుగా మార్చడం వల్ల చివరకు నష్టపోయేది ప్రజలే.రెండు రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర ఆరోపణలకే పరిమితం కాకుండా, నిపుణులతో చర్చలు జరిపి, చట్టబద్ధమైన పరిష్కారాల దిశగా ముందుకు సాగాలి.నీటి విషయంలో అప్రమత్తత అవసరం...కానీ ఆవేశం కాదు. హక్కుల కోసం పోరాటం అవసరం...కానీ భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలి.

**కృష్ణా, గోదావరి జలాలు రాజకీయ విజయాలకు కాదు...**


కోట్లాది ప్రజల జీవనాధారా విజయాలకు మార్గం కావాలి.



శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
జగిత్యాల
9133947176

# ప్రపంచం.. సమస్తం.. పుస్తకం..

పుస్తకం అనేది కేవలం కాగితపు పుటల సమాహారమే గాక, అది మానవ చైతన్యానికి, మేధస్సుకు, సంస్కృతికి ప్రతిబింబం. ఇది భావనలకు పరిమితం కాకుండా, విస్తృతంగా విరాజిల్లే మానసిక పరిపక్వతకు మార్గదర్శి. జ్ఞానాన్ని అక్షరాల్లో బంధించిన మహాత్మ్యం పుస్తకానికి మాత్రమే చెల్లుతుంది. చదివే ప్రతి పుట ఒక కొత్త లోకాన్ని ఆవిష్కరిస్తుంది. ఈ భావోద్వేగ, విజ్ఞాన మార్గదర్శి పుస్తకాన్ని గౌరవించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తూ ప్రతి సంవత్సరం ఆగస్టు 9న జాతీయ పుస్తక ప్రేమికుల దినోత్సవం జరుపుకుంటారు. పుస్తకాన్ని ప్రేమించడమంటే జీవితం పట్ల ప్రేమను పొందడమే. పఠనాన్ని అలవాటు చేసుకోవడం అంటే మనుషుల్ని, సమాజాన్ని, ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే ఆత్మ కాంక్ష. ఈ దినోత్సవాన్ని ఎవరు ప్రారంభించారన్న దానిపై స్పష్టత లేకున్నా, ఈ రోజు ఉద్దేశం మాత్రం అపారంగా ఉంది. పఠన సంస్కృతిని నిలబెట్టడం, ముద్రిత పుస్తకాల విలువను గుర్తు చేయడం, చదవడం అనే నిర్జీవంగా మారుతున్న మానవ గుణాన్ని మళ్లీ జీవింప జేయడం ఈ దినోత్సవ ప్రయోజనంగా భావించాలి. డిజిటల్ యుగంలో చదువులు తెరవెనుక సెల్‌ఫోన్ తెరలకే పరిమితమై పోతున్న తరుణంలో, ముద్రిత పుస్తకాలను మళ్లీ జీవితంలోకి తీసుకొచ్చే ప్రయత్నంగా ఈ దినోత్సవాన్ని చూసుకోవాలి. చదవడం అనేది వ్యక్తిగత సాధన అయినప్పటికీ, సమాజ నిర్మాణంలో దీని పాత్ర అమూల్యం. చదివిన ప్రతి వ్యక్తి ఆలోచించ గలడు. ఆలోచన చేసిన ప్రతి ఒక్కరూ మార్పును ఆవిష్కరించ గలరు. మార్పే మానవ అభివృద్ధికి పునాది.
పుస్తకం చదవడం అనేది చింతనకు మూలం. అది ఊహకు ఊత మందించే ఆచార వ్యవస్థ. ఒక్క పుస్తకం మనిషి జీవితాన్ని దిద్దుబాటు చేయగలదు. చదవడం ద్వారా వ్యక్తి వ్యక్తిత్వాన్ని నిర్మించు కుంటాడు. శ్రద్ధ, ఏకాగ్రత, భావ వ్యక్తీకరణ, భాషా పటిమ, వివేచన, నిశ్చలత – ఇవన్నీ చదివే అలవాటుతోనే వస్తాయి. ముఖ్యంగా చిన్ననాటి నుంచే చదివే అలవాటు పెంచితే, పిల్లలలో మేధో వికాసం, భావ ప్రకటన సామర్థ్యం, అపూర్వ ఆలోచన శక్తి అభివృద్ధి చెందుతాయి. చదివే పుస్తకం ఓ లోక దర్శనం, చదివిన పుటలు అనుభవాల చరిత్ర.భారతదేశం ప్రపంచానికి శబ్ద బ్రహ్మగా మారిన దేశం. ఇది శ్రుతి సంప్రదాయానికి పుట్టినిల్లు. వేదాలు, ఉపనిషత్తులు, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, గృహసూత్రాలు, స్మృతులు మొదలైన అనేక పాఠ్య సంపదలు తరతరాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. తాళ




పత్రాలపై రాయడం మొదలై, అక్షరాల రూపంలో జ్ఞానం ముద్రించ బడింది. మనకున్న ప్రాచీన పుస్తక సంపద ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసే స్థాయిలో ఉంది. వేదాలలో విజ్ఞానం, వ్యాకరణ, ఛందస్సు, సాహిత్య గ్రంథాలు, చాణక్య అర్థశాస్త్రం, శాస్త్రీయ దర్శనాలలో ఉపనిషత్తుల లోతు, మహాభారత రామాయణాల అఖండత, పురాణాల పురాతనత – ఇవన్నీ పుస్తక రూపాల్లో మానవ చైతన్యానికి అక్షర ప్రతిరూపాలు.
తెలుగు సాహిత్యంలో కూడా అనేక అపురూప గ్రంథ సంపద ఉంది. నన్నయ్య భావార్థంగా ముద్రించిన మహాభారతం, తిక్కన్న సాహిత్యం, పోతన భాగవతం, వేమన పద్యాలు, వివిధ శతకాలు, తాళ్ళపాక అన్నమాచార్య సంకీర్తనలు, త్యాగయ్య కీర్తనలు– ఇవన్నీ కేవలం భక్తి భావనకే కాదు, భాషా శిల్పానికి, పాఠ్య పరంపరలకు చక్కటి ఉదాహరణలు. ఆధునిక తెలుగు సాహిత్యంలో విశ్వనాథ, మల్లాది, శ్రీశ్రీ, కందుకూరి, గురజాడ, ఆరుద్ర, వట్టికోట, యండమూరి, జంధ్యాల, రచయిత్రులు – అనేక రచయితలు తమ రచనలతో పాఠకులను తాకిన తీరు స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సంకల్ప భరితమైన రచనలు పఠనానికి ప్రేరణగా నిలిచాయి.
పఠనం వల్ల కలిగే ప్రయోజనాలు లెక్కలేనివి. పుస్తకం మనకు నూతన భావనలు అందిస్తుంది, ఆత్మ విశ్వాసాన్ని నింపుతుంది, భాషలో మాధుర్యాన్ని పెంచుతుంది, లోతైన ఆలోచనకు అవకాశాన్ని ఇస్తుంది.
ముఖ్యంగా ఊహా శక్తిని ప్రేరేపించి, మనలోని సృజనాత్మకతను మేల్కొలిపే సాధన పుస్తకం. చదవడం అనేది మానసిక దృష్టి కోణాన్ని శుద్ధి చేస్తుంది. అది మనల్ని మెదడుతో, మనస్సుతో, కలుపుతుంది. ఇది యాంత్రికతను అధిగమించి ఆలోచనను పురిగొలిపే ప్రక్రియ.ఈ దినోత్సవాన్ని వ్యక్తిగతంగా జరుపుకోవడం కన్నా సామూహికంగా జరుపుకుంటే అధిక ప్రయోజనం. పాఠశాలలలో పఠన ప్రోత్సాహక కార్యక్రమాలు, గ్రంథాలయాల సందర్శనలు, పుస్తకాల చర్చలు, రచయితల ఉపన్యాసాలు వంటి కార్యక్రమాలు సమాజాన్ని పఠన పట్ల ఆకర్షించ గలవు.

> **పుస్తకం చదవడం అనేది చింతనకు మూలం. అది ఊహకు ఊత మందించే ఆచార వ్యవస్థ. ఒక్క పుస్తకం మనిషి జీవితాన్ని దిద్దుబాటు చేయగలదు. చదవడం ద్వారా వ్యక్తి వ్యక్తిత్వాన్ని నిర్మించు కుంటాడు. శ్రద్ధ, ఏకాగ్రత, భావ వ్యక్తీకరణ, భాషా పటిమ, వివేచన, నిశ్చలత – ఇవన్నీ చదివే అలవాటుతోనే వస్తాయి. ముఖ్యంగా చిన్ననాటి నుంచే చదివే అలవాటు పెంచితే, పిల్లలలో మేధో వికాసం, భావ ప్రకటన సామర్థ్యం, అపూర్వ ఆలోచన శక్తి అభివృద్ధి చెందుతాయి. చదివే పుస్తకం ఓ లోక దర్శనం, చదివిన పుటలు అనుభవాల చరిత్ర.**

ఇంట్లో చిన్నారులకు పుస్తకాలను బహుమతిగా ఇవ్వడం ద్వారా వారికి చదవడం పట్ల ఆసక్తి కలిగించ వచ్చు. పాత పుస్తకాలను పాఠశాలలకు, స్వచ్ఛంద సంస్థలకు దానం చేయడం వల్ల పఠన వనరులు పెరుగుతాయి. ఈ దినోత్సవం రోజున ఒక్క మంచి పుస్తకాన్ని పరిచయం చేయడం కూడా సమాజ మార్పుకు పునాది వేయగలదు.చదవడమంటే కేవలం గడిపిన సమయం కాదు, అది మనిషిగా మనలో పెరిగిన క్షణం. ఒక పుస్తకం మన జీవితాన్ని మార్చ గలదు. మనం మారితే సమాజం మారుతుంది. అందుకే పుస్తకాన్ని ప్రేమించాలి, పఠనాన్ని అభివృద్ధి పరచాలి, పుస్తక ప్రేమికుల దినోత్సవాన్ని జ్ఞానోత్సవంగా మార్చాలి. మానవ వికాసానికి పుస్తకం కీర్తి పతాక. జీవితాన్ని నిర్మించుకునే మార్గంలో పఠనం మనకు తోడుగా ఉండే కాంతి రేఖ. జ్ఞానం మాత్రమే నిజమైన శక్తి. ఆ శక్తిని మన చేతుల్లోకి తేవాలంటే పుస్తకాన్ని ఒడిసిపట్టాలి. చదవడమే మార్గం, పుస్తకమే సాధనం.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

# నిధులపై పారదర్శక ఏది?.

పీఎం కేర్స్ ఫండ్ గురించి చర్చ మరోసారి ముదిరింది. అయితే మొదట ఒక వాస్తవాన్ని స్పష్టంగా చెప్పాలి.పీఎం కేర్స్ ఫండ్ మొత్తం ఆదాయం, ఖర్చులపై భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ప్రత్యేక ఆడిట్ నివేదికను విడుదల చేయలేదు. ఫండ్ స్వయంగా నియమించిన స్వతంత్ర చార్టర్డ్ అకౌంటెంట్ సంస్థ దాని ఖాతాలను ఆడిట్ చేస్తోంది. 2020 ఏప్రిల్‌లో ఎస్ఏఆర్‌సీ అండ్ అసోసియేట్స్‌ను మూడు సంవత్సరాలకు ఆడిటర్‌గా నియమించినట్లు ఫండ్ అధికారిక వెబ్‌సైట్ చెబుతోంది.అయితే 2026లో పశ్చిమ బెంగాల్‌పై కాగ్ నిర్వహించిన ఆరోగ్య మౌలిక వసతుల ఆడిట్‌లో పీఎం కేర్స్ నిధులతో ఏర్పాటైన ఆస్తుల వినియోగంపై తీవ్ర లోపాలు బయటపడ్డాయి. కోవిడ్ కాలంలో పీఎం కేర్స్, కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో ఏర్పాటు చేసిన ప్రెజర్ స్వింగ్ అడ్సార్ప్షన్ ఆక్సిజన్ ప్లాంట్లలో సగానికి పైగా 2023 డిసెంబర్ నాటికి పనిచేయకపోవడం లేదా పూర్తిగా ప్రారంభం కాకపోవడం కాగ్ గుర్తించింది. కొన్ని ఆసుపత్రుల్లో పీఎం కేర్స్ ద్వారా వచ్చిన వెంటిలేటర్లు, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు కూడా వినియోగం లేకుండా పడి ఉన్నట్లు నివేదిక పేర్కొంది.ఇది కేవలం యంత్రాలు పనిచేశాయా లేదా అన్న ప్రశ్న కాదు. వేల కోట్ల రూపాయల విరాళాలను అత్యవసర పరిస్థితుల కోసం సేకరించినప్పుడు, వాటితో కొనుగోలు చేసిన పరికరాలు ప్రజలకు ఎంత ప్రయోజనం చేకూర్చాయి? అనే అసలు ప్రశ్న. అందుబాటులో ఉన్న అధికారిక లెక్కల ప్రకారం 2019-20లోరూ.3,076.62 కోట్లు, 2020-21లోరూ.10,990.17 కోట్లు, 2021-22లో రూ.9,131.94 కోట్లు, 2022-23లో రూ.6,723.06 కోట్ల మేర మొత్తం కార్పస్ వివరాలు వెల్లడయ్యాయి. అయితే ఇవి ప్రతి సంవత్సరం కేవలం కొత్త విరాళాలు మాత్రమే కావు; తాజా విరాళాలు, వడ్డీ ఆదాయం, మునుపటి నిల్వలతో కూడిన ఖాతా నిర్మాణాన్ని అర్థం చేసుకోవాలి. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, 2022-23 చివరికి ఫండ్ ముగింపు నిల్వ సుమారు రూ.6,283.7 కోట్లు. ఆ సంవత్సరంలోనే సుమారు రూ.912 కోట్లు కొత్త విరాళాలుగా వచ్చాయి—రూ.909.64 కోట్లు దేశీయ స్వచ్ఛంద విరాళాలు, రూ.2.57 కోట్లు విదేశీ విరాళాలు.
మరి ప్రశ్న ఏమిటి? నిధులు వచ్చాయా లేదా అనేది కాదు; ఎంత వచ్చాయి, ఎక్కడ ఖర్చయ్యాయి, ఎంత మిగిలాయి, ఎవరికెంత ఇచ్చారు, ఆ ఖర్చుతో ప్రజలకు ఏమి లభించింది అన్నది పూర్తిగా ప్రజలకు తెలిసేలా ఉందా?పీఎం కేర్స్ అధికారికంగా ఒక ప్రజా దాతృత్వ ట్రస్ట్ అని ప్రభుత్వం చెబుతోంది. ఇందులో ప్రధానమంత్రి ఛైర్మన్‌గా, రక్షణ, హోం, ఆర్థిక మంత్రులు ఎక్స్‌ఆఫిషియో ట్రస్టీలుగా ఉన్నారు. అదే సమయంలో దీనికి ఆదాయపు పన్ను మినహాయింపులు, కార్పొరేట్ సామాజిక బాధ్యత ఖర్చుగా గుర్తింపు, విదేశీ విరాళాల స్వీకరణకు ప్రత్యేక మినహాయింపులు ఉన్నాయి. ఇలాంటి ప్రత్యేక సౌకర్యాలు కలిగిన సంస్థపై ప్రజా జవాబుదారీతనం కూడా అంతే ప్రత్యేకంగా ఉండాలి. కానీ 2026లో ప్రధానమంత్రి కార్యాలయం పార్లమెంటులో పీఎం కేర్స్‌పై ప్రశ్నలు అనుమతించరాదని లోక్‌సభ సచివాలయానికి తెలిపినట్లు నివేదికలు వెలువడ్డాయి. కారణం—ఇది కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియా నుంచి బడ్జెట్ కేటాయింపులు పొందని స్వచ్ఛంద విరాళాల ట్రస్ట్ కావడమేనని పేర్కొన్నారు.ఇక్కడే ప్రజాస్వామ్య పరిపాలనలోని అసలు సమస్య మొదలవుతుంది. ప్రభుత్వం "ఇది ప్రభుత్వ నిధి కాదు" అంటుంది; కానీ ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు దాని నిర్వహణలో ఉంటారు, ప్రభుత్వ యంత్రాంగం దాని ప్రచారంలో కనిపిస్తుంది, ప్రభుత్వ సంస్థలు కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను అందిస్తాయి. ఈ ద్వంద్వ స్వరూపమే పారదర్శకతపై అనుమానాలకు కారణమవుతోంది.



డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.



# జాతీయం-అంతర్జాతీయం



## 360 మంది సాక్షులు.. 13 మంది నిందితులు..

- నీట్ పేపర్ లీకేజీపై వివరాలు వెల్లడించిన సీబీఐ
- 20 వేల పేజీల ఆధారాలు
- ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టులో సమర్పణ
- క్వశ్చన్ పేపర్ల తయారీ బృందంలో ముగ్గురిది కీలక పాత్ర
- ఎన్టీఏ విధి నిర్వహణలోనూ లోపాలున్నట్టు గుర్తించిన ఏసీబీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 08 (ఎ.ఎం.ఎస్)** : నీట్ యూజీ పేపర్ లీకేజీ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన విషయం విదితమే. పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనంటూ న్యూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేసిన సుదీర్ఘ పోరాటం విజయాన్ని సాధించింది. ఎట్టకేలకు మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అయితే 2026 నీట్ యూజీ పేపర్ ఎలా లీకైందన్న అంశంపై సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. 94 పేజీలతో సీబీఐ ఓ నివేదికను తయారు చేసింది. సీబీఐ ఛార్జ్‌షీట్ వివరాల ప్రకారం ... ముగ్గురు సబ్జెక్టు నిపుణులు ప్రశ్నలను కంఠస్థం చేసి, చిట్టాల మీద రాసుకుని, బుక్స్‌లో సంబంధిత పేరాగ్రాఫ్‌లను మార్క్ చేసి మరీ పేపర్ లీకేజీకి పాల్పడ్డారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి సంబంధించిన బృందంలోని ముగ్గురు సబ్జెక్ట్ నిపుణులు పేపర్ లీకేజీకి పాల్పడ్డారని సీబీఐ తెలిపింది. క్వశ్చన్ పేపర్లను తయారు చేసే బృందంలో ఆ ముగ్గురూ ఉన్నారనీ, పీవీ కులకర్ణి, మనీశ్ మాంధారే, మనీషా హవల్దార్.. అనే ముగ్గురు నీట్ యూజీ పేపర్ లీకేజీకి కారణమని ప్రాథమికంగా గుర్తించినట్టు తెలిపింది. కెమిస్ట్రీ సబ్జెక్టులో కులకర్ణి నిపుణుడు. వృక్ష శాస్త్రంలో మాంధారే, భౌతిక శాస్త్రంలో హవల్దార్ నిపుణులు. నీట్ పేపర్ లీకేజీ కేసులో ఇప్పటివరకు మొత్తం 13 మంది నిందితులను సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. ఎన్టీఏ సెంటర్‌లో ప్రశ్నాపత్రాలను తయారు చేస్తున్న సమయంలో... ఈ ముగ్గురు నిందితులు ప్రశ్నలను కాపీ చేసి వాటిని చీటీలపై రాసుకున్నారనీ, కొన్ని ప్రశ్నలను ఎన్సీఈఆర్టీ బుక్స్‌లో ఉన్న పేరాగ్రాఫ్‌ల్లో మార్క్ చేసినట్టు సీబీఐ ఛార్జ్‌షీట్ ద్వారా వివరించింది.ఆ ముగ్గురు నిందితులకు ఎన్టీఏలో క్వశ్చన్ సెట్టింగ్, ట్రాన్స్‌లేషన్ సెక్షన్లకు యాక్సెస్ ఉందని సీబీఐ ఛార్జ్‌షీట్ ద్వారా తెలిసింది. ఎన్టీఏ సెంటర్ నుంచి సేకరించిన సమాచారాన్ని నమ్మకమైన వ్యక్తులు, కోచింగ్ సెంటర్ల ద్వారా విద్యార్థులకు చేరేలా చేశారనీ, అయితే ఈ ప్రక్రియ డిజిటల్ విధానాలను వాడకుండా .. నిందితులు తప్పించుకునే ప్రయత్నం చేశారని తెలిపింది. ఆర్థికంగా లాభపడేందుకు, ట్యూషన్ విద్యార్థుల్లో సక్సెస్ రేటును పెంచేందుకు నిందితులు ఇలా చేశారని సీబీఐ పేర్కొన్నది. ప్రయివేటు కోచింగ్ సెషన్స్ సందర్భాల్లో లీక్ చేసిన ప్రశ్నలను విద్యార్థులతో రాయించారని, వాటికి సంబంధించిన ఆధారాలను సేకరించినట్టు కూడా సీబీఐ తన ఛార్జ్‌షీట్‌లో తెలిపింది. తేలికైన ప్రశ్నలను కంఠస్థం చేసి, ఆ తర్వాత తమ హోటల్ రూమ్‌లో వాటిని పేపర్‌పై రాసుకునేవారని ఛార్జ్‌షీట్‌లో సీబీఐ అధికారులు తెలిపారు.గత మే 12 వ తేదీన పేపర్ లీకేజీ కేసులో సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. 72 మంది ఆఫీసర్లతో బృందాలను ఏర్పాటు చేసింది. 8 మంది సైబర్ ఫోరెన్సిక్ నిపుణులు కూడా సీబీఐ విచారణకు సహకరించారని తెలిపింది. మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీతో పాటు ఇతర రాష్ట్రాల్లోని 92 ప్రాంతాలలో సోదాలు చేపట్టారు. ఆ తనిఖీల్లో డిజిటల్, కమ్యూనికేషన్ డివైస్‌లు, డాక్యుమెంట్లను ఏసీబీ అధికారులు సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న ఆధారాలకు చెందిన ఫోరెన్సిక్ ఇమేజింగ్ జరిగినట్లు సీబీఐ వెల్లడించింది. మే 13వ తేదీన ఈ కేసులో తొలి నిందితుడిని అరెస్టు చేశారు. కోచింగ్ సెంటర్లకు చెందిన ఇద్దరిని అరెస్టు చేశారు. డబ్బు లావాదేవీల కోణంలోనూ కూడా దర్యాప్తు చేపట్టారు. అనేక బ్యాంక్ అకౌంట్లు, బ్యాంక్ లాకర్లు, డీమాట్ అకౌంట్లను సీజ్ చేసినట్లు సీబీఐ తన రిపోర్టులో పేర్కొన్నది. ఎన్టీఏ విధి నిర్వహణలోనూ లోపాలు ఉన్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించామన్నారు.

ఎన్టీఏ కేంద్రం వద్ద చెకింగ్ కానీ ఫ్రిస్కింగ్ కానీ సమర్థవంతంగా లేవని తెలిపారు. పీవీ కులకర్ణి ఈ కేసులో ఏ2 నిందితుడని, అతను మూడు సెట్ల ప్రశ్నాపత్రాలకు చెందిన ట్రాన్స్‌లేషన్ వర్క్ కూడా చేశారని తెలిపారు. మూడు రోజుల వ్యవధిలో అతను 135 ప్రశ్నలను ట్రాన్స్‌లేట్ చేశాడని తన ఛార్జ్‌షీట్‌లో సీబీఐ పేర్కొన్నది. 13 మంది నిందితుల్లో ముగ్గురు ఎన్టీఏ సబ్జెక్ట్ నిపుణులు, కోచింగ్ వ్యక్తులు, మధ్యవర్తులు, లాభపడిన విద్యార్థులు ఉన్నారని తెలిపింది. ఎన్టీఏలో పనిచేస్తున్న కొందరు తమ అధికారాన్ని వాడుకుని రహస్య సమాచారాన్ని సేకరించినట్టు గుర్తించామన్నారు. ఈ కేసుతో లింకున్న సుమారు 20 వేల పేజీల ఆధారాలను ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టులో సీబీఐ సమర్పించింది. విచారణలో భాగంగా 360 మంది సాక్ష్యులను పేర్కొన్నది. ప్రస్తుతం 13 మంది నిందితులు జుడిషియల్ కస్టడీలోనే ఉన్నారు.



## పూర్తి భద్రత కల్పిస్తేనే బంగ్లాకు వస్తా

- క్రికెటర్ షకీబ్ వెల్లడి

**ఢాకా, ఆగస్టు 08 :** బంగ్లాదేశ్ స్టార్ క్రికెటర్, మాజీ ఎంపీ షకీబ్ అల్ హసన్ నివాసంపై మగురా నగరంలో కొందరు నిరసనకారులు దాడి చేశారు. పెట్రోల్ బాటిళ్లతో ఇంటికి నిప్పు పెట్టేందుకు ప్రయత్నించినట్లు నివేదికలున్నాయి. ఇటీవల షేక్ హసీనా నిర్వహించిన వర్చువల్ సమావేశంలో పాల్గొనడమే దీనికి కారణమని భావిస్తున్నారు. ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న షకీబ్, బంగ్లాదేశ్ ప్రభుత్వం పూర్తి భద్రత కల్పిస్తేనే దేశానికి తిరిగి వస్తానని, తనపై ఉన్న ఆరోపణలను ఎదుర్కొంటానని రాయిటర్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

**పెట్రోల్ బాటిళ్లతో ఇంటికి నిప్పు పెట్టేందుకు ప్రయత్నించినట్లు నివేదికలున్నాయి. ఇటీవల షేక్ హసీనా నిర్వహించిన వర్చువల్ సమావేశంలో పాల్గొనడమే దీనికి కారణమని భావిస్తున్నారు.**




## ఈపీఎఫ్ విత్‌డ్రా నిబంధనల్లో మార్పులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 08 (ఎ.ఎం.ఎస్):** ఈపీఎఫ్ ఖాతాదారులకు పీఎఫ్ విత్‌డ్రా నిబంధనల్లో కీలక మార్పులు చేసింది. గతంలో 13 రకాల కారణాలకు పీఎఫ్ విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు వాటిని కేవలం 3 కారణాలకు (ఆరోగ్యం, చదువు/పెళ్లి, ఇల్లు) కుదించారు.

ఆరోగ్య అత్యవసర పరిస్థితుల్లో అర్హతగల మొత్తంలో 100% విత్‌డ్రా చేసుకోవచ్చు. జీవితకాలంలో చదువుకు 10 సార్లు, పెళ్లికి 5 సార్లు, ఇంటి అవసరాలకు 5 సార్లు విత్‌డ్రా చేసుకునే పరిమితులు విధించారు. ఉద్యోగం మానేసిన వెంటనే 75% విత్‌డ్రా చేసుకోవచ్చు, మిగిలిన 25% ని 12 నెలల తర్వాత పొందే అవకాశం ఉంటుంది.

## గిరిజన సంక్షేమానికి రూ.70 కోట్ల నిధులు ఇవ్వండి

- రూ.452 కోట్ల పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ బకాయిలు దుదల చేయండి
- కేంద్రమంత్రి జువాల్ ఓరాంకు మంత్రి అడ్లూరి వినతి
- పీఎంఏఏజీవై ఫండ్స్ కూడా ఇవ్వండి

**న్యూఢిల్లీ, ఆగస్టు 08 (ఎ.ఎం.ఎస్) :** తెలంగాణలో గిరిజన విద్యార్థుల ఉన్నత విద్యకు ఎలాంటి ఆటంకమూ కలగకుండా రూ. 452.05 కోట్ల పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్ర జువాల్ ఓరాంను రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. అలాగే గిరిజన సంక్షేమానికి రూ.70 కోట్ల అదనపు నిధులతో మరింత అండగా నిలవాలని, ప్రధాన్ మంత్రి ఆది ఆదర్శ గ్రామ యోజన (పీఎంఏఏజీవై) నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నాడిక్కడ జువాల్ ఓరాంను అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కలిశారు. రాష్ట్రంలో గిరిజనుల సంక్షేమం, విద్యాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పలు కీలక అంశాలపై కేంద్రమంత్రికి వినతిపత్రాలు సమర్పించారు. గిరిజన విద్యార్థుల ఉన్నత విద్యకు సంబంధించి 202425, 202526 బకాయిలతో పాటు 2026 27 ఏడాదికి గాను ప్రతిపాదనల మేరకు రూ.452.05 కోట్ల కేంద్ర వాటాను వెంటనే విడుదల చేయాలని కోరారు. నిధుల విడుదలలో జాప్యం వల్ల వేలాది మంది గిరిజన విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ఆర్టికల్ 275(1) కింద... 202425లో తెలంగాణకు రూ.98.37 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. అయితే 202526లో రూ.35.26 కోట్లు, 2026 27లో రూ.32.10 కోట్లు మాత్రమే కేంద్రం ఇచ్చిందని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అందువల్ల గతంతో పోలిస్తే నిధులు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో రాష్ట్ర అవసరాలను దృష్టిలో పెట్టుకొని అదనంగా రూ.70 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గిరిజనులు అధికంగా నివసించే 428 గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం అమలవుతున్న పీఎంఏఏజీవై పథకం కింద మిగిలిన రూ.11.77 కోట్ల నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. తమ విజ్ఞప్తులపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారనీ, పెండింగ్ నిధుల్ని విడుదల చేస్తామని హామీ ఇచ్చారని మంత్రి అడ్లూరి తెలిపారు. హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఉన్నత అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని, ఈ సమావేశానికి రావాలని కేంద్రమంత్రిని ఆహ్వానించగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.




భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రాన్ని కరెన్సీ నోట్లపై ముద్రించాలని కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)లను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. ఈ అంశాన్ని రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రివర్గం దృష్టికి తీసుకెళ్లి... రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా విజ్ఞప్తి చేసేలా కృషి చేస్తానన్నారు. నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని, కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి (సీఏపీఎస్ఎస్) ఆధ్వర్యంలో జంతర్ మంతర్‌లో జరిగిన ధర్నాకు మంత్రి సంఘీభావం తెలిపారు. ఎంపీలు మల్లు రవి, ఆర్. కృష్ణయ్య, ఉస్మానియా విశ్వ విద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం, సీఏపీఎస్ఎస్ జాతీయ అధ్యక్షుడు జరిపోతుల పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

## మీడియాపై ట్రంప్ గుర్రు

- క్షిపణి నిల్వలు తగ్గుతున్నాయన్న కథనాలపై తీవ్ర అసంతృప్తి
- ఇరాన్‌తో కీలక చర్చల సమయంలో అసహనం
- లీకులపై విచారణకు ఆదేశాలు
- ఆందోళన కలిగిస్తున్న నివేదికలు

**వాషింగ్టన్, ఆగస్టు 08 :** ఇరాన్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో అమెరికా ఆయుధ నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయన్న మీడియా కథనాలు అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నకు తీవ్ర అసహనాన్ని కలిగించాయి. ఈ సమాచారం బయటకు రావడంతో అమెరికా బలహీనంగా కనిపిస్తోందనీ, అది ఇరాన్‌తో జరుగుతున్న చర్చల్లో తమ బేరసారాల శక్తిని దెబ్బతీస్తోందని ట్రంప్ ఆందోళన వ్యక్తం చేసినట్టు అమెరికా ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ సమాచారాన్ని లీక్ చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన న్యాయశాఖను ఆదేశించారు. అమెరికా మీడియా



కథనాల ప్రకారం... ఇటీవల క్యాంప్ డేవిడ్‌లో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ అంశం ప్రధాన చర్చగా మారింది. క్షిపణుల నిల్వలు తగ్గుతున్నాయన్న వార్తలపై ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమావేశానికి హాజరైన అధికారులు తెలిపారు. ఆయుధ నిల్వల పరిస్థితి గురించి తనకు ముందే తెలుసనీ, అయితే ఈ సమాచారం ఇరాన్‌తో చర్చలు కీలక దశకు చేరుకున్న సమయంలో బయటకు రావడమే తన ఆగ్రహానికి కారణమని ట్రంప్ పేర్కొన్నట్టు వెల్లడించారు. ఈ కథనాలపై ట్రంప్ సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో స్పందిస్తూ... అమెరికా వద్ద భారీ స్థాయిలో ఆయుధ నిల్వలు ఉన్నాయనీ, అవసరమైన ఆయుధాలను పెద్ద ఎత్తున తయారు చేస్తున్నామని వివరించడం గమనార్హం.దేశ చరిత్రలో ఎన్నడూ లేనంతగా రక్షణ పరిశ్రమలో కొత్త కర్మాగారాలు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. అయితే కొన్ని అత్యాధునిక క్షిపణుల నిల్వలు మాత్రం పరిమితంగానే ఉన్నాయని అనంతరం వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడిన సందర్భంగా ట్రంప్ అంగీకరించారు. అదే సమయంలో సాధారణ ఆయుధాలకు మాత్రం కొరత లేదని స్పష్టం చేశారు. ఈ సమాచారాన్ని బయటకు వెల్లడించిన వారిపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రహస్యాలను బయటపెట్టిన వారిపై దీర్ఘకాల జైలు శిక్షలు విధించాలని కోరుతూ.

. వారిని "దేశద్రోహులు"గా అభివర్ణించారు. ఈ లీకుల వెనుక ఉన్న అధికారులను గుర్తించే బాధ్యతను న్యాయశాఖకు అప్పగించినట్టు వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి. అయితే ఈ వ్యవహారంలో రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్‌సెత్‌ను ట్రంప్ నిందించలేదని అధికారులు స్పష్టం చేశారు. ఆయన పనితీరుపై తాను పూర్తిగా సంతృప్తిగా ఉన్నానని ట్రంప్ మరో పోస్టులో పేర్కొన్నారు. సమస్య మొత్తం సమాచార లీకుల గురించేనని వైట్‌హౌస్ అధికారులు వెల్లడించారు.ఇటీవల అమెరికా సైనిక ఆయుధ నిల్వలపై వెలువడిన నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. సీఎన్ఎన్ కథనం ప్రకారం... ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అమెరికా తన థాడ్ క్షిపణుల్లో దాదాపు 80 శాతం, పేట్రియాట్ ఇంటర్‌సెప్టర్ క్షిపణుల్లో సుమారు సగం వరకు వినియోగించింది. యుద్ధానికి ముందు అమెరికా వద్ద సుమారు 452 థాడ్ క్షిపణులు, 2,200 ఆధునిక పేట్రియాట్ క్షిపణులు ఉన్నట్టు సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ అంచనా వేసింది. ఈ పరిస్థితి అమెరికాతో పాటు గల్ఫ్ దేశాలను కూడా ఆందోళనకు గురిచేస్తోంది. అమెరికా వైమానిక రక్షణ వ్యవస్థలపైనే ఆధారపడుతున్న సౌదీ అరేబియా, ఖతార్ వంటి దేశాలు... ఆయుధ నిల్వలు తగ్గిపోతే ఇరాన్ నుంచి వచ్చే క్షిపణి, డ్రోన్ దాడులను ఎదుర్కోవడం కష్టమవుతుందని అమెరికాతో ఆందోళన వ్యక్తం చేసినట్టు అధికారులు తెలిపారు.



## ఎరువుల కొరత లేకుండా చూడండి

- తగినంత డీఏపీని సరఫరా చేయండి
- కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ ఎంపీల వినతి

**న్యూఢిల్లీ, ఆగస్టు 08 (ఎ.ఎం.ఎస్):** తెలంగాణలో రైతులకు ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా తక్షణమే తగినంత డీఏపీ ఎరువులను సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలు కోరారు. ఈ మేరకు శుక్రవారం పార్లమెంట్‌లో కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాను ఎంపీలు సురేశ్ షెట్కర్, ఎంపీ మల్లు రవి కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో తగినంత డీఏపీ ఎరువులను కేటాయించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఎరువుల అవసరం, సరఫరా, ఇతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అలాగే ప్రస్తుత సాగు సీజన్‌లో రైతులకు తగినంత ఎరువుల లభ్యతను నిర్ధారించాల్సిన తక్షణ అవసరాన్ని ఎంపీలు కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర రైతాంగ సంక్షేమాన్ని కాంక్షిస్తూ తెలంగాణకు చెందిన కాంగ్రెస్ లోక్‌సభ ఎంపీలందరూ సంతకాలు చేసిన ప్రతిపాదన పత్రాన్ని కేంద్రమంత్రికి అందజేసినట్టు తెలిపారు. తమ విజ్ఞప్తిపై జేపీ నడ్డా సానుకూలంగా స్పందించారన్నారు. రాష్ట్రంలోని రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, డీఏపీ ఎరువుల సరఫరా అంశాన్ని ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు ఎంపీ మల్లు రవి వివరించారు.

## కుడితిలో పడిన ఎలుకలా అమెరికా...

- విలవిల్లాడుతున్న ట్రంప్
- యుద్ధాలలో తప్పని ఎదురు దెబ్బలు
- ముందున్నది మూడు దారులే
- భూతల దాడులతో రక్తపాతమే

**వాషింగ్టన్, ఆగస్టు 08 :** తమ సొంత ప్రతిష్టను, దేశ కీర్తిని కాపాడుకోవడానికి యుద్ధాలను తీవ్రతరం చేసిన అమెరికా అధ్యక్షులు ఓ ప్రమాదకరమైన దారిలో నడిచారని చరిత్ర చెబుతోంది. గతంలో వియత్నాం, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ దేశాలపై గెలవలేమని తెలిసికూడా వారు అయిష్టంగానే ముందుకు సాగారు. ఇప్పుడు ఇరాన్‌పై చేస్తున్న యుద్ధంలో కూడా ట్రంప్ అలాగే చిక్కుకుపోయారు. లొంగిపోయేందుకు లేదా చర్చలను ముందుకు తీసుకుపోయేందుకు ఇరాన్ నిరాకరించడంతో ఆయన పరిస్థితి కుడితిలో పడిన ఎలుక చందంగా తయారైంది. ఓ వైపు దౌత్య యత్నాలు విఫలమవుతున్నాయి. మరోవైపు వైమానిక దాడులు, దిగ్బంధనాలు కొనసాగుతున్నాయి. యుద్ధం ముగిసి పరిస్థితి ఎప్పుడు చక్కబడుతుందో ఎవరికీ తెలియడం లేదు. ఇప్పుడు ట్రంప్ ఏం చేస్తారన్నదే అందరినీ తొలుస్తున్న ప్రశ్న. ఇరాన్ సైనిక లక్ష్యాల పైనే కాకుండా పౌర, మౌలిక సదుపాయాలపై దాడులు చేయడం ద్వారా పోరును తీవ్రతరం చేస్తారా లేక భూతల దాడులతో యుద్ధాన్ని తుది దశకు తీసుకొని వెళతారా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ రెండే కాకుండా మరో దారి కూడా ఉంది. ఇప్పటికే అపార నష్టం జరిగినందున ప్రధాన లక్ష్యాలను సాధించకుండానే యుద్ధ క్షేత్రం నుంచి వైదొలగడం. అయితే అది



ట్రంప్‌కు ఇష్టం లేకపోవచ్చు. ఏదేమైనా అటు గెలవలేని, ఇటు ఓడిపోని యుద్ధంలో ఆయన చిక్కుకుపోయారు. ఇరాన్‌ను ఏ విధంగా శిక్షించాలో సూచించాలంటూ సైనిక విశ్లేషకుల బృందానికి పెంటగాన్ ఓ అభ్యర్థన పంపింది. అమెరికా ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితికి ఇది అద్దం పడుతోంది. ఇరాన్ తన తాజా ఎత్తుగడలను తోసిపుచ్చిన తర్వాత ట్రంప్ తీవ్ర అసహనానికి గురయ్యారు. 'ఓ మంచి పత్రంపై సంతకం చేయడానికి వారికి ఇదే చివరి అవకాశం' అని చెప్పారు. ఇరాన్‌కు శిరచ్ఛేదం తప్పదని హూంకరించారు. ఒకవేళ ఇరాన్ ఈ బెదిరింపులను కూడా పట్టించుకోకపోతే ట్రంప్ ఏం చేస్తారు? ఒకవేళ ఇరాన్‌లోని బ్రిడ్జిలు, విద్యుత్ కేంద్రాలు, ఇతర మౌలిక సదుపాయాలపై అమెరికా దాడులు చేస్తే టెహ్రాన్ కూడా గల్ఫ్‌లో వాషింగ్టన్ మిత్ర దేశాలకు చెందిన అవే లక్ష్యాలను ఎంచుకునే అవకాశం ఉంది. అప్పుడు ఆర్థిక భారం మరింత పెరుగుతుంది. ప్రాంతీయ నాయకులు గత వారం ట్రంప్‌తో ఇదే విషయాన్ని ప్రస్తావించారు. హార్ముజ్ జలసంధిని తెరవడానికి ట్రంప్ తన నౌకాదళాన్ని ఉపయోగించవచ్చు. కానీ ఇరాన్ చూస్తూ ఊరుకోదు. అమెరికా నౌకలపై క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తుంది. ఖర్గ్ ద్వీపంలోని చమురు ఎగుమతి కేంద్రంపై

**ఇరాన్ సైనిక లక్ష్యాల పైనే కాకుండా పౌర, మౌలిక సదుపాయాలపై దాడులు చేయడం ద్వారా పోరును తీవ్రతరం చేస్తారా లేక భూతల దాడులతో యుద్ధాన్ని తుది దశకు తీసుకొని వెళతారా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ రెండే కాకుండా మరో దారి కూడా ఉంది. ఇప్పటికే అపార నష్టం జరిగినందున ప్రధాన లక్ష్యాలను సాధించకుండానే యుద్ధ క్షేత్రం నుంచి వైదొలగడం**

భూతల దాడులు జరిపినా లేదా ఇరాన్ బలగాలను బలవంతంగా వెనక్కి నెట్టినా మరింత రక్తపాతం జరగవచ్చు. వైమానిక యుద్ధం భూతల యుద్ధంగా మారితే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. ప్రాణనష్టం పెరిగే కొద్దీ రాజకీయంగా చెల్లించుకోవాల్సిన మూల్యం కూడా భారీగానే ఉంటుంది. మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ట్రంప్ దీనిని కొనితెచ్చుకోలేరు.ఇప్పుడు ట్రంప్ ఎదుర్కొంటున్న సంకట స్థితినే గతంలో కూడా అమెరికా అధ్యక్షులు ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి. వియత్నాం, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ దేశాలపై పోరు సాగినప్పుడు చోటుచేసుకున్న పరిణామాలు అందరికీ తెలిసినవే. యుద్ధంలో ఓడిపోవాలని ఏ అధ్యక్షుడూ కోరుకోడు. అయితే వియత్నాం యుద్ధం విషయంలో లిండన్ బి.జాన్సన్, రిచర్డ్ నిక్సన్, ఇరాక్ యుద్ధంలో జార్జ్ డబ్ల్యూ బుష్, ఆఫ్ఘనిస్తాన్ యుద్ధంలో బరాక్ ఒబామా చేదు అనుభవాలను చవిచూశారు. ట్రంప్ తన మొదటి పదవీకాలంలో ఆఫ్ఘనిస్తాన్‌లో సైనిక బలగాలను పెంచారు. కానీ ఆ తర్వాత విధిలేని పరిస్థితులలో దళాలను ఉప సంహరించుకున్నారు. తాజాగా ఇరాన్ విషయంలో కూడా ఆయనకు ఎదురు దెబ్బలు తప్పేలా లేవు.



## అమెరికా చట్టసభ సభ్యుడిపై భారత్ ఫైర్

- తమ సొంత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని హితవు

**వాషింగ్టన్, ఆగస్టు 08 :** విదేశీ విరాళాల నియంత్రణ చట్టంలో సవరణకు సంబంధించి ప్రతిపాదిత బిల్లుపై అమెరికాకు చెందిన ఓ చట్టసభ సభ్యుడు చేసిన వ్యాఖ్యలపై భారత్ దీటుగా స్పందించింది. చట్టాలు, సవరణలు చేసుకోవడం భారత అంతర్గత వ్యవహారాలని స్పష్టం చేసింది. విదేశీ విరాళాలను నియంత్రించేందుకు అమెరికా సహా అనేక దేశాలు చట్టాలను కలిగి ఉన్నాయని గుర్తుచేసింది. "ఎఫ్‌సీఆర్ఏపై కొందరు చేసిన వ్యాఖ్యలను గమనించాం. భారత్‌కు సంబంధించిన శాసనపరమైన విషయాలు మా అంతర్గతం. అనేక అంశాలపై ప్రజాస్వామిక పద్ధతుల్లో ఇక్కడి పార్లమెంట్ చట్టాలు చేస్తుంది. అమెరికా సహా అనేక దేశాల్లో విదేశీ విరాళాల నియంత్రణ చట్టాలు ఉన్నాయి'' అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ పేర్కొన్నారు.

ఎఫ్‌సీఆర్ఏ ప్రతిపాదిత బిల్లులో ఉన్న పలు నిబంధనలు కొన్ని మతపరమైన, స్వచ్ఛంద సంస్థలను భారత ప్రభుత్వం నియంత్రించేందుకు వీలుగా ఉన్నాయని అమెరికా చట్టసభ సభ్యుడు రైలీ మోర్ ఆరోపించారు. ఇవి కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకోవడమేనని అన్నారు. వీటి వల్ల అమెరికా, భారత్ ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని సోషల్ మీడియా వేదికగా ఆయన ఇటీవల ఆందోళన వ్యక్తం చేశారు.

## క్యూబాకు ఏఐఎడబ్ల్యూయూ బృందం



- కాస్ట్రో శత జయంతికి నిర్వహిస్తున్న సదస్సుకు హాజరుకానున్న నేతలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 08 (ఎ.ఎం.ఎస్):** ఫిడెల్ కాస్ట్రో శత జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న సదస్సులో (కొలోక్వియం) పాల్గొనేందుకు ఏఐకేఎస్, ఏఐఎడబ్ల్యూయూ సభ్యులతో కూడిన ప్రతినిధి బృందం క్యూబా పర్యటనకు వెళ్లింది. ఈ ప్రతినిధి బృందంలో ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్, ఏఐఎడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, సహాయ కార్యదర్శి ఎన్. చంద్రన్ ఉన్నారు. ఈ పర్యటన కేవలం ఫిడెల్ కాస్ట్రో శత జయంతి కార్యక్రమంలో పాల్గొనడానికే కాకుండా, భారత రైతాంగం, వ్యవసాయ కార్మిక ఉద్యమం తరపున క్యూబా ప్రజలకు తెలియజేస్తున్న సంఘీభావానికి కొనసాగింపుగా సాగుతోందని నేతలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నాడిక్కడ హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లోని ఏఐఎడబ్ల్యూయూ కేంద్ర కార్యాలయంలో ఈ ప్రతినిధి బృందానికి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. క్యూబా రాయబార కార్యాలయ డిప్యూటీ రాయబారి లూప్ ఫార్మెటా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రతినిధి బృందాన్ని అభినందించారు. వారి క్యూబా పర్యటన విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు. అమెరికా సామ్రాజ్యవాద దాడులకు వ్యతిరేకంగా క్యూబా ప్రజలు చేస్తున్న పోరాటానికి సంఘీభావం, మద్దతుకు ప్రతీకగా ఈ ప్రతినిధి బృందం పెద్ద మొత్తంలో మందులను కూడా తీసుకెళ్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎడబ్ల్యూయూ సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్, రాజ్యసభ సభ్యుడు, ఏఐఎడబ్ల్యూయూ సహాయ కార్యదర్శి వి. శివదాసన్, డీవైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు హిమాగ్నరాజ్ భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు.

## ఆ ఒప్పందం వల్ల సౌదీకి ఒరిగేదేమీ లేదు

- ఇరాన్ చురకలు
- స్పందించిన ఆ దేశ విదేశాంగ సభ్యుడు రెయిజా
- అగ్రిమెంట్ శాశ్వత భద్రత ఇవ్వలేదంటూ విమర్శలు

**టెహ్రాన్, ఆగస్టు 08:** టర్కీ, పాకిస్థాన్, సౌదీ అరేబియా మధ్య జరిగిన రక్షణ ఒప్పందంపై ఇరాన్ స్పందించింది. 'మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్' పేరిట చేసుకున్న త్రైపాక్షిక రక్షణ ఒప్పందం వల్ల సౌదీ అరేబియాకు ఒరిగేది ఏమీ ఉండదని ఇరాన్ పార్లమెంట్ జాతీయ భద్రత, విదేశాంగ విధానం సభ్యుడు ఎబ్రహీం రెజాయీ తీవ్రంగా విమర్శించారు.

అగ్రిమెంట్‌పై సంతకాలు జరిగినప్పటికీ, సౌదీకి ఇది శాశ్వత భద్రత ఇవ్వలేదని ఆయన వ్యాఖ్యానించారు. కొన్నాళ్లుగా అమెరికాకు ఏకపక్షంగా చేసిన సేవచేసిన భద్రత దక్కలేదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఈ మేరకు ఆయన ఎక్స్ (ట్విట్టర్)లో ఓ పోస్ట్ పెట్టారు. "టర్కీ, పాకిస్థాన్‌తో జరిగిన పేపరు ఒప్పందం శాశ్వత భద్రతను ఇవ్వలేదని సౌదీ అరేబియా తప్పకుండా తెలుసుకోవాలి.. సంవత్సరాల తరబడి అమెరికన్లకు ఏకపక్షంగా సేవచేసినా వారికి భద్రత దక్కనట్లే ఇది కూడా జరుగుతుంది''

ఆయన ఎద్దేవా చేశారు. ఒకవేళ, సౌదీ తన విదేశాంగ విధానాలను సంస్కరించుకుంటే భద్రత కోసం ఇతరులను యాచించాల్సిన అవసరం ఉండదని రెజాయీ చురకలంటించారు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఈవీఎం గోదాం పరిశీలన!

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్



**జనగామ, ఆగస్టు 08 (వుదయం ప్రతినిధి) :**

భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం, నెలవారీ తనిఖీలో భాగంగా శనివారం రోజున జిల్లా సమీకృత కార్యాలయాల భవన సముదాయంలో గల ఈవీఎం గోదాంను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, పరిశీలించారు.ఈ సందర్భంగా భద్రతా నమోదు పుస్తకం, సీసీ కెమెరాల పనితీరు, మంటల నియంత్రణ పద్ధతులను పర్యవేక్షించారు. భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని పోలీసు సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.ఈ పరిశీలనలో జనగామ ఆర్డీఓ గోపీరాం, తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## పచ్చని భద్రాచలమే లక్ష్యం

**ప్రతి ఇంటా మొక్క.. ప్రతి వీధిలో పచ్చదనం పెరగాలి**

**– సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ**

**– పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం**

**భద్రాచలం, ఆగస్టు 8 (వుదయం ప్రతినిధి):**

పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలం పట్టణాన్ని పచ్చదనం, పరిశుభ్రతతో కూడిన ఆహ్లాదకరమైన నగరంగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ పిలుపునిచ్చారు. భద్రాచలంలో పచ్చదనం పెంచేందుకు స్వచ్ఛంద సంస్థలు, వృక్ష ప్రేమికులు, ప్రజలు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో.. నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం అంతకంటే ముఖ్యమని స్పష్టం చేశారు.భద్రాచలం పట్టణంలో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, ప్రజల్లో మొక్కల సంరక్షణపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా గ్రీన్ భద్రాద్రి–భద్రాచలం ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయం వద్ద విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, గౌరవ అతిథిగా భద్రాచలం సర్పంచ్ పునేం కృష్ణదొర హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.పచ్చదనంతో భద్రాచలానికి కొత్త రూపంఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ.. భద్రాచలం పట్టణానికి ప్రత్యేకమైన ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాధాన్యత ఉందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు నిత్యం భద్రాచలానికి వస్తుంటారని తెలిపారు. ఇలాంటి పవిత్ర ప్రాంతంలో పరిశుభ్రతతో పాటు పచ్చదనం కూడా మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు.పట్టణంలో ఎక్కడ చూసినా పచ్చదనం కనిపించేలా మొక్కలు నాటేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. ప్రధాన రహదారులు, ఆలయ పరిసరాలు, బస్‌స్టాండ్ ప్రాంతం, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు, పాఠశాలలు, కాలేజీలు, కాలనీలు, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని కోరారు.మొక్కలు నాటి ఫొటోలు తీసుకోవడం వరకు కార్యక్రమాన్ని పరిమితం చేయకుండా.. నాటిన మొక్కలు పెద్ద చెట్లుగా ఎదిగే వరకు వాటిని సంరక్షించాల్సిన బాధ్యతను కూడా స్వీకరించాలని అన్నారు. ఒక మొక్కను కాపాడటం ద్వారా భవిష్యత్ తరాలకు ఎంతో విలువైన ప్రకృతి సంపదను అందించిన వారమవుతామని పేర్కొన్నారు.ప్రతి పౌరుడి బాధ్యతపర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత కాదని సబ్‌కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వంతో పాటు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, యువత, మహిళలు, వృద్ధులు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత తీసుకోవాలని కోరారు.ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకుంటే భద్రాచలం పట్టణంలో పచ్చదనం గణనీయంగా పెరుగుతుందని అన్నారు. చిన్న మొక్క రేపటి రోజున పెద్ద వృక్షంగా మారి మనకు నీడను, స్వచ్ఛమైన గాలిని, పర్యావరణ సమతుల్యతను అందిస్తుందని వివరించారు. పచ్చదనం పెరిగితే పట్టణంలో ఉష్ణోగ్రతలు తగ్గడంతో పాటు వాతావరణంలో ఆహ్లాదకరమైన మార్పు వస్తుందని, పక్షులు, చిన్న జీవులకు కూడా ఆవాసం ఏర్పడుతుందని అన్నారు. అందువల్ల మొక్కలు నాటే కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని సూచించారు.మొక్కలు నాటడమే కాదు.. సంరక్షణ కూడా ముఖ్యంమొక్కలు నాటిన తర్వాత వాటికి క్రమం తప్పకుండా నీరు అందించడం, పశువుల నుంచి రక్షించడం, అవసరమైనప్పుడు రక్షణ కంచెలు ఏర్పాటు చేయడం, ఎండాకాలంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వంటి చర్యలు చేపట్టాలని సబ్‌కలెక్టర్ సూచించారు.ఒక్క మొక్కను నాటి వదిలేయడం వల్ల ఆశించిన ఫలితం రాదని, ఆ మొక్కను చెట్టుగా తీర్చిదిద్దే వరకు బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఒక మొక్కను నాటిన వ్యక్తి ఆ మొక్కకు సంరక్షకుడిగా మారితే పర్యావరణ పరిరక్షణ ఉద్యమం మరింత విజయవంతమవుతుందని పేర్కొన్నారు.భవిష్యత్ తరాల కోసం పచ్చదనంభవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రస్తుతం విస్తృతంగా మొక్కలు నాటి సంరక్షించాల్సిన అవసరం ఉందని భద్రాచలం సర్పంచ్ పునేం కృష్ణదొర అన్నారు.గ్రీన్ భద్రాద్రి–భద్రాచలం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల్లో మంచి చైతన్యాన్ని తీసుకువస్తున్నాయని తెలిపారు. పట్టణ ప్రజలు ఇలాంటి కార్యక్రమాలను తమ కార్యక్రమాలుగా భావించి సహకరించాలని కోరారు.పచ్చదనం ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడటమే కాకుండా పట్టణ సౌందర్యం కూడా పెరుగుతుందని అన్నారు. భద్రాచలానికి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు పట్టణంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు.గ్రీన్ భద్రాద్రి సేవలు అభినందనీయంభద్రాచలం పట్టణంలో పర్యావరణ పరిరక్షణను ఒక ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లేందుకు గ్రీన్ భద్రాద్రి చేస్తున్న కృషిని పలువురు అభినందించారు. కేవలం ఒకరోజు కార్యక్రమాలకే పరిమితం కాకుండా నిరంతరం మొక్కలు నాటడం, వాటి సంరక్షణ, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు.ప్రజలకు మొక్కల ప్రాధాన్యతను వివరించడం, పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కల్పించడం, పచ్చదనం కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారిని ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆలయ పరిసరాల్లో మొక్కలతో ఆహ్లాదకర వాతావరణంఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయం వద్ద మొక్కలు నాటడం ద్వారా ఆలయ పరిసరాల్లో పచ్చదనం పెంచేందుకు చర్యలు చేపట్టారు. భక్తులు, స్థానిక ప్రజలు, ప్రయాణికులు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతంలో పచ్చదనం పెంచడం ద్వారా ఆ ప్రాంతానికి మరింత అందం చేకూరుతుందని నిర్వాహకులు తెలిపారు. ఆలయ పరిసరాల్లో నాటిన మొక్కలను క్రమం తప్పకుండా సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని, స్థానికులు కూడా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.పెద్ద సంఖ్యలో పాల్గొన్న వృక్ష ప్రేమికులుఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి సెక్రటరీ రంజిత్ నాయక్, కోశాధికారి ఉప్పాడ రామ్ ప్రసాద్ రెడ్డి, పూర్వ అధ్యక్షులు డా. గోళ్ల భూపతిరావు, కామిశెట్టి కృష్ణార్జున రావు, డా. శివరామకృష్ణ, వీరయ్య, సంపత్, ఆలయ పూజారి విశ్వనాథం, కార్‌స్టాండ్ అధ్యక్షుడు, సభ్యులు పాల్గొన్నారు.వృక్ష ప్రేమికులు, గ్రీన్ భద్రాద్రి సభ్యులు, దాతలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు.మొక్కను నాటుదాం.. భద్రాచలాన్ని కాపాడుదాం. భద్రాచలం పట్టణాన్ని పచ్చని పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద, కార్యాలయాల వద్ద, అందుబాటులో ఉన్న ప్రదేశాల్లో మొక్కలు నాటాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం ఒక కార్యక్రమంగా కాకుండా నిరంతర ఉద్యమంగా కొనసాగించాలని కోరారు.పచ్చదనం పెరిగితేనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని, ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవడం ద్వారా రాబోయే తరాలకు మంచి భవిష్యత్తును అందించగలమని తెలిపారు.

"వృక్షో రక్షతి రక్షితః" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించింది."ప్రకృతిని ప్రేమిద్దాం.. మొక్కలను నాటుదాం.. నాటిన ప్రతి మొక్కను సంరక్షిద్దాం.. పచ్చని భద్రాచలాన్ని నిర్మిద్దాం.. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిద్దాం" అని నిర్వాహకులు పిలుపునిచ్చారు.



## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ముగింపు దశకు చేరుకుంది

**జిల్లాలోని ఓటర్లందరు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ**



**జయశంకర్ భూపాలపల్లి ఆగస్టు 08(వుదయం జిల్లా ప్రతినిధి)**

రాష్ట్రంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 కార్యక్రమం ముగింపు దశకు చేరుకుందని శనివారం జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు. జిల్లాలోని ఓటర్లందరికీ ఇది చివరి అవకాశం అని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంగం మార్గదర్శకాల మేరకు పూరించిన ఎన్యూమరేషన్ ఫారం సమర్పించడానికి ఆగస్టు 10, 2026 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం మూడు రోజులు మాత్రమే గడువు మిగిలి ఉందని, ఎవరైతే ఓటర్లు ఇంకనూ తమ ఎన్యూమరేషన్ ఫారం ఇవ్వలేదో బూత్ లెవల్ ఆఫీసర్ ను సంప్రదించి, పూరించిన ఫారాన్ని డిజిటలైజేషన్ కొరకు సమర్పించాలని సూచించారు.ఆగస్టు 10 లోగా ఫారం సమర్పించని పక్షంలో, ఆగస్టు 17, 2026 న విడుదలయ్యే ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు నమోదు కాబడదని తెలిపారు. ఓటర్లు తమ ఫారాన్ని సులభంగా ఆన్‌లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చని తెలిపారు.ceotelangana.nic.in లేదా ఓటర్ సర్వీస్ పోర్టల్,మొబైల్ యాప్: ECINet app ఉచిత ఓటర్ హెల్ప్‌లైన్ నంబర్: 1950 మరిన్ని వివరాల కోసం మీ సంబంధిత బూతు స్థాయి అధికారులకు ను సంప్రదించాలని సూచించారు.అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్ధారించుకోవాలని, వెంటనే ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి బూతు స్థాయి అధికారులకు సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ పిలుపునిచ్చారు.

## కలెక్టర్ ఆదేశాల మేరకు పైలెట్ ప్రాజెక్టుగా "ఎక్స్‌పీరియన్స్ పోచంపల్లి" కార్యక్రమం

**యదాద్రి భువనగిరి, 08-08-2026**

ఈ రోజు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు పైలెట్ ప్రాజెక్టు గా " Experience Pochampally" కార్యక్రమం నిర్వహించడం జరిగింది, దీనిలో శ్రీమతి రేష్మి ఠాకూర్ ,మిస్ ఆసియా గారు , మల్టీ నేషనల్ కంపెనీల ఉన్నత స్థాయి అధికారులు , ఫ్రాన్స్ క్యాన్సులేట్ ప్రతినిధులు, వివిధ సాంఘిక మాధ్యమాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా పోచంపల్లి గ్రామంలోని టూరిజం పార్క్ నందు సందర్శకులను సాంప్రదాయ బద్ధంగా ఇక్కత్ దారం మాలలతో మరియు తిలక ధారణతో స్వాగతం పలకడం జరిగింది. తదుపరి వారిని బృందాలుగా విభజించి స్థానిక గైడ్స్ ద్వారా ఇక్కత్ వస్త్రాల చరిత్ర , ఫ్రేమ్ మగ్గాలు మరియు గుంత మగ్గాలను పరిచయం చేస్తూ వారికి పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల తయారీ ( నూలు నుండి వస్త్రాలు వరకు) గురించి వివరించడం తర్వాత నేత కార్మికుల ఇండ్ల కి తీసుకెళ్లి పోచంపల్లి వస్త్రాల తయారీ విధానాన్ని



వారి జీవన స్థితిగతులను వివరించడం జరిగింది. తరువాత సందర్శకులకు తెలంగాణ సాంప్రదాయ భోజనం ఏర్పాటు చేయడం జరిగింది. తర్వాత వారు శివారెడ్డి గూడెం గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి అక్కడ వ్యవసాయ కూలీలతో ఆటపాటల కార్యక్రమాల్లో పాల్గొన్నారు మొత్తంగా ఈ రోజు వచ్చిన సందర్శకులు ఈ పోచంపల్లి గ్రామ సందర్శన ఇక్కడి వస్త్రాల తయారీ విధానం ఇక్కడ భోజన విధానాలు ఇక్కడ సాంప్రదాయాలను ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా తిలకిస్తూ హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమం మొత్తాన్ని ఏ శ్రీనివాసరావు సహాయ సంచారకులు చేనేత మరియు జౌళి శాఖ యాదాద్రి గారు, వారి సిబ్బంది, టూరిజం కన్సల్టెన్సీ ప్రతినిధి సాహితీ, NIUM ప్రతినిధి నిత్య పర్యవేక్షించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశం గారు సహకార సంఘం అధ్యక్షులు భారత లవ కుమార్ మరియు పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## పుట్ట గొడుగుల పుట్టుకొస్తున్న బెల్ట్ షాపులు

**మైనర్ విద్యార్థుల చేతికి గుట్కాలు సిగరెట్లు మద్యం గ్లాసులు**

**బెల్ట్ షాపుల ముసుగులో మద్యం మాఫియా**




**చిలుకూరు ,ఆగస్టు 08: (వుదయం)**

మండలంలో గుట్కా సిగరెట్లు మద్యం ఏరులై పారుతుంది అధికారుల అలసత్వంతో మద్యం మాఫియా గల్లికో బెల్టు షాపు పుట్ట గొడుగుల పుట్టుకొచ్చాయి, మైనర్ పిల్లలు స్కూల్ కాలేజ్ విద్యార్థులు గుట్కా సిగరెట్ల మద్యం మత్తులో మండలంలోని అనేక గ్రామాల్లో, ముఖ్యంగా కోదాడ జడ్చర్ల హైవే సీతారామపురం స్టేజి నుంచి చిలుకూరు కాల్వ ఒడ్డు ఆంజనేయ స్వామి టెంపుల్ దాకా బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. పేరుకే కిరాణా షాపులు లోపలికి వెళ్లి చూస్తే బెల్ట్ షాపులు ఈ బెల్ట్ షాపుల్లో మైనర్ పిల్లలు విద్యార్థులు, గుట్కాలు సిగరెట్లు మద్యం సేవిస్తున్న దృశ్యాలు సర్వసాధారణమైపోయాయి. స్కూల్ కాలేజ్ విద్యార్థులు మద్యం తాగుతూ కనిపించడం, రాత్రి సమయంలో మందు కొట్టి మత్తులో చొక్కా బన్నీ లేకుండా ఇతర వ్యక్తులపై గొడవలు చేయడం వంటి సంఘటనలు బైకులపై యాక్సిడెంట్ అయి బాడీ కూడా దొరక్కుండా నుజ్జు నుజ్జు అయిన సంఘటనలు నిత్యకృత్యమయ్యాయి.ఎందుకు ఈ పరిస్థితి?బెల్ట్ షాపుల నిర్వహకులు తమ వ్యాపారాన్ని పెంచుకోవడానికి మైనర్ పిల్లలు కాలేజ్ విద్యార్థులును కూడా టార్గెట్ చేస్తున్నారు. వారికి సులభంగా మద్యం అందుబాటులో ఉంచడం, మత్తులో అలవాటు పడేలా చేయడం వారి దురాలోచన. తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపం, పాఠశాలల్లో సరైన అవగాహన లేకపోవడం, సామాజిక మాధ్యమాల ప్రభావం వంటివి కూడా మైనర్ పిల్లలు విద్యార్థులను గుట్కాలకు సిగరెట్లకు మద్యానికి అలవాటు చేస్తున్న ప్రధాన కారణాలు. అధికారుల పాత్ర:ఈ పరిస్థితికి బాధ్యులు కేవలం బెల్ట్ షాపుల నిర్వాహకులు మాత్రమే కాదు. అధికారుల నిర్లక్ష్యం, అవినీతి కూడా ఈ దుస్థితికి కారణమవుతున్నాయి. మద్యం నియంత్రణ బాధ్యత కలిగిన పోలీసులు, రెవెన్యూ, ఎక్సైజ్ శాఖ అధికారులు, బెల్ట్ షాపుల నిర్వహకుల నుండి అక్రమ వ్యాపారాలను పట్టించుకోకపోవడం బాధాకరం. వైన్స్ షాపుల్లో సమయం ప్రకారం మద్యం లభ్యమవుతుండగా బెల్టు షాపులో 24 గంటల పాటు మద్యం అందుబాటులో ఉండటం వలన పిల్లలు విద్యార్థులు యువత సులభంగా మద్యానికి బానిసలవుతున్నారు.పరిణామాలు:మైనర్ పిల్లలు విద్యార్థులు, యువత, గుట్కాలు సిగరెట్లు మద్యం సేవిస్తే వారి భవిష్యత్తు అంధకారమవుతుంది.ఆరోగ్య సమస్యలు, నేర ప్రవృత్తి, విద్యలో వెనుకబాటుతనం, కుటుంబ కలహాలు, ఆత్మహత్యలు వంటి తీవ్ర పరిణామాలు ఏర్పడవచ్చు. మండలంలోని యువత మద్యం మత్తులో జోగుతూ, తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటోంది.కఠిన చర్యలు: బెల్ట్ షాపుల నిర్వహకులపై కఠిన చర్యలు తీసుకోవాలి. వారి లైసెన్సులు రద్దు చేసి, జైలు శిక్ష విధించాలి.పర్యవేక్షణ: తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిశితంగా పర్యవేక్షించాలి. పిల్లలతో స్నేహపూర్వకంగా మెలగాలి.సామాజిక బాధ్యత: సమాజంలోని ప్రతి ఒక్కరూ బెల్ట్ షాపులకు వ్యతిరేకంగా పోరాడాలి. ఎక్కడైనా అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లయితే దయల్ 112 పోలీసులకు ఫిర్యాదు చేయాలి.అధికారుల బాధ్యత: మద్యం నియంత్రణ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

వారిని జవాబుదారీగా చేయాలి. మండలంలో మైనర్ పిల్లలు గుట్కా సిగరెట్లు మద్యం మత్తులో మునిగిపోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. అధికారులు తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి, బెల్ట్ షాపులను అరికట్టాలి. యువతను మద్యం మత్తు నుండి బయటకు తెచ్చి, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే బీజేపీ లక్ష్యం: డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి



**చండూరు/ నల్లగొండ, ఆగస్టు 08 (వుదయం):**

రాష్ట్రంలో అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో పోరాడటమే బీజేపీ ప్రధాన లక్ష్యమని పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు. నల్గొండ జిల్లా చండూరు మున్సిపల్ కేంద్రంలోని భవాని ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన బీజేపీ చండూరు మండల, మున్సిపల్ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని పార్టీ పతాకావిష్కరణ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంటే, మునుగోడు ఎమ్మెల్యే మాత్రం బీజేపీ సర్పంచులు, కౌన్సిలర్లకు నిధులు మంజూరు చేయకుండా వివక్ష చూపడం శోచనీయమన్నారు. స్థానిక శాసనసభ్యులు వెంటనే స్పందించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా ప్రతి కార్యకర్త ప్రజాక్షేత్రంలో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని, కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని ఘాటుగా విమర్శించారు. మండలంలో నెలకొన్న విద్యా సమస్యలు, ప్రభుత్వ ఆసుపత్రి దుర్భర పరిస్థితి, తాగు, సాగునీటి ఎద్దడి, పారిశుధ్య లోపం, రోడ్లు మరియు కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం వంటి పలు ప్రజా సమస్యలపై సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానాలు ఆమోదించి, భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందించారు.జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గానికి చెందిన చేనేత కళాకారులను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. చేనేత కార్మికులకు బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా భరోసానిచ్చారు.మండల, మున్సిపల్ పార్టీల అధ్యక్షులు ముదిగొండ ఆంజనేయులు, భూతరాజు శ్రీహరిల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు దోనూరి వీరారెడ్డి, కర్నాటి ధనుంజయ, కోమటి వీరేశం, బొమ్మరబోయిన రాజు ముదిరాజ్, మండల ప్రభారి జక్కల రాజు, జిల్లా పార్టీ కార్యదర్శి వరికుప్పల గిరి, యువమోర్చా రాష్ట్ర నాయకులు పిన్నింటి నరేందర్, జిల్లా నాయకులు మిర్యాల వెంకటేశం, తిరందాసు కనకయ్య, నకిరెకంటి లింగస్వామి, అన్నెపర్తి యాదగిరి, మాదగోని వెంకన్న, సీనియర్ నాయకులు బొబ్బల మురళీ మనోహర్ రెడ్డి, మేకల సుదర్శన్ రెడ్డి, చిలుకూరి అశోక్, రావిరాల శ్రీను, సోమ నరసింహ, పేర్ల గణేష్, పార్టీ ప్రధాన కార్యదర్శులు పద్సనబోయిన శ్రీను, ఆవుల అశోక్, సోమ శంకర్, భూతరాజు స్వామి, చేనేత డైరెక్టర్లు తిరందాసు సుధాశ్రీను, చెరిపల్లి కృష్ణ, పలువురు ఉపసర్పంచులు, బూత్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులతో మాట - పంట మార్పిడికి బాటతో 10 రోజుల పాటు పంట మార్పిడి పథకం స్పెషల్ డ్రైవ్:కలెక్టర్

**సూర్యాపేట ఆగస్టు 8: వుదయం ప్రతినిధి**

జిల్లాలో వాతావరణం అనుకూలించేలా లేనందున, ఈ ఏడాది వానలు ఆశించిన స్థాయిలో పడకపోవడంతో రైతులు వరి వేసి నష్టపోవద్దని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ రైతులకు విజ్ఞప్తి చేశారు. జూన్, జూలై నెలల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైందని, రాబోయే సెప్టెంబర్‌లోనూ ఎల్ నినో ప్రభావంతో వానలు తక్కువగానే ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో రైతులు వరి సాగుకు వెళ్లకుండా ఆరుతడి పంటలు వేసుకోవాలని ఆయన సూచించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ తో కలిసి ఎల్ నినో ప్రభావంపై అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం, నాగార్జున సాగర్, ఎస్సారెస్పీ, ప్రాజెక్టులలో సమృద్ధిగా నీరు లేనందున నీటి విడుదల పై స్పష్టత లేదన్నారు. జిల్లాలోని 190 పెద్ద చెరువుల్లో చాలా వరకు 25 నుంచి 50 శాతం నీటితోనే ఉన్నాయని, భూగర్భ జలాలు కూడా రీఛార్జ్ కావడం లేదని తెలిపారు. ప్రస్తుతం ఆగస్టు 8వ తేదీకి వచ్చేశామని, ఇప్పుడు వరి నాట్లు వేస్తే అవి కోతకు వచ్చేసరికి నవంబర్, డిసెంబర్ అవుతుందని కలెక్టర్ వివరించారు. అప్పటికి వర్షాలు ఉండవని, ప్రాజెక్టుల్లో నీళ్లు అయిపోతే పంట ఎండిపోయి రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. జిల్లాలో ఇంకా 2.35 లక్షల ఎకరాల్లో సాగు ప్రారంభం కావాల్సి ఉందని, ఆ రైతులంతా ఆలోచించుకోవాలని కోరారు.10 రోజుల పాటు పంట మార్పిడి పథకం స్పెషల్ డ్రైవ్పంట మార్పిడిపై రైతుల్లో అవగా




హన కల్పించేందుకు రైతులతో మాట – పంట మార్పిడికి బాట అనే పంట మార్పిడి పథకాన్ని స్పెషల్ డ్రైవ్ గా తీసుకొని ఈ నెల 10 వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. 10 రోజుల పాటు ప్రతి అధికారి కనీసం 10 మంది రైతులను వ్యక్తిగతంగా కలిసి అవగాహన కల్పిస్తారన్నారు. తహశీల్దార్లు, ఎంపీడీఓలు, ఏఈఓలు, మహిళా సంఘాల ప్రతినిధులు ఇందులో పాల్గొంటారని, గ్రామ స్థాయిలో రైతు వేదికల ద్వారా ప్రత్యామ్నాయ పంటల లాభాలను వివరిస్తారని తెలిపారు. వరికి బదులు కందులు, పెసర్లు, మినుములు, మొక్కజొన్న వేరుశనగ, ఆయిల్ ఫామ్ వంటి ఆరుతడి పంటలు, కూరగాయలు పండించాలని రైతులకు సూచించారు. కరువు వచ్చిన అండగా ఉంటాం – తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామెల్ రాష్ట్రంలో కరువు పరిస్థితులు కనిపిస్తున్నా ప్రజలెవరూ అధైర్యపడొద్దని, ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామ్యూల్ భరోసా ఇచ్చారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు వరికి బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని, సాగునీటి కష్టాల నుంచి గట్టెక్కేందుకు సాగర్‌లో వరుణ యాగం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ ఈనెల 10వ తేదీన నాగార్జున సాగర్‌లో "వరుణ యాగం" నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. యాదగిరి గుట్ట అర్చకుల ఆధ్వర్యంలో జరిగే ఈ క్రతువులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన 6 కేజీల సన్న బియ్యం ప్రభుత్వం అందిస్తుందని, నిత్యావసర వస్తువుల సరఫరాపై కూడా ప్రభుత్వం ఆలోచన చేస్తోందని వెల్లడించారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం మెస్ ఛార్జీలను 40 శాతం పెంచామని తెలిపారు. బాలికలకు కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం పెంచి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని తొండ గ్రామంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు 8 నెలల్లో పూర్తి చేస్తామన్నారు.ఈ పత్రికా విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్ బి.హరి సింగ్, ఇరిగేషన్ సి ఇ నాగభూషణం, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి.

## కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ వర్తింప చేయాలి

**టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ**

**తొర్రూరు/మహబూబాబాద్ ఆగస్టు 8 (వుదయం ప్రతినిధి):**




టీఎస్ యుటిఎఫ్ తొరూరు మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు సమస్యల సేకరణ క్యాంపెనియన్ లో భాగంగా కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్ మరియు మైనారిటీ గురుకుల పాఠశాలలు సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ముర ళీక ృష్ణ పాల్గొని మాట్లాడుతూ. కేజీబీవీ టీచర్లను శ్రమదోపిడి చేస్తున్నారని, శ్రమకు తగ్గ మినిమం టైం స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని, పోస్ట్ కు తగ్గ మినిమం వేతనం ఇవ్వాలని, రెగ్యులర్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల వినియోగించుకున్న సెలవులన్నీ వినిగించుకునే విధంగా అవకాశం కల్పించాలని, హాస్టల్లకు కేర్ టేకర్లను నియమించాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, ఆరోగ్య కార్డులు కేజీబీవీ వివిధ గురుకులాల ఉద్యోగులందరికీ అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కోశాధికారి నాగమల్లయ్య మాట్లాడుతూ పిఆర్సి విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులు లేకుండా, పెండింగ్ డిఏలు లేకుండా ముఖ్యమంత్రి హామీలు అమలు చేయాలని కోరారు .మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల సమయసారిణిని మార్చాలని, గురుకుల ఉపాధ్యాయులకు 010 పద్ధతి ద్వారా వేతనం చెల్లించాలని, సమస్యలు పరిష్కారం కానిచో పోరాటం చేయాల్సి ఉంటుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శులు మహేందర్, వంశీకృష్ణ, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ |ఆదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

# ఎలినినో ప్రభావంతో నీటి సంక్షోభం తీవ్రం కానుంది...

**వరి సాగు మానుకొని ప్రత్యామ్నాయ పంటలను పండించాలి...**

**జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**



**జగిత్యాల ఆగస్టు 08 (వుదయం ప్రతినిధి)**

ఆగస్టు సెప్టెంబర్ నెలల్లో ఎలినినో ప్రభావం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని ఈ పరిస్థితుల్లో రైతులు వరి సాగును విస్తరించకుండా తక్కువ నీటి అవసరం కలిగిన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. వాతావరణ అంచనాల ప్రకారం రానున్న రోజుల్లో వర్షపాతం తగ్గడంతో పాటు వర్షాల మధ్య సుదీర్ఘ విరామాలు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు దీనివల్ల చెరువుల్లో నీటి నిల్వలు భూగర్భ జలాల మట్టాలు గణనీయంగా తగ్గిపోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 1,010 చెరువులు ఉండగా ప్రస్తుతం కేవలం 268 చెరువులు మాత్రమే నిండి ఉన్నాయని ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు మొత్తం సాగు అవసరాలను తీర్చేందుకు సరిపోవని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో భూగర్భ జలాల మట్టం ఇప్పటికే సగటున 1.12 మీటర్లు తగ్గిందని ఆగస్టు సెప్టెంబర్ నెలల్లో వర్షపాతం మరింత తగ్గితే భూగర్భ జలాలు ఇంకా దిగజారే అవకాశం ఉందన్నారు తాగు నీటికే ప్రాధాన్యత వరి సాగుపై అప్రమత్తంగా ఉండాలిశ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్పీ)లో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యంగా వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉన్నందున వరి సాగుకు పూర్తి స్థాయిలో నీటి సరఫరాపై ఆధారపడలేమని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు ప్రస్తుతం లేదా ఇకపై కొత్తగా వరినాట్లు వేయడం వరి సాగు విస్తీర్ణాన్ని పెంచడం పూర్తిగా నివారించాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుతో నీటి వినియోగాన్ని తగ్గించండివ్యవసాయ శాఖ సూచించిన కందులు పెసర మినుములు ఆముదం జొన్న సజ్జలు తగిన తేమ ఉన్న ప్రాంతాల్లో మాత్రమే మొక్కజొన్న వంటి తక్కువ నీటి అవసరం కలిగిన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కలెక్టర్ కోరారు. ప్రత్యామ్నాయ పంటల ఎంపిక విత్తనాల లభ్యత సాంకేతిక సూచనల కోసం రైతులు తమ పరిధిలోని వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కలెక్టర్ ఈ ప్రకటనలో సూచించారు.

# సింగూర్ నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించాలి

**వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచాలి: కలెక్టర్**



**కామారెడ్డి, ఆగస్టు 8 (వుదయం ప్రతినిధి):**

సింగూర్ జలాశయంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే వినియోగిస్తూ, రానున్న వర్షాలను సద్వినియోగం చేసుకునేలా ముందస్తు చర్యలు చేపట్టాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు.నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శనివారం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధ్యక్షతన నిర్వహించిన జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వర్చువల్ విధానం ద్వారా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, సింగూర్ జలాశయంలో ప్రస్తుతం 4.140 టీఎంసీల నీరు నిల్వ ఉందని, జలాశయానికి మరమ్మతులు చేపడుతున్నందున పూర్తి సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేయలేని పరిస్థితి ఉందని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాలకు వినియోగించాలని సూచించారు.ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ సుమారు 60 నుంచి 90 రోజుల వరకు తాగునీటి అవసరాలను తీర్చగలదని తెలిపారు. రానున్న రోజుల్లో సమృద్ధిగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సింగూర్ జలాశయంలో మరో 4 టీఎంసీల వరకు వరద నీటిని నిల్వ చేసుకునేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. తద్వారా నిజామాబాద్, కామారెడ్డి, మెదక్ జిల్లాలకు రానున్న ఐదారు నెలల పాటు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడవచ్చని పేర్కొన్నారు.వర్షపు ప్రతి చుక్కను ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించే లక్ష్యంతో కామారెడ్డి జిల్లాలో జలసిరి కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. వర్షపు నీటిని నిల్వ చేయడం, భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టడం ద్వారా భూగర్భ జలమట్టాలను పెంచేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.అలాగే కామారెడ్డి జిల్లాలోని కౌలాస్ నాలా, పోచారం ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటిమట్టాన్ని సంతరించుకున్నాయని తెలిపారు. ఆయకట్టు పరిధిలోని పంటలకు సాగునీటిని అందించేందుకు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి నిర్వహణ, పంటల ప్రణాళికపై అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని నిజాంసాగర్, శ్రీరాంసాగర్, సింగూర్, కౌలాస్ నాలా, పోచారం, రామడుగు తదితర జలాశయాల నీటి నిల్వల పరిస్థితి, ఆయకట్టు పంటలకు సాగునీటి సరఫరా, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, పంటల వైవిధ్యీకరణ తదితర అంశాలపై చర్చించారు.ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, నిజామాబాద్ గ్రామీణ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, అదనపు కలెక్టర్ వి. భుజంగ రావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా రెవెన్యూ అధికారి గీత, నీటి పారుదల, భూగర్భ జలాలు, వ్యవసాయ, ఉద్యానవన, కామారెడ్డి అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్ వై గిరి, బాన్స్వాడ ఆర్డీఓ రవీందర్ రెడ్డి, కామారెడ్డి వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భూసేకరణ, పునరావాసానికి నిధుల కొరత రానివ్వం..

**రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**పెద్దపల్లి, ఆగస్టు 8 (వుదయం ప్రతినిధి)**

సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం–పునర్నిర్మాణం పనులకు నిధుల కొరత రానివ్వబోమని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతి అభివృద్ధి పనులపై ఇన్చార్జి మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు దుదిల్ల శ్రీధర్ బాబు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పొన్నం ప్రభాకర్ నాలుగు జిల్లాల కలెక్టర్ల తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ (LA), పునరావాసం–పునర్నిర్మాణం (R&R) కోసం రూ.5 వేల కోట్లు సమకూర్చేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని , ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదలయ్యాయని, మిగిలిన రూ.3 వేల కోట్ల విడుదల ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు.నిధుల కొరత కారణంగా పూర్తికి చేరువలో ఉన్న ఏ సాగునీటి ప్రాజెక్టు పనులు నిలిచిపోవడానికి వీల్లేదని మంత్రి స్పష్టం చేశారు. భూసేకరణ, ఆర్అండ్ఆర్, అటవీ, పర్యావరణ అనుమతులను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.భూసేకరణకు అవసరమైన నిధుల కోసం వెంటనే ప్రతిపాదనలు పంపాలని మంత్రి సూచించారు. ఏ ప్రాజెక్టుకు ఎంత నిధులు అవసరమో స్పష్టంగా పేర్కొంటూ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, అవసరమైన ఆర్థిక అనుమతులు, టోకెన్లు పొందడంలో జాప్యం చేయరాదన్నారు. ఇంజినీరింగ్ పనులు కొనసాగుతుండగానే సాధ్యమైన ప్రాంతాల్లో భూసేకరణ, భూయజమానులకు పరిహారం చెల్లింపు, నిర్వాసిత కుటుంబాల పునరావాస ప్రక్రియలను సమాంతరంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రక్రియల పేరుతో పనులు మరోసారి నిలిచిపోకుండా నిర్దిష్ట కాల పరిమితితో కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మిడ్‌మానేరు ఎడమ కాలువ మిగులు పనులను తక్షణమే పునఃప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. సుమారు నాలుగున్నరేళ్లుగా నిలిచిపోయిన పనులకు అడ్డంకిగా ఉన్న భూసంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. సవరించిన అంచనాలు సిద్ధం చేయడం, భూసేకరణ, టెండర్ల ప్రక్రియ, చట్టబద్ధ అనుమతుల సాధన వంటి అన్ని ప్రక్రియలను సమాంతరంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.పత్తిపాక రిజర్వాయర్ ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి ఆదేశించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ప్రతిపాదించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి పత్తిపాక రిజర్వాయర్ ద్వారా కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు కాకతీయ ప్రధాన కాలువలో డి–83 నుంచి డి–94 వరకు ఉన్న 2.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ధర్మపురి, చొప్పదండి, పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరనుందని మంత్రి తెలిపారు. పత్తిపాక వద్ద 3 టీఎంసీలు లేదా 5 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించే రెండు ప్రత్యామ్నాయాలను అధికారులు పరిశీలిస్తున్నారని తెలిపారు. లైడార్ సర్వే, డేటా ప్రాసెసింగ్ ఇప్పటికే పూర్తయ్యాయని, బోర్‌హోల్ డ్రిల్లింగ్, ట్రయల్ పిట్స్, జియోటెక్నికల్ పరిశోధనలు కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు.



# ధర్మపురి గురుకుల డిగ్రీ కళాశా లలో మైక్రోసాఫ్ట్ ఎక్సెల్ వర్క్ షాప్ ముగింపు

**మైక్రోసాఫ్ట్ ఎక్సెల్‌పై రెండు రోజు ల వర్క్‌షాప్ విజయవంతం**

**విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం**

**మెరుగైన ఉపాధి అవకాశాలే లక్ష్యంగా ధర్మపురిలో**

**ఎక్సెల్ నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ**



**ధర్మపురి, ఆగస్టు 08(వుదయం ప్రతినిధి):**

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించడం, విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ఉన్న త విద్యా మండలి చేపట్టిన 100 రోజుల ప్రత్యేక కార్యాచర ణ ప్రణాళికలో భాగంగాధర్మపురి లోని మహాత్మా జ్యోతిబాపూలే పురుషుల గురుకుల డిగ్రీ కళాశా లలో రెండు రోజుల వర్క్‌షాప్ విజయవంతంగా పూర్తయింది. శాతవాహన విశ్వవిద్యాలయం సౌజన్యంతో డేటా మేనేజ్‌మెంట్ అనాలిసిస్ కోసం మైక్రోసాఫ్ట్ ఎక్సెల్ అనే అంశంపై కార్యక్ర మాన్ని నిర్వహించారు. కమలా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ. సంజీవ్ రాజు నిపుణుడిగా వ్యవహరించారు. ప్రొజెక్టర్ సహా యంతో డేటా ఎంట్రీ,డేటా ఆర్గనైజేషన్, మేనేజ్‌మెంట్ సమాచారాన్ని సమర్థవంతంగా నిర్వహించే విధానాలపై ప్రాక్టికల్ ఉదాహ రణలతో విద్యార్థులకు అవగా హన కల్పించారు. శ్రీనిధి ఇన్స్టి ట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సమాచార సాంకేతిక విభా గం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ.రవి కుమార్ విచ్చేసి,మైక్రోసాఫ్ట్ ఎక్సె ల్‌లోని ప్రధాన విధులైన వీలూ కప్, హెచ్‌లూకప్,లాజికల్ ఫంక్షన్స్‌తో పాటు,అడ్వాన్స్డ్ ఎక్సెల్‌లో కృత్రిమ మేధను ఎలా ఉప యోగించాలో వివరించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఎలగందుల రాధాకిషన్ మాట్లాడుతూ ఆర్ట్స్, కామర్స్, సైన్స్ పరి శోధన వంటి వివిధ రంగాల్లో విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ ఎక్సెల్ ఎంతో ఉపయోగకరమైన సాధ నమని తెలిపారు. ప్రాక్టికల్ సెషన్లను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించు కోవాలని సూచించారు. ఈ వర్క్‌షాప్ నిర్వహణకు సహకరించిన శాతవాహన విశ్వవి ద్యాలయానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి, ప్రోగ్రామ్ కన్వీనర్ ఎ.వనిత మాట్లాడు తూ నిత్య జీవితంలోనూ,విద్య మరియు భవిష్యత్ ఉద్యోగ అవకాశాలలో ఎక్సెల్ పాత్రను వివరించారు. స్వయంగా సాధన చేయడం ద్వారా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని పిలు పునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులకు, నిపుణులకు కళాశాల తరపున సన్మానం చేశారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రేండ్ల ప్రశాంత్, అధ్యాకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి:

**జిల్లా అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్**



**నిర్మల్ జిల్లా 8 ఆగస్ట్ 2026 (వుదయం ప్రతినిధి)**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు పంద్రాగస్టు వేడుకల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రోటోకాల్ ప్రకారం అతిథులను ఆహ్వానించాలన్నారు. వేదికను అందంగా ముస్తాబు చేయాలన్నారు. దేశభక్తి ఉట్టిపడేలా విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమం జరుగుతున్నంతసేపు నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలన్నారు. టెంట్, షామియానా, తాగు నీరు ఏర్పాటు చేయాలని చెప్పారు. తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని వివరించారు. అంబులెన్సు అందుబాటులో ఉంచడంతో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని తెలిపారు. పార్కింగ్ ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఎక్కడా కూడా ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖలు సమన్వయంతో, ప్రణాళిక ప్రకారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, డిఎస్పీ శ్రీనివాస్, ఆర్డీఓ దేవీదాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ ఆలయాల అభివృద్ధిపై ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఫోకస్

**- 60 ఆలయాలకు రూ.14 కోట్లు..**

**టీటీడీ బోర్డు సభ్యుడికి ఎమ్మెల్యే ప్రతిపాదన**

**ఆదిలాబాద్‌లో శ్రీనివాస కల్యాణం నిర్వహించాలని టీటీడీకి విజ్ఞప్తి**



**ఆదిలాబాద్, ఆగస్టు 8 (వుదయం ప్రతినిధి)**

ఆదిలాబాద్ నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి నిధులు సాధించడంపై ఎమ్మెల్యే పాయల్ శంకర్ దృష్టి సారించారు. ఇందులో భాగంగా తిరుమలలో టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రసాద్‌ను కలిసిన ఆయన.. నియోజకవర్గంలోని సుమారు 60 ఆలయాల అభివృద్ధికి రూ.14 కోట్ల నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదించారు. చారిత్రక, వారసత్వ ప్రాధాన్యం కలిగిన ఆలయాల పరిరక్షణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.గ్రామీణ ప్రాంతాల్లోని అనేక పురాతన ఆలయాలు అభివృద్ధికి నోచుకోక మౌలిక వసతుల కొరత ఎదుర్కొంటున్నాయని పాయల్ శంకర్ టీటీడీ బోర్డు సభ్యుడి దృష్టికి తీసుకెళ్లారు. ఆలయాల పునరుద్ధరణ, మౌలిక వసతుల కల్పనతో పాటు వాటి చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని వివరించారు. ప్రత్యేకంగా సదల్‌పూర్, బేలా మండలంలోని బైరమదేవ్ ఆలయం, కోటిలింగాల ఆలయం, బంగారిగూడ శ్రీ వెంకటేశ్వర ఆలయం, బేలా మండలంలోని సంగిడి శివాలయం అభివృద్ధికి రూ.2 కోట్ల చొప్పున ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. ఆదిలాబాద్‌లో శ్రీనివాస కల్యాణం ఇదే సందర్భంగా ఆదిలాబాద్‌లో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణంనిర్వహించాలని పాయల్ శంకర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఆదిలాబాద్ ప్రజలకు శ్రీవారి వైభవాన్ని చేరువ చేయడంతో పాటు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే చేసిన ప్రతిపాదనలను టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రసాద్ సానుకూలంగా విన్నారు. పాయల్ శంకర్‌ను శాలువాతో సత్కరించారు. నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి అవసరమైన నిధులు సాధించేందుకు టీటీడీ, ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

# పంటల వైవిధ్యీకరణపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి: కలెక్టర్



**మంచిర్యాల జిల్లా :**

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తూ, రైతులకు ఎలాంటి నష్టం కలుగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు ప్రేమ్ సాగర్ రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, నీటిపారుదల శాఖ ఈ.ఈ. శ్రీనివాస్ లతో కలిసి నీటిపారుదల, వ్యవసాయ శాఖల అధికారులతో జిల్లాలో వర్షపాతం పరిస్థితులు, సాగు నీటి లభ్యత, పంటల సాగు, పంటల వైవిధ్యీకరణ, రైతుల సమస్యలు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు నిరంతరం విధులలో అప్రమత్తంగా ఉంటూ సాగునీటి వనరులు, కాలువలు తదితర వాటి నిర్వహణను సక్రమంగా చేపట్టాలని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిలో మొదటి ప్రాధాన్యత తాగునీటికి ఇవ్వాలని, నీటి వృథాను పూర్తిగా నివారిస్తూ, అందుబాటులో ఉన్న నీటిని అవసరానికి అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను ఎంపిక చేసుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామస్థాయిలో రైతులను కలిసి పంటల వైవిధ్యీకరణ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని తెలిపారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న పరిస్థితులలో అధిక నీటి అవసరం ఉన్న పంటల సాగు వల్ల కలిగే నష్టాలు, దిగుబడులు తగ్గే అవకాశాలను రైతులకు ముందుగానే వివరించాలని, నీటి వినియోగం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడంతో పాటు, కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర అందుబాటులో ఉంటుందనే విషయాన్ని తెలియజేస్తూ, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు మార్గనిర్దేశం చేయాలని, పంటల వైవిధ్యీకరణపై గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించి రైతులను ప్రోత్సహించాలని అన్నారు. ప్రజలకు సంబంధించిన సమస్యలు, వ్యవసాయం, సాగు నీటికి సంబంధించి వచ్చే ప్రతికూల వార్తలు, ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేయాలని, రైతులకు అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. నీటి విడుదల, కాలువల నిర్వహణ, పంటల సాగు తదితర అంశాలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, రైతులకు నష్టం కలుగకుండా శాఖల మధ్య సమన్వయంతో పని చేయాలని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా పని చేయాలని, ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్న నేపథ్యంలో నీటి ప్రతి బొట్టును పొదుపుగా వినియోగించాలని, ఎక్కడా నీటివృథా జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ భవేష్ మిశ్రా



**నిజామాబాద్, ఆగస్టు 08 :**

కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు అనుసరిస్తూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేయడం జరిగిందని కలెక్టర్ భవేష్ మిశ్రా వెల్లడించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీ.సీ హాల్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను చేపట్టి ముసాయిదా జాబితాను రూపొందించడం జరిగిందన్నారు. జిల్లాలో 1565 పోలింగ్ కేంద్రాలు కొనసాగుతుండగా, హేతుబద్ధీకరణ చేసిన మీదట వాటి సంఖ్య 1591 కి చేరిందని తెలిపారు.

ఓటర్ల సంఖ్య, ఇతర అంశాలను ప్రాతిపదికగా చేసుకుని 28 పోలింగ్ కేంద్రాలను కొత్తగా ఏర్పాటు చేయాలని, బాన్సువాడ సెగ్మెంట్ పరిధిలోని రెండు పోలింగ్ కేంద్రాలను తొలగించాలని ముసాయిదా జాబితాలో ప్రతిపాదించడం జరిగిందన్నారు.

# చేయూత పింఛన్ల కోసం అర్హు లు దరఖాస్తు చేసుకోవాలి:– జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ :**

గత కొంతకాలంగా చేయూత పింఛన్ల మంజూరుకోసం ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. జిల్లాలోని అర్హులందరూ తమ అర్హతకు అనుగుణంగా సంబంధిత కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించి ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలో, పట్టణ ప్రాంతాలకు చెందిన వారు మున్సిపల్ వార్డు అధికారుల ద్వారా సంబంధిత మున్సిపాలిటీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులు తమ దరఖాస్తులను ఎంపీడీవో/మున్సిపాలిటీ కార్యాలయాల్లో సమర్పించాలి.

# మంచిర్యాలలో ఘనంగా 'అభయ దినోత్సవం

**ఆరోగ్య కార్యకర్తల భద్రతకు పెద్దపీట వేయాలని పిలుపు**



**మంచిర్యాల ఆగస్టు 7**

ఆర్.జీ. కర్ మెడికల్ కాలేజీలో దారుణంగా ప్రాణాలు కోల్పోయిన యువ వైద్యురాలు 'అభయ' జ్ఞాపకార్థం MSOG మంచిర్యాల ఆధ్వర్యంలో గురువారం 'అభయ దినోత్సవాన్ని' అత్యంత స్ఫూర్తిదాయకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా వైద్య రంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణం కల్పించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు.ఆరోగ్య కార్యకర్తలపై జరుగుతున్న హింసను రూపుమాపడమే ధ్యేయంగా నిర్వహించిన ఈ సభలో పలువురు వైద్యులు మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక నినాదాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించి ప్రజల్లోకి బలమైన సందేశాన్ని తీసుకెళ్లారు. ఆరోగ్య కార్యకర్తలను రక్షించడం అంటే ఆరోగ్య సేవలను రక్షించడం సమాజం మొత్తం బాధ్యత తీసుకోవాలని తెలిపారు ఈ సందర్భంగా MSOG మంచిర్యాల అధ్యక్షురాలు డా. నల్మాస్ శ్రీ దేవి, కార్యదర్శి డా. అలివేణి, కోశాధికారి డా. కీర్తిశ్రీలతో పాటు డా. సుబ్బారాయుడు, డా. అరుణశ్రీ మాట్లాడుతూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందిస్తున్న వైద్యులు మరియు ఆరోగ్య సిబ్బందిపై ఎటువంటి హింసకూ తావులేదని స్పష్టం చేశారు. వైద్యులు భయరహితంగా, పూర్తి భద్రతతో సేవలందించేలా చూడాల్సిన బాధ్యత సమాజం మొత్తానిది అని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డా. పద్మ, డా. ప్రియదర్శిని, డా. సమత, డా. స్వరూప, డా. ప్రశాంతి, డా. నూతన్, డా. రాణితో పాటు పలువురు ఇతర వైద్యులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

# కేటీఆర్ చొరవతో ఆటో కార్మిక కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా



**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 08 (వుదయం ప్రతినిధి) :**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఆటో కార్మికుడు బొమ్మనివేణి రాజు నాలుగు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన కుటుంబానికి ప్రమాద బీమా కింద రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు,జిల్లాలోని 5 వేల మంది ఆటో కార్మికులకు మాజీ మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు సహకారంతో ప్రమాద, ఆరోగ్య బీమా కల్పించిన నేపథ్యంలో, మృతుడు రాజు భార్య బొమ్మనివేణి భాగ్యలక్ష్మి కి ప్రమాద బీమా చెక్కును జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు అల్లే శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు బొల్లి రామ్మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ ఉమర్ సంయుక్తంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆటో కార్మికుల సంక్షేమానికి సహకరిస్తున్న కేటీఆర్, చల్మెడ లక్ష్మీనరసింహారావుకు ఆటో కార్మికుల తరపున వారు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు, వేములవాడ ఆటో కార్మిక నాయకుడు ఎం.ఏ. అంజద్ పాషా, మెడిపెల్లి రాజు, ఎం.డి. ఖాజా, షేక్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## వరి వద్దు.. ఆరుతడి ముద్దు!

- ఎల్‌నినోతో వర్షా భావం ముప్పు.. నీటికి తొలి ప్రాధాన్యం
- ఆయిల్‌పామ్‌తో అధిక ఆదాయం.. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల, ఆగస్టు 08 (వుదయం కరస్పాండెంట్)



వర్షాభావ పరిస్థితులు పొంచి ఉన్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున ఖరీఫ్‌లో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేయాలని పిలుపునిచ్చారు. అందుబాటులో ఉన్న నీటిని తొలుత తాగునీటి అవసరాలకే కేటాయించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కాలువ నీటికి గ్యారంటీ లేదు!జూరాల ప్రాజెక్టుకు ఎగువన ఉన్న జలాశయాల నుంచి ప్రస్తుతం భారీగా వరద నీరు వస్తున్నప్పటికీ.. ఈ నీటిని జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు, కుంటలను నింపేందుకు వినియోగిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వచ్చే వేసవి ముగిసే వరకు ప్రజల తాగునీటి అవసరాలకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. జూరాల ప్రధాన కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తున్నప్పటికీ.. వరద ప్రవాహం తగ్గితే కాలువలకు నీటి సరఫరాను నిలిపివేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఖరీఫ్ సీజన్ మొత్తం కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుందా లేదా అన్న దానిపై ఇప్పుడే స్పష్టత లేదన్నారు. ఈ పరిస్థితుల్లో ఆయకట్టు రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని ఇరిగేషన్ శాఖ అధికారులు ఇప్పటికే సూచించినట్లు తెలిపారు.వరి పంటకు సుదీర్ఘకాలం నీరు అవసర మవుతుందని.. సుమారు నాలుగు నెలలపాటు పొలాల్లో నీరు నిల్వ ఉంచాల్సి ఉంటుందని వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్న పంటల వైవిధ్యాన్ని రైతులు ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు. పందిరి కూరగాయలకు రూ.50 వేల సాయం

ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పందిరి కూరగాయల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని కలెక్టర్ తెలిపారు. ఒక్కో రైతుకు రెండున్నర ఎకరాల వరకు ఐదు యూనిట్ల చొప్పున పందిరి నిర్మాణానికి ఒక్కో యూని ట్‌కు రూ.50 వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తోందన్నారు. అర్హులైన రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని కూరగాయల సాగు ద్వారా అదనపు ఆదాయం పొందాలని సూచించారు. ఆయిల్‌పామ్.. మరో ఆదాయ మార్గం వరి వంటి సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగును పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం గత కొన్నేళ్లుగా ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఆయిల్‌పామ్ మొక్కల మధ్య అంతర పంటలుగా తొలి మూడేళ్లపాటు పప్పు దినుసులు, కూరగాయలు వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేసుకో వచ్చన్నారు. దీంతో ఆయిల్‌పామ్ దిగుబడికి వచ్చేలోపే రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని వివరించారు. నాలుగో సంవత్సరం నుంచి ఆయిల్‌పామ్ గెలలు దిగుబడికి వస్తాయని.. వాటిని సమీపంలోని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మంచి ఆదాయం పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీపై ఆయిల్‌పామ్ మొక్కలతో పాటు బిందు సేద్య పరికరాలను కూడా అందిస్తున్నట్లు చెప్పారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని.. తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. వరిపై ఆధారపడకుండా పంటల వైవిధ్యం, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ సాగు విధానాల ద్వారా రైతులు ఆర్థికంగా పురోగతి సాధించాలని ఆకాంక్షించారు.

## హర్ ఘర్ తిరంగా విజయవంతం చేద్దాం

- ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగరాలి : పద్మ యాదవ్

నాగర్ కర్నూల్, ఆగస్టు 08 (వుదయం బ్యూరో):



కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు నాగర్ కర్నూల్ మండలంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు, హర్ ఘర్ తిరంగా మండల ఇన్‌చార్జ్ పద్మ యాదవ్ ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించారు

ఈ సమావేశానికి భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులుప్రమోద్ కుమార్, జనరల్ సెక్రటరీ శ్రీనుతో పాటు ఇతర నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.ఈ సందర్భంగా పద్మ యాదవ్ మాట్లాడుతూ మండల స్థాయిలో సమీక్షలు నిర్వహించి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని అన్నారు. వివిధ సామాజిక సంస్థలు, ఎన్‌జీఓలు, విద్యావేత్తలు, మత పెద్దలు, బార్ అసోసియేషన్ సభ్యులు, ఇతర సామాజిక వర్గాలను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ప్రతి మండలంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగిరేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. జాతీయ పతాకాల పంపిణీ, ప్రతి ఇంటికీ తిరంగా చేరేలా చర్యలు తీసుకోవాలని, కార్యక్రమానికి సంబంధించిన డీపీని ప్రజలు, కార్యకర్తలు తమ సోషల్ మీడియా ఖాతాల్లో ప్రదర్శించాలని కోరారు.ఆగస్టు 10వ తేదీన ప్రతి ఇంటికీ హర్ ఘర్ తిరంగా సందేశాన్ని విస్తృతంగా తీసుకువెళ్లాలని ఆమె అన్నారు.అనంతరం నాయకులు బాలుర, బాలికల పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు స్వాతంత్ర్య పోరాటం, జాతీయ పతాకం గౌరవం, హర్ ఘర్ తిరంగా ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు ఈ సందేశాన్ని తల్లిదండ్రులకు చేరవేసి ప్రతి ఇంటిపై జెండా ఎగరేయాలని పద్మ యాదవ్ కోరారు. విద్యార్థులకు జాతీయ పతాకాలను పంపిణీ చేశారు. "దేశభక్తి ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావాలి - ప్రతి ఇంటిపై తిరంగా ఎగరాలి. ప్రజలందరి భాగస్వామ్యంతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం." చేయాలని ఆమె పిలుపునిచ్చారు

## పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోండి

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్..

మెదక్ జిల్లా వుదయం



నిజాంపేట మండలం తెలంగాణ రాష్ట్ర ప్రజలకు శుభవార్త సోమవారం నుండి పెన్షన్ దరఖాస్తులు చేసుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అవకాశం కల్పించిందని మండల అధ్యక్షుడు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్ అన్నారు. నూతనంగా పెన్షన్ కొరకు దరఖాస్తు చేసుకోవాల్సిన వారు 1. వితంతు,2.వికలాంగులు, 3.ఒంటరి మహిళ,4.గీత కార్మికులు,5. చేనేత కార్మికులు,6.బోదకాలు,7.దయాలసిస్, చేయించుకునేవారు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యేకు వినతి



వెల్దండ ఆగస్టు8 (వు దయం )

అజిలాపూర్ గ్రామ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందజేయాలని గ్రామ సర్పంచ్ సిద్దగోని రమేష్ గౌడ్ మాజీ ఉప సర్పంచ్ కరుణాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ గణేష్‌గౌడ్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని హైదరాబాద్లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు వార్డు సభ్యులు కొరుపూరి శేఖర్, కాలె వెంకటేష్ కురుమ తదితరులు ఉన్నారు ఈ సందర్భంగా సీసీ రోడ్లు,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ట్రాన్స్ఫార్మర్ మరియు స్తంభాలు, అంగన్వాడీ భవనం, మహిళా సమాఖ్య భవనాల కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సహరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు

## సంగారెడ్డి, సదాశివపేట లో దుర్గమ్మ తల్లి జాతర ల్లో పాల్గొన్న జగ్గారెడ్డి

- సదాశివపేట లోపోతరాజులతో కలిసి చిందులు వేసిన జగ్గారెడ్డి
- సంగారెడ్డి లో దుర్గమ్మ తల్లి ని దర్శించుకుని పూజలు చేసిన జగ్గారెడ్డి , నిర్మల
- ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి వుదయం



సదాశివపేట, సంగారెడ్డి పట్టణాల్లో నిర్వహించిన దుర్గమ్మ తల్లి జాతర మహోత్సవాలలో జగ్గారెడ్డి పాల్గొన్నారు. సదాశివపేట లో అమ్మవారిని దర్శించుకుని హారతి ఇచ్చారు. అనంతరం పోతరాజు లు, భక్తులతో కలిసి జగ్గారెడ్డి స్టెప్పులేశారు. భారీ సంఖ్య లో జాతరకు తరలివచ్చిన ప్రజలతో ఆయన మమేకమయ్యారు. జగ్గారెడ్డి తో చేతులు కలిపేందుకు, సెల్ఫీలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. సంగారెడ్డి పాత బస్టాండ్ సమీపంలోని దుర్గమ్మ జాతర ఉత్సవం లో జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వారితో కలిసి జగ్గారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివ సత్తుల రంగం ను ఆలకించారు. ఆ తర్వాత నిర్వహించిన జాతర క్రతువు ను జగ్గారెడ్డి దగ్గరుండి జరిపించారు. పోతరాజు లతో కలిసి హుషారుగా చిందులేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆషాఢమాసం సందర్భంగా ఏటా దుర్గమ్మ తల్లి జాతర ను నిర్వహించుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది అన్నారు. ప్రజలంతా భక్తి శ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారన్నారు. అమ్మవారి దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ నెల 9 న బోనాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

## ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాల నిర్వహణ

- కాకతీయ విద్యా సంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలి
- నారాయణపేట ఎస్ఎఫ్ఐ డిమాండ్

నారాయణపేట ఆగస్టు 08 (వుదయం ప్రతినిధి)




భారత విద్యార్థి ఫెడరేషన్ నారాయణపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రంలోని కాకతీయ పాఠశాల యజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తరగతులు నిర్వహిస్తుందని, వారిపై జిల్లా విద్యాశాఖాధికారి వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ ఎఫ్ ఐ నారాయణపేట జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. రెండో శనివారం (ప్రభుత్వ సెలవు దినం) అయినప్పటికీ, నిబంధనలను బేఖాతరు చేస్తూ 10వ తరగతి విద్యార్థులకు కాకతీయ పాఠశాల యాజమాన్యం తరగతులు నిర్వహిస్తున్నట్లు విద్యార్థుల ద్వారా సమాచారం అందింది. దీంతో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పాఠశాలకు వెళ్లి పరిశీలించగా విషయం నిజమని తేలడంతో వెంటనే తరగతులను బంద్ చేయించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నారాయణపేట జిల్లా కార్యదర్శి పవన్ కుమార్, జిల్లా అధ్యక్షుడు భానుప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులను, సెలవులను లెక్కచేయకుండా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి పెంచుతూ లాభాపేక్షతోనే ఇలా సెలవు రోజుల్లో కూడా పాఠశాలలు నడుపుతున్నారు. దీనిపై నారాయణపేట డీఈఓ వెంటనే స్పందించి కాకతీయ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి లేదా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డీఈఓ ఆఫీసును ముట్టడిస్తాం అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నారాయణపేట జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ అలివేలుమంగా పద్మావతి వెంకటేశ్వర స్వామి కల్యాణం



దౌల్తాబాద్ ఆగస్టు 8 (వుదయం)

దౌల్తాబాద్ పట్టణంలోని శ్రీ అలివేలు మంగా పద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో, రంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతినెల రెండో శనివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు, కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా దౌల్తాబాద్ పట్టణానికి చెందిన జిల్లా భాగ్యలక్ష్మి-శ్రీనివాస్ దంపతులు స్వామివారి కల్యాణోత్సవానికి ఉభయదాతలుగా వ్యవహరించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అలివేలు మంగా పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. స్వామివారి కల్యాణాన్ని కనులారా వీక్షించిన భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతినెల రెండో శనివారం నిర్వహించే స్వామివారి కల్యాణోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

## శ్రీ అలివేలుమంగా పద్మావతి వెంకటేశ్వర స్వామి కల్యాణం

సిద్దిపేట



దౌల్తాబాద్ పట్టణంలోని శ్రీ అలివేలు మంగా పద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో, రంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతినెల రెండో శనివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు, కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా దౌల్తాబాద్ పట్టణానికి చెందిన జిల్లా భాగ్యలక్ష్మి-శ్రీనివాస్ దంపతులు స్వామివారి కల్యాణోత్సవానికి ఉభయదాతలుగా వ్యవహరించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అలివేలుమంగా పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. స్వామివారి కల్యాణాన్ని కనులారా వీక్షించిన భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతినెల రెండో శనివారం నిర్వహించే స్వామివారి కల్యాణోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

## యూరో కిడ్జీ పాఠశాలలో ఘనంగా బోనాల సంబరాలు

పటాన్‌చెరు (వుదయం):



సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని యూరో కిడ్జీ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర సాంప్రదాయ పండుగ అయిన బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి, పసుపు, కుంకుమ, వేపాకులతో అలంకరించిన బోనాలను తలపై మోసుకుంటూ మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. పోతురాజు వేషధారణలో వచ్చిన విద్యార్థులు ఉత్సాహభరిత నృత్యాలు ప్రదర్శించి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.పాఠశాల ప్రాంగణం తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా సుందరంగా అలంకరించబడగా, విద్యార్థులు బోనాల పండుగ విశిష్టతను తెలియజేసే పాటలు, నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చిన్నారుల ప్రదర్శనలను అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేష్ మాట్లాడుతూ, విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు తమ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని అన్నారు. తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే బోనాల వంటి పండుగలను చిన్ననాటి నుంచే పరిచయం చేయడం ద్వారా పిల్లల్లో సాంస్కృతిక విలువలు పెంపొందుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేష్, సంజన, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం మొత్తం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో సాగి అందరినీ ఆకట్టుకుంది.

## నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్



మహబూబ్ నగర్ ఆగస్టు 08(వుదయం ప్రతినిధి)

బాలానగర్‌లో జరుగుతున్న నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఫ్లైఓవర్ నిర్మాణం, సర్వీస్ రోడ్ల నిర్మాణం పనులను, అంబేద్కర్ విగ్రహానికి సంబంధించిన పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పనుల పురోగతిని సమీక్షించి, నిర్మాణ కార్యకలాపాల ప్రస్తుత స్థితిని అంచనా వేశారు. నిర్ణీత నాణ్యతా ప్రమాణాలకు ఎక్కడా రాజీ పడకుండా, కొత్త ఫ్లైఓవర్, సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసేలా పనులను వేగవంతం చేయాలని ఆయన సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థలను ఆదేశించారు. అలాగే, పనుల నిర్వహణ సమయంలో సంబంధిత శాఖల మధ్య సరైన సమన్వయం ఉండేలా చూడాలని, ఆమోదించబడిన నిర్దేశిత ప్రమాణాలను పాటించాలని మరియు భద్రతా చర్యలను కచ్చితంగా అమలు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. నాణ్యత, భద్రత మరియు సరైన ట్రాఫిక్ నిర్వహణ ఏర్పాట్లతో నిర్ణీత గడువులోగా పనులు పూర్తి కావాలని ఆయన చెప్పారు.

## ఇంటర్మీడియెట్ విద్యార్థులకు గీతం అవగాహన

- అధ్యాపకుల పర్యవేక్షణలో గణిత, విజ్ఞాన శాస్త్రాల బోధన

పటాన్చెరు (వుదయం):



హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత, గణాంక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం ముత్తంగిలోని MJPTBCWRJC, Sangareddy, and SOE Girls కళాశాలలోని ఇంటర్మీడియెట్ విద్యార్థుల కోసం గణిత, విజ్ఞాన శాస్త్ర అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు.

జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్ డ్, ఈఏపీసెట్ పరీక్షలకు సమర్థవంతమైన సన్నద్ధత వ్యూహాలను విద్యార్థులకు అందించడంతో పాటు, ఇంజనీరింగ్, గణితం, విజ్ఞాన శాస్త్రంలో ఉన్నత విద్యను అభ్యసించేలా వారిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. అధ్యాపక బృందం, విద్యార్థి వాలంటీర్లు కలిసి పరీక్షా సంబంధిత భావనలు, సమయాన్ని ఆదా చేసే గణితంలో సులువైన మార్గాలు (షార్ట్ కట్లు), శాస్త్రీయ సమస్య పరిష్కార పద్ధతులు, వృత్తి మార్గదర్శనంపై ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. నేర్చుకున్న భావనలను మరింత పటిష్టం చేయడానికి ఒక ఆసక్తికరమైన క్విజ్ పోటీని నిర్వహించారు. ఇందులో విజేతలకు గీతం లోగోతో కూడిన వాటర్ బాటిళ్లు, పెన్నులను బహుమతిగా అందజేశారు.అధ్యాపక సమన్వయకర్తలు డాక్టర్ పి.నరసింహస్వామి, డాక్టర్ శివారెడ్డి శేరి, డాక్టర్ పి.జితేంద్ర సేనాపతి, డాక్టర్ ఎస్.చక్రవర్తిల పర్యవేక్షణలో, విద్యార్థులు త్రిషల్ సాయి వల్లేపల్లి, చింతలకుంట నితిన్ కుమార్, సుభాంగి పాండా, అనుష్క ప్రజాపతి, పిర్లమర్ల లక్ష్మీ వజ్ర, తలమంచి మనోజ్ కుమార్ ఈ ఔట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## మైసమ్మ దయతో ప్రతి ఇల్లు సుభిక్షంగా ఉండాలి

- మాజీ కౌన్సిలర్ సాయికుమార్
- వైభవంగా ఉప్పల మైసమ్మ బోనాల జాతర
- తొలిసారిగా ఒక్కో ఇంటి నుంచి రెండు బోనాలు
- ప్రత్యేక ఆకర్షణగా వేడుకలు

వుదయం, సిద్దిపేట ప్రతినిధి



ఉప్పల మైసమ్మ అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రతి ఇల్లు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో సుభిక్షంగా ఉండాలని మాజీ కౌన్సిలర్ సాయికుమార్ ఆకాంక్షించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని 6వ వార్డు హనుమాన్‌నగర్‌లో శనివారం ఉప్పల మైసమ్మ బోనాల జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. బోనాల పండుగ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, ప్రత్యేకంగా అలంకరించిన బోనాలను నెత్తిన పెట్టుకుని మంగళహారతులు, భక్తిగీతాలతో అమ్మవారికి సమర్పించారు. పోతురాజుల విన్యాసాలు, మహిళల బోనాల ఊరేగింపుతో హనుమాన్‌నగర్ వీధులు భక్తిపారవశ్యంతో మార్మోగాయి. అమ్మవారి నామస్మరణతో పరిసర ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ ఏడాది ఉత్సవాల్లో తొలిసారిగా ఒక్కో ఇంటి నుంచి రెండు బోనాలు సమర్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు ఉత్సాహంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు తమ కుటుంబాలతో పాటు వార్డులోని ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో, పాడిపంటలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో ఐక్యతతో పాల్గొని ఆధ్యాత్మిక భక్తిభావాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో హనుమాన్‌నగర్ ప్రజలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## ధరలు మండుతున్నాయ్.. ప్రశ్నిస్తే దేశద్రోహులా?

- దేశ సంపదను కార్పొరేట్లకు దారాదత్తం చేస్తున్న మోదీ సర్కార్ : సీపీఐ జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు
- పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరలు తగ్గించాలంటూ ఇటిక్యాలలో సీపీఐ పాదయాత్ర

ఇటిక్యాల, ఆగస్టు 08 (వుదయం కరస్పాండెంట్)




కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతోందని సీపీఐ జోగులాంబ గద్వాల జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు విమర్శించారు. దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం సరికాదని ఆయన అన్నారు.ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఇటిక్యాల మండలంలో సీపీఐ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఇటిక్యాల సర్కిల్ హైవే రోడ్డు నుంచి పొగాకు కంపెనీ మీదుగా జింకలపల్లి వరకు పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా బి. ఆంజనేయులు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో సామాన్యుల జీవనం భారంగా మారిందని అన్నారు. **ప్రశ్నించిన గొంతులను అణచి-వేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం** దేశంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని, ప్రజా సమస్యలపై పోరాడే వారిని దేశద్రోహులుగా ముద్ర వేయడం సిగ్గుచేటని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జి. రంగన్న విమర్శించారు.ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలను చైతన్య పరుస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని రంగన్న హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ ఇటిక్యాల మండల కార్యదర్శి బి. ఆశన్నతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోహీర్ మండలంలో విషాద రోడ్డు ప్రమాదం

కోహీర్ ఆగస్టు 8 (వుదయం ప్రతినిధి )



కోహీర్ మండలం లోని మనియార్‌పల్లి గ్రామ శివారులో ఆటోబైక్ ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు.

మనియార్‌పల్లికి చెందిన. బేగరి జగన్నాథం వయస్సు,23 సంవత్సరాలు, వి. ఎస్ టీ.కంపెనీ విధి నిర్వహణ ముగించుకుని తన పల్సర్ బైక్ (TG 15 A 8542) పై ఇంటికి వస్తున్నాడు. మనియార్ పల్లి వైపు నుండి బిలాల్‌పూర్ వైపు వెళ్తున్న ఆటో (TG 15 UC 5959) అతివేగంగా, బైక్ వేగంగా. డికొట్టగా. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న జగన్నాథం అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.ఆటోలో ప్రయాణిస్తున్న బిలాల్‌పూర్ నివాసి పద్మమ్మ (40) తీవ్రంగా గాయపడింది.స్థానికులు ఆమెను తక్షణమే ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ పద్మమ్మ ఆసుపత్రిలో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతుడి తండ్రి నాగప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కోహీర్ ఎస్.ఐ. నరేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు.ఈ ప్రమాదం తో.రెండు,కుటుంబాల్లో ఈ ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది.అతి,వేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు భావిస్తున్నారు.

## కూలిపోయే దశలో రేకుల ఇల్లు

- ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వేడుకోలు

దౌల్తాబాద్, ఆగస్టు 8(వుదయం):

రాయపోల్ మండల పరిధిలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన చింతకింది శిల్ప తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని అధికారులను వేడుకుంటున్నారు. ప్రస్తుతం నివాసం ఉంటున్న రేకుల ఇంటి గోడలు పూర్తిగా బలహీనపడి ఎప్పుడు కూలిపోతాయో తెలియని ప్రమాదకర పరిస్థితి నెలకొందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటి గోడలు పగుళ్లు ఏర్పడి శిథిలావస్థకు చేరడంతో వర్షాలు కురిసిన సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో ఉండాలంటే భయంగా ఉంటోందని తెలిపారు. ఆర్థిక స్తోమత లేకపోవడంతో సొంతంగా ఇల్లు నిర్మించుకోలేకపోతున్నానని పేర్కొన్నారు. తన కుటుంబ పరిస్థితిని అధికారులు, ప్రజాప్రతినిధులు పరిగణనలోకి తీసుకుని ఇంటిని పరిశీలించాలని కోరారు. నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి, సురక్షితమైన నివాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలని చింతకింది శిల్ప విజ్ఞప్తి చేశారు.





## నేడు కడెం నీటిని విడుదల చేయనున్న ఎమ్మెల్యే

**– కుడి కాలువ ద్వారా పంట పొలాలకు నీరు**



జన్నారం,ఆగస్ట్ 8 (వుదయం విలేఖరి) ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదివారం ఉదయం 10:30 గంటలకు రైతుల శ్రేయస్సు కోసం పంట పొలాలకు కడెం కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేయనున్నారని జన్నారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందు నాయక్ తెలిపారు. ఈ నేపథ్యంలో జన్నారం మండల రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని నీటి విడుదల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం తపాలాపూర్ రైతులు రాస్తారోకో చేయడం అలాగే మిగతా గ్రామాల రైతులు కూడా నీటిని విడుదల చేయాలని కోరిన నేపథ్యంలో ఎమ్మెల్యే వెంటనే స్పందించి నీటి విడుదలకు తేదీ ప్రకటించారు. దీంతో మండలంలోని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## బాలాంజనేయ స్వామిని దర్శించుకున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి



కామారెడ్డి, ఆగస్టు 8 (వుదయం ప్రతినిధి): భిక్కనూరు మండలంలోని శ్రీ కల్పవృక్ష కామధేను అభయారణ్య బాలాంజనేయ స్వామి దేవస్థానాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, బాలాంజనేయ స్వామి వారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. ఆలయ సభ్యులు, భక్తులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఆలయ సభ్యులు గడ్డం చంద్రశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆలయానికి అవసరమైన విద్యుత్ సౌకర్యం, నీటి వసతి, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేలా కృషి చేయాలని గడ్డం చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్, కామారెడ్డి సేవల జిల్లా అధ్యక్షులు గడ్డమీద మహేష్, డిసిసి ఉపాధ్యక్షులు పంపరి లక్ష్మణ్, కామారెడ్డి నియోజకవర్గం సేవాదళ్ అధ్యక్షులు మెహర్ బాబా గౌడ్, మాజీ కౌన్సిలర్లు జమీల్, రంగా రమేష్ గౌడ్, యూత్ సేవాదళ్ అధ్యక్షులు నర్సల్లా మహేష్, బండారి శ్రీకాంత్, పండు శ్రీకాంత్, రాహుల్, శశి, సరుగు సందీప్, చింటూ, యూత్ సభ్యులు, ఆలయ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## చాణక్య హై స్కూల్ లో వైభవంగా బోనాల వేడుకలు..

**-నెత్తిన బోనమెత్తుకున్న మహిళా విద్యార్థుల బృందం..**



నిర్మల్ జిల్లా ఆగస్టు 8 (వుదయం ప్రతినిధి) ప్రతి ఏటా ఆషాడ మాసంలో రాష్ట్రవ్యాప్తంగా బోనాల జాతర వేడుకలు వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాలను నేటితరం విద్యార్థులకు చాటి చెప్పడానికి నిర్మల్ జిల్లా చాణక్య హై స్కూల్ ఆయా యాజమాన్యం వేదికగా ఎంచుకుంది. దీనిలో భాగంగానే శనివారం కళాశాల ప్రాంగణంలో బోనాల వేడుకలను యాజమాన్యం వైభవంగా నిర్వహించింది. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలు, యోగ భోగాలతో జీవించాలని మైసమ్మ అమ్మవారి బోనాల జాతరను నిర్వహిస్తారని స్కూల్ యాజమాన్యం పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలపై అమ్మవారి దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. స్కూల్ లో చదువుతున్న విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను తెలియజెప్పడానికి ప్రతి యేటా ఆషాడ బోనాల వేడుకలను జరుపుతున్నట్లు స్కూల్ డైరెక్టర్స్ సిహెచ్ .వెంకట్ రెడ్డి, టీ.ప్రమోద్ రావు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో స్కూల్ ప్రిన్సిపల్ హరీష్ , అధ్యాపకురాళ్లు ,అధ్యాపకులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# 150కు పైగా మొబైల్ ఫోన్ల రికవరీ

- **ఇప్పటి వరకు ?1.59 కోట్ల విలువైన 994 ఫోన్లు స్వాధీనం**
- **గత 20 రోజుల్లోనే ?32 లక్షల విలువైన 200 మొబైల్ ఫోన్లు రికవరీ చేసిన ప్రత్యేక బృందం**
- **సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఇప్పటివరకు 5275 మొబైల్ ఫోన్లు గుర్తింపు**
- **?8.44 కోట్ల విలువైన ఫోన్లు బాధితులకు అప్పగింత**
- **జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర**



కామారెడ్డి, ఆగస్టు 8 (వుదయం ప్రతినిధి): మొబైల్ ఫోన్ పోయిందని లేదా చోరీకి గురైందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సులభంగా తిరిగి పొందవచ్చని కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర భరోసా ఇచ్చారు. ప్రస్తుత డిజిటల్ కాలంలో మొబైల్ ఫోన్ అనేది కేవలం సమాచార సాధనం మాత్రమే కాకుండా బ్యాంకింగ్ వివరాలు, వ్యక్తిగత ఫోటోలు, కీలకమైన డేటాను కలిగి ఉండే అత్యంత ముఖ్యమైన పరికరమని ఆయన పేర్కొన్నారు. ఫోన్ పోగొట్టుకోవడం వల్ల వ్యక్తిగత భద్రతకు, గోప్యతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నందున, జిల్లా పోలీసు యంత్రాంగం మొబైల్ ఫోన్ల రికవరీపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని వివరించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలనే లక్ష్యంతో ఇన్స్పెక్టర్ సంపత్ పర్యవేక్షణలో, ఆర్ఎస్ఐ బాలరాజు, ఐదుగురు కానిస్టేబుళ్లతో కూడిన ప్రత్యేక సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ బృందం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రతి నెల సగటున 150 కు పైగా మొబైల్ ఫోన్లను రికవరీ చేస్తూ బాధితుల్లో నమ్మకాన్ని పెంపొందిస్తోందని కొనియాడారు. జిల్లాలో రికవరీల గణాంకాలను వెల్లడిస్తూ.. ఇటీవల నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గత 20 రోజుల్లోనే ?32 లక్షల విలువైన 200 మొబైల్ ఫోన్లను రికవరీ చేశామని, అలాగే ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు ?1.59 కోట్ల విలువైన 994 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గత ఏడాది కూడా సుమారు ?3 కోట్ల విలువైన 1,834 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామని గుర్తు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు కామారెడ్డి జిల్లాలో మొత్తం 5275 మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి, గుర్తించి సుమారు ?8.44 కోట్ల విలువైన ఫోన్లను బాధితులకు విజయవంతంగా అప్పగించడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా మొబైల్ రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రత్యేక బృందాన్ని ఆయన అభినందించారు. మొబైల్ ఫోన్ పోయిన వెంటనే ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని, కాలయాపన చేయకుండా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు, దుర్వినియోగం కాకుండా సిమ్ కార్డును బ్లాక్ చేయాలని సూచించారు. అనంతరం సీఈఐఆర్ పోర్టల్‌లో ఫోన్ ఐఎంఈఐ నంబర్‌ను బ్లాక్ చేయాలని కోరారు. పోయిన మొబైల్ ఫోన్ల ద్వారా సైబర్ మోసాలు జరిగే అవకాశం ఉన్నందున, గుర్తుతెలియని లింకులు, అనుమానాస్పద కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

రికవరీ అయిన మొబైల్ ఫోన్లను పొందేందుకు బాధితులు తమ వద్ద ఉన్న సంబంధిత ధ్రువపత్రాలతో జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్ఎస్ఐ బాలరాజు (ఫోన్: 87126 86114)ని సంప్రదించి తమ మొబైల్ ఫోన్లను పొందవచ్చని తెలిపారు.

## కామారెడ్డిలో ట్రాఫిక్ డ్రైవ్ -- నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు

- **143 స్పాట్ చలాన్లు -- 1,51,790 జరిమానా వసూలు**
- **నెంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడిపిన అలాగే ట్యాంపరింగ్ చేసిన నంబర్ ప్లేట్లపై కఠిన చర్యలు**
- **హెల్మెట్ తప్పనిసరి -- డ్రంక్ అండ్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలి**



కామారెడ్డి, ఆగస్టు 8 (వుదయం ప్రతినిధి): కామారెడ్డి టౌన్ ఎస్‌హెచ్‌ఓ నరహరి పర్యవేక్షణలో ఆర్ఎస్సై ట్రాఫిక్ చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో కామారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని సిరిసిల్ల రోడ్, అశోక్‌నగర్ ఠ రోడ్, టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ప్రత్యేక వాహనాల తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో నంబర్ ప్లేట్ లేని వాహనాలు, నిబంధనలకు విరుద్ధంగా లేదా అసంబద్ధంగా ఉన్న నంబర్ ప్లేట్లు కలిగిన వాహనాలపై ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్ ధరించడం, డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉంచుకోవడం వంటి అంశాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 143 స్పాట్ చలాన్లు నమోదు చేసి, ?1,51,790 జరిమానా వసూలు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ వెంట లేకుండా వాహనం నడిపినవి – 146, నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడిపినవి – 17, నిబంధనలకు విరుద్ధంగా/అసంబద్ధమైన నంబర్ ప్లేట్లు –44, డ్రంక్ అండ్ డ్రైవ్ –05, హెల్మెట్ లేకుండా వాహనం నడిపినవి –03 గా నమోదయ్యాయి. వాహనాలకు నిబంధనలకు అనుగుణంగా నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు. నంబర్ ప్లేట్‌ను ట్యాంపరింగ్ చేయడం, అంకెలను మార్చడం, స్పష్టంగా కనిపించకుండా చేయడం లేదా నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడపడం వంటి ఉల్లంఘనలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, మైనర్లు వాహనాలు నడిపితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపడం అంటే డ్రంక్ అండ్ డ్రైవ్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ పాల్పడరాదని పోలీసులు సూచించారు. రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకుని డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడే విధంగా వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కామారెడ్డి ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

## ప్పాపూర్ నూతన పిఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డికి ఘన సన్మానం



కామారెడ్డి, ఆగస్టు 8 (వుదయం ప్రతినిధి): హైదరాబాద్‌లోని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ నివాసంలో భిక్కనూరు మండలం తిప్పాపూర్ నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా నియమితులైన తిరుపరి భీంరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తిప్పాపూర్ పిఏసీఎస్ సొసైటీ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ కి భీంరెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ భీంరెడ్డిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, సహకార సంఘాలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో, ముఖ్యంగా రైతుల ఆర్థిక పురోగతిలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పిఏసిఎస్ ద్వారా రైతులకు అవసరమైన సేవలు మరింత సమర్థవంతంగా అందేలా కృషి చేయాలని, రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. తనపై నమ్మకంతో పీఏసీఎస్ చైర్మన్ బాధ్యతలు అప్పగించినందుకు భీంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తిప్పాపూర్ సొసైటీ పరిధిలోని రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సొసైటీ ద్వారా రైతులకు అందాల్సిన ప్రభుత్వ పథకాలు, రుణాలు, వ్యవసాయ సంబంధిత సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తిరుపరి భీంరెడ్డికి పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభినందనలు తెలిపారు. సొసైటీ చైర్మన్‌గా భీంరెడ్డి నియామకం పట్ల తిప్పాపూర్, భిక్నూర్ మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భిక్నూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్, తిప్పాపూర్ సర్పంచ్ లింగారెడ్డి, వరలక్ష్మి, కనకవ్వ, సుభాకర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రమేష్, కొమురయ్య, యాదగిరి, మాసయ్య, మధుసూదన్, వినయ్, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ ప్రయోజనాలను కాపాడేందుకు సమిష్టిగా కృషి చేద్దాం

**జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశంలో ప్రభుత్వ సలహాదారు పోచారం, ఎమ్మెల్యేలు**
**నిజామాబాద్ కలెక్టర్ భవేష్ మిశ్రా అధ్యక్షతన కొనసాగిన సమావేశం**
**వర్చువల్ ద్వారా పాల్గొన్న కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**



నిజామాబాద్, ఆగస్టు 08 : నిజామాబాద్ ఉమ్మడి జిల్లా రైతాంగం ప్రయోజనాలను కాపాడడమే పరమావధిగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమిష్టిగా కృషి చేద్దామని శాసన సభ్యులు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శనివారం నిజామాబాద్ కలెక్టర్ భవేష్ మిశ్రా అధ్యక్షతన జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం జరిగింది. ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డిలు విచ్చేయగా, కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వర్చువల్ విధానం ద్వారా పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలోని నిజాంసాగర్, శ్రీరాంసాగర్, సింగూరు, కౌలాస్ నాలా, పోచారం, రామడుగు తదితర జలాశయాలలో నీటి నిల్వల స్థితిగతులు, ఆయకట్టు పంటలకు సాగు నీటిని అందించే వెసులుబాటు, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, పంటల వైవిధ్యీకరణకై రైతులకు అవగాహన కల్పించడం తదితర అంశాలపై చర్చించారు. ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, వివిధ జలాశయాల ద్వారా యాసంగి పంటలకు సాగు నీటిని అందించేందుకు వీలుగా ప్రతీ సంవత్సరం రబీ సీజన్ సమయంలో జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశాలు జరిగేవని గుర్తు చేశారు. అయితే ఈసారి ఎల్ నినో ప్రభావం వల్ల రైతులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకునేందుకు వీలుగా ప్రభుత్వ సూచనల మేరకు ఖరీఫ్ సీజన్ సమయంలోనే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఎల్ నినో ప్రభావం వల్ల మునుముందు వర్షాలు తక్కువగా కురిసే అవకాశాలు ఉన్నందున, వరి పంట విత్తుకున్న రైతులు నష్టపోకుండా అధికారులు చొరవ చూపాలన్నారు. ఇంకా పంట వేసుకోని రైతులు ఆరుతడి పంటలు, కూరగాయలు, ఆయిల్ పామ్ సాగు చేసేలా రైతు వేదికల ద్వారా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం నారు ముదిరిపోయినందున వరి నాట్లు వేసే సమయం మించిపోయిందని, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడమే మేలు చేకూరుస్తుందని అన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, నీటి పారుదల, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ, క్షేత్రస్థాయిలో రైతులకు అవసరమైన తోడ్పాటును అందించాలని హితవు పలికారు. ఈ నెలాఖరు (ఆగస్టు చివరి వారం)లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న శివం కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారని తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టు కింద నిజామాబాద్ జిల్లాలో లక్షా 15 వేల ఆయకట్టు విస్తీర్ణం ఉందని, ఈ జలాశయంలో ప్రస్తుతం 10.78 టీ.ఎం.సీల నీరు నిలువ ఉన్నందున ఆయకట్టుకు మూడు నుండి నాలుగు తడులు సాగు నీటిని అందించేందుకు అవకాశం ఉందన్నారు. రైతులు వేసుకున్న వరి పంటను పరిరక్షించేలా, ఇంకనూ పంటలు విత్తుకోని భూములలో ఆరుతడి పంటలు, కూరగాయలు, ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా రైతులను ప్రోత్సహించేందుకు వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్ జిల్లాల తాగునీటి అవసరాలకు ఉపయోగపడుతున్న సింగూర్ రిజర్వాయర్ కు మరమ్మతులు చేపడుతున్న కారణంగా సామర్థ్యం మేరకు నీటిని నిలువ ఉంచే పరిస్థితి లేదని, ప్రస్తుతం నిలువ ఉన్న 4.140 టీ.ఎం.సీల నీటిని తాగునీటి సరఫరాకే వినియోగించాల్సిన పరిస్థితి ఉందన్నారు.

## ప్రెస్ భవన్ ప్రహరీ గోడకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి



జన్నారం,ఆగస్ట్ 8 (వుదయం విలేఖరి) జన్నారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ భవనానికి చుట్టూ ప్రహరీ గోడకు నిధులు మంజూరు చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కు జన్నారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉట్నూర్‌లోని క్యాంపు కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ప్రెస్ భవనానికి ప్రహరీ గోడ లేకపోవడం వల్ల భవనానికి రక్షణ లేకుండా పోయిందని ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరారు.

ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గాజుల లింగన్న గౌడ్,గౌరవ అధ్యక్షులు చిలువేరు నర్సయ్య,ఉపాధ్యక్షులు ఎంబడి మల్లేశం,ప్రధాన కార్యదర్శి జాడి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ప్రాజోలామ్‌తో కల్తీ చేసిన కల్లు విక్రయం: ఇద్దరు నిందితుల అరెస్ట్

***60 కల్లు సీసాలు, 2 మొబైల్ ఫోన్లు స్వాధీనం***
**వివరాలు వెల్లడించిన ఎల్లారెడ్డి సీఐ రాజారెడ్డి**



కామారెడ్డి, ఆగస్టు 8 (వుదయం ప్రతినిధి): విశ్వసనీయ సమాచారం మేరకు 06-08-2026న ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని వెల్లుట్ల గ్రామంలో ఎస్సై బాల సుబ్రమణ్యాచారి ఆధ్వర్యంలో పోలీసులు ఓ కల్లు దుకాణంపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో దుకాణంలో ఉన్న కల్లు విక్రేత సాతెల్లి నాగేశ్వర్ గౌడ్ ను అదుపులోకి తీసుకుని, వినియోగదారులకు విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన 60 కల్లు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో కల్లులో ఆల్ప్రాజోలామ్ అనే మత్తు పదార్థాన్ని కలిపి విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. అదే సమయంలో దుకాణంలో కల్లు సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులకు నిర్వహించిన ప్రాథమిక డ్రగ్ టెస్టులో బెంజోడయాజెపైన్ పాజిటివ్ గా తేలింది. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన వైద్య పరీక్షల్లో కూడా బి జడ్ ఓ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దర్యాప్తును కొనసాగించిన పోలీసులు 07-08-2026న కల్లు దుకాణం లైసెన్స్ హోల్డర్ మాసాని మాసగౌడ్ ను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో తన కల్లు దుకాణం లైసెన్స్‌ను సంవత్సరానికి రూ. 2,50,000/-కు నాగేశ్వర్ గౌడ్‌కు లీజుకు ఇచ్చినట్లు వెల్లడించాడు. లైసెన్స్‌పై నాగేశ్వర్ గౌడ్ కల్లు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో నిర్ధారణ అయింది. ఈ కేసులో పోలీసులు 60 కల్లు సీసాలు, రెండు మొబైల్ ఫోన్లు, ఇతర సంబంధిత ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరుస్తున్నట్లు ఎల్లారెడ్డి సీఐ డి.రాజారెడ్డి తెలిపారు. ప్రజలకు విజ్ఞప్తిమత్తు పదార్థాలు కలిపిన కల్లు లేదా ఇతర ఆహార పదార్థాలు, పానీయాలను విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కామారెడ్డి జిల్లా పోలీసులు ప్రజలను కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## శ్రీహర్ష డిగ్రీ కళాశాలలో వైభవంగా బోనాల వేడుకలు..

**-నెత్తిన బోనమెత్తుకున్న కళాశాల మహిళా అధ్యాపక బృందం..**



మంచిర్యాల/ రామకృష్ణాపూర్ /ఆగస్టు 8 (వుదయం ప్రతినిధి) ప్రతి ఏటా ఆషాడ మాసంలో రాష్ట్రవ్యాప్తంగా బోనాల జాతర వేడుకలు వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాలను నేటితరం విద్యార్థులకు చాటి చెప్పడానికి మంచిర్యాల శ్రీహర్ష కళాశాలను ఆయా యాజమాన్యం వేదికగా ఎంచుకుంది. దీనిలో భాగంగానే శనివారం కళాశాల ప్రాంగణంలో బోనాల వేడుకలను యాజమాన్యం వైభవంగా నిర్వహించింది. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలు, యోగ భోగాలతో జీవించాలని మైసమ్మ అమ్మవారి బోనాల జాతరను నిర్వహిస్తారని కళాశాల యాజమాన్యం పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలపై అమ్మవారి దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను తెలియజెప్పడానికి ప్రతి యేటా ఆషాడ బోనాల వేడుకలను జరుపుతున్నట్లు కళాశాల చైర్మెన్ పల్లె భూమేష్ పేర్కొన్నారు. ఈ వేడుకల్లో కళాశాల ప్రిన్సిపల్ అరెల్లి అనిత, అధ్యాపకురాళ్లు మానస, శ్రావణి, దివ్య, అధ్యాపకులు చిరంజీవి, సమ్మయ్య, శ్రీనివాస్, రాజు, రమేష్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

# ఈ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం వద్దు!



ఒక్కోసారి ఉన్నట్లుండి మాట తడబడుతుంటుంది.. ఆ వెంటనే తిరిగి మామూలుగా అవడంతో పెద్దగా పట్టించుకోం..

అప్పుడప్పుడూ ఛాతీలో నొప్పి వస్తుంటుంది.. గ్యాస్ట్రిక్ సమస్యేమోనని నిర్లక్ష్యం చేస్తుంటాం..

సడన్‌గా బరువు తగ్గడం, జుట్టు ఎక్కువగా రాలడాన్ని అంత సీరియస్‌గా తీసుకోరు కొంతమంది.. అయితే ఇలాంటి లక్షణాలను ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకూడదంటున్నారు నిపుణులు. కొంతమందికి ఉన్నట్లుండి మాట తడబడుతుంటుంది.. ముద్దగా వస్తుంది. కాసేపటికి అదే సర్దు కుంటుందిలే అని దీన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు. అయితే ఈ లక్షణం శరీరంలో కొన్ని అనారోగ్యాలకు సంకేతమని చెబుతున్నారు నిపుణులు. రక్తంలో సోడియం–చక్కెర స్థాయిలు పడిపోవడం, అమ్మోనియా స్థాయిలు పెరిగిపోవడం, కాలేయ సంబంధిత సమస్యలు, మెదడు సంబంధిత ఇన్ఫెక్షన్లు.. వంటి సమస్యలున్నప్పుడు ఇలా జరిగే అవకాశాలున్నాయంటున్నారు. కాబట్టి ఇలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం వల్ల అసలు సమస్యను గుర్తించవచ్చంటున్నారు. ఒక్కోసారి ఉన్నట్లుండి తీవ్ర గందరగోళానికి గురవుతుంటాం.. చేసే చేతలకు, మాటలకు పొంతన ఉండదు. ఇలాంటి లక్షణాలు దీర్ఘకాలంలో నాడీ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశాలు ఎక్కువంటున్నారు నిపుణులు. జీవక్రియల పనితీరు అదుపు తప్పడం, మెదడులో ఇన్ఫెక్షన్లు, అరుదుగా బ్రెయిన్ స్ట్రోక్‌కు కూడా ఈ లక్షణాలు కారణం కావచ్చని చెబుతున్నారు. కాబట్టి ఇలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే అలర్ట్ అవ్వమని సలహా ఇస్తున్నారు. ఉదర సంబంధిత సమస్యలు, గ్యాస్ట్రిక్ సమస్యలున్న వారిలో ఒక్కోసారి ఛాతీలో నొప్పి వచ్చే అవకాశముంటుంది. అయితే ఈ నొప్పికి ప్రతిసారీ ఇవే సమస్యలు కారణం కాకపోవచ్చంటున్నారు నిపుణులు. నొప్పికి తోడు ఛాతీపై ఎక్కువ బరువు మోపినట్లుగా అనిపించడం, మంట.. అది క్రమంగా చేతుల్లోకీ విస్తరించడం.. వంటి లక్షణాలు గమనిస్తే ఆలస్యం చేయకుండా డాక్టర్‌ని సంప్రదించడం మంచిదంటున్నారు. ఎందుకంటే ఈ తరహా లక్షణాలు ఒక్కోసారి గుండె సంబంధిత సమస్యలు, గుండెపోటుకు దారితీసే ప్రమాదం ఉందంటున్నారు.

అలాగే కొంతమంది జ్వరాన్ని తేలిగ్గా తీసుకుంటారు. ట్యాబ్లెట్స్, యాంటీ బయాటిక్స్‌తో ఈ సమస్య నుంచి బయటపడచ్చనుకుంటారు. కానీ జ్వరం ఎక్కువ రోజుల పాటు తగ్గకపోతే.. ఇది ఒక్కోసారి వివిధ రకాల ఆటోఇమ్యూన్ వ్యాధులకు సూచన కావచ్చంటున్నారు నిపుణులు. కాబట్టి ఈ లక్షణాల్ని నిర్లక్ష్యం చేయకపోవడం మంచిదని చెబుతున్నారు.

# అద్దమే అలారం అయితే..!

ఏంటీ రూల్ అనుకుంటున్నారా? ఉదయం బ్రష్ చేసుకుంటూ... తల దువ్వుకుంటూ... బట్టలు మార్చుకున్నాక... ఇలా రోజులో కనీసం నాలుగైదుసార్లైనా అద్దం ముందుకు వెళ్తుంటాం. అక్కడే అలారాన్ని పెట్టుకుంటే బాగుంటుంది అంటున్నారు జెన్‌జీ అమ్మాయిలు. డైలీ స్కిన్ కేర్ రొటీన్‌లో మరిచిపోతున్న అలవాట్లు... రెండుసార్లు ఫేస్‌వాష్ చేసుకోవాలి. ఉదయం టోనర్, మాయిశ్చరైజర్ రాసుకోవాలి. రాత్రి నైట్ క్రీమ్ రాయాలి... ఈ విషయాలన్నీ పేపర్‌పై రాసి, అద్దానికి అతికించుకోవాలంటున్నారు. డ్రెసింగ్ టేబుల్, బాత్రూమ్, వార్డ్‌రోబ్‌లో ఉండే అద్దాలపై వీటిని అతికించాలట. ఇలా చేయడం వల్ల అద్దంలో మనల్ని చూసుకున్న ప్రతిసారీ ఈ జాగ్రత్తలు గుర్తొస్తాయన్నమాట. పైగా రోజూ


అసలే వర్షాకాలం... వాతావరణంలో తేమ పెరుగుతుంది. దీనికితోడు కాలుష్యం. వాటి నుంచి చర్మాన్ని కాపాడుకోవడానికి అమ్మాయిలు చాలానే చేయాలనుకుంటాం. కానీ, పగలు హడావుడిలో... రాత్రుళ్లేమో అలసిపోయి మర్చిపోతాం. తీరా కళలేని ముఖాన్ని అద్దంలో చూసుకుని తెగ బాధపడిపోతాం. అందుకే ఈసారి 'మిర్రర్ రూల్'ని పాటించి చూడండి.




ఫోన్‌లో రిమైండర్స్ పెట్టుకోవాల్సిన అవసరమూ ఉండదు. అంతేకాదు, బ్యూటీ ఉత్పత్తుల్ని ఎదురుగా కనిపించేలా పెట్టుకుంటే మంచిదని చెబుతున్నారు. బాగుంది కదా ఈ రూల్. అవసరం అనుకుంటే పాటించి చూడండి మరి!

# మీ కురులు క్షేమమేనా!?

వానాకాలంలో జుట్టును సంరక్షించుకోవడం చాలాకష్టంగా ఉంటుంది. ఉదయాన్నే తలస్నానం చేసి, ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. ఓ చిన్నపాటి వర్షం అంతా చెడగొట్టేస్తుంది. వానలో తడిసి ఇంటికి తిరిగి వచ్చేసరికి స్కాల్ప్ జిడ్డుగా, బంకగా మారిపోతుంది. మహా చికాకు పెట్టేస్తుంది. ఇలా జరగడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. వాటిని తెలుసుకొని, పరిష్కార మార్గాలు అన్వేషిస్తే..వర్షంలో తడిసినప్పుడు జుట్టు మొత్తం కిందికి అణిగిపోతుంది. దాంతో వెంట్రుకలు తమ ఒత్తయిన రూపు కోల్పోయి.. మాడుపై ఉండే సహజసిద్ధమైన నూనెలు బయటికి కనిపిస్తాయి. అందువల్లే.. జుట్టు జిడ్డుగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఇక వర్షాకాలంలో తేమ చాలా ఎక్కువగా ఉంటుంది. అందుకే, భారీ వర్షం పడిన తర్వాత కూడా విపరీతంగా చెమట పడుతుంది. ఈ చెమట.. మాడుపై ఉండే సహజ నూనెలతో కలిసి జుట్టును బరువుగా, జిడ్డుగా మార్చేస్తుంది. వర్షపు నీటిలో ఎన్నో రకాల కాలుష్య కారకాలు కలుస్తాయి. ఇవి జుట్టుకు అంటుకోవడం వల్ల జుట్టు మురికిగా తయారవుతుంది. అంతేకాకుండా.. కొన్నిరకాల హెయిర్ కేర్ ఉత్పత్తులు పొడి జుట్టుపై మాత్రమే వాడాల్సి ఉంటుంది. వర్షం నీటిలో తడిసినప్పుడు.. ఆయా ప్రొడక్ట్స్ మళ్లీ యాక్టివేట్ అవుతాయి. దాంతో మాడు మామూలు కన్నా ఎక్కువ బంకగా మారిపోతుంది. మొత్తానికి తలస్నానం చేసి, జుట్టు సంరక్షణ కోసం రకరకాల ఉత్పత్తులు వాడినా.. ఓ చిన్న వర్షంతో నెత్తి మొత్తం జిడ్డుగా తయారవుతుంది. ఈ సమస్యను నివారించడానికి, జుట్టును ఆరోగ్యంగా ఉంచుకోవడానికి.. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది. వర్షాకాలంలో జెల్స్, వ్యాక్స్, డ్రై షాంపూలు, లీవ్–ఇన్ కండిషనర్ల వాడకాన్ని తగ్గించండి. ఇవి గాలిలోని తేమను పీల్చుకుని, జుట్టును మరింత బంకగా మారుస్తాయి. వర్షంలో తడిస్తే వెంటనే తలస్నానం చేయండి. దాంతో వర్షపు నీటిలోని కాలుష్య కారకాలు వదిలిపోయి, మాడు ఇన్ఫెక్షన్లకు గురికాకుండా ఉంటుంది. వర్షాకాలంలో మాడుపై చెమట, జిడ్డు ఎక్కువగా చేరుతుంది.



# కాఫీ తాగిన వెంటనే ఉత్సాహంగా అనిపిస్తుంది, ఎందుకని..

కాఫీ ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా తాగే పానీయాల్లో ఒకటి. ముఖ్యంగా అలసటగా అనిపించినప్పుడు లేదా పనిలో ఏకాగ్రత తగ్గినప్పుడు చాలా మంది వెంటనే ఒక కప్పు కాఫీ తాగుతారు. కాఫీ తాగిన కొద్దిసేపటికే శరీరంలో ఉత్సాహం పెరిగినట్లు అనిపిస్తుంది. అయితే నిజంగా కాఫీ శరీరానికి శక్తిని ఇస్తుందా? లేక అది కేవలం కొంతసేపు మాత్రమే చురుకుదనాన్ని కలిగిస్తుందా? దీనిపై నిపుణులు ఆసక్తికరమైన విషయాలను వెల్లడిస్తున్నారు. మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత చాలా మందికి అలసట, నిద్రమత్తు వస్తుంది. అలాంటి సమయంలో ఒక కప్పు కాఫీ తాగితే వెంటనే మళ్లీ చురుకుగా అనిపిస్తుంది. దీంతో కాఫీ శరీరానికి శక్తిని అందిస్తుందని చాలామంది భావిస్తారు. కానీ వాస్తవానికి కాఫీ శరీరంలో శక్తి (కేలరీల)ని పెంచదు. అది కేవలం మెదడుపై పనిచేసి కొంతసేపు మెళకువగా, చురుకుగా ఉండేలా చేస్తుంది. కాఫీలో ఉండే ప్రధాన పదార్థం కెఫీన్. ఇది మెదడు పనితీరును ఉత్తేజపరిచే సహజ ఉద్దీపన పదార్థం. కెఫీన్ మెదడులోని అడెనోసిన్ రిసెప్టర్లపై ప్రభావం చూపుతుంది. సాధారణంగా అడెనోసిన్ అనే రసాయనం శరీరానికి విశ్రాంతి, నిద్రమత్తును కలిగిస్తుంది. కెఫీన్ ఈ ప్రభావాన్ని తాత్కాలికంగా అడ్డుకోవడంతో అలసట తగ్గినట్లు అనిపించి, అప్రమత్తత పెరుగుతుంది. అందుకే కాఫీ తాగిన వెంటనే ఉత్సాహంగా ఉన్న భావన కలుగుతుంది. అయితే ఈ ప్రభావాన్ని శరీరానికి నిజమైన శక్తి లభించిందని భావించకూడదు. పోషకాహార పరంగా శక్తి అంటే కేలరీలు. కానీ బ్లాక్ కాఫీలో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. కాబట్టి కాఫీ శరీరానికి అదనపు శక్తిని అందించదు. అది కేవలం మెదడును కొంతసేపు ఉత్తేజపరచి అలసటను తగ్గించినట్లు అనిపించేలా చేస్తుంది. కాఫీలో యాంటీఆక్సిడెంట్లు కూడా అధికంగా ఉంటాయి. ఇవి శరీర కణాలను ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టాల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. కెఫీన్ ప్రభావంపై జరిగిన కొన్ని పరిశోధనల్లో అల్జీమర్స్, పార్కిన్సన్స్, డిమెన్షియా వంటి నాడీ సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో ఇది కొంతవరకు ఉపయోగపడుతుందని సూచించారు. అయితే దీనిపై మరిన్ని పరిశోధనలు అవసరమని నిపుణులు పేర్కొంటున్నారు. కాఫీ వల్ల వచ్చే చురుకుదనం ఎక్కువసేపు ఉండదు. కొంత సమయం తర్వాత కెఫీన్ ప్రభావం తగ్గిపోతుంది. దీంతో మళ్లీ అలసటగా అనిపించే అవకాశం ఉంటుంది. అందువల్ల కాఫీని శక్తికి ప్రత్యామ్నాయంగా భావించడం సరైంది కాదు. అలాగే కాఫీని అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదు.



ఎక్కువ కాఫీ తాగడం వల్ల శరీరంలో నీటి కొరత (డీహైడ్రేషన్) ఏర్పడే అవకాశం ఉంటుంది. అలాగే నిద్రలేమి, ఆందోళన, ఒత్తిడి వంటి సమస్యలు ఉన్నవారు కాఫీని పరిమితంగా తీసుకోవాలి. జీర్ణవ్యవస్థ బలహీనంగా ఉండే వారు, ముఖ్యంగా ఐబీఎస్ (ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్), తరచూ విరేచనాల సమస్య ఉన్నవారు కూడా కాఫీని ఎక్కువగా తీసుకోవడం నివారించాలి. ఎందుకంటే ఇది వారి సమస్యలను మరింత పెంచే అవకాశం ఉంటుంది. కాఫీ తాగిన వెంటనే శరీరంలో శక్తి పెరిగినట్లు అనిపించినా, అది నిజమైన శక్తి కాదు. కెఫీన్ వల్ల మెదడు కొంతసేపు అప్రమత్తంగా మారడం వల్ల కలిగే తాత్కాలిక ప్రభావమే. కాబట్టి కాఫీని మితంగా తీసుకుంటే ప్రయోజనాలు పొందవచ్చు. అయితే అతిగా తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున పరిమితంగా తీసుకోవడం ఉత్తమం.

# తలనొప్పి సమస్య అసలు ఎందుకు వస్తుంది..

తలనొప్పి చాలా మందిని తరచూ ఇబ్బంది పెట్టే సాధారణ ఆరోగ్య సమస్య. ఇంట్లో ఉన్నా, కార్యాలయంలో ఉన్నా లేదా ప్రయాణంలో ఉన్నా తలనొప్పి రోజువారీ పనులపై ప్రభావం చూపుతుంది. చాలామంది ఒక కప్పు కాఫీ తాగడం లేదా కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవడం ద్వారా తలనొప్పి తగ్గిపోతుందని భావిస్తారు. అయితే ప్రతిసారి అలా జరగదు. ఆయుర్వేదంలో తలనొప్పి నుంచి ఉపశమనం పొందేందుకు కొన్ని సహజమైన ఆహారాలు, ఇంటి చిట్కాలు ఉన్నాయి. ఆయుర్వేదం ప్రకారం తలకు సున్నితంగా మసాజ్ చేయడం తలనొప్పి తగ్గించడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా శరీరంలో నీటి కొరత (డీహైడ్రేషన్) వల్ల వచ్చే పిత్త సంబంధిత తలనొప్పుల్లో తరచూ నీరు లేదా ఆరోగ్యకరమైన పానీయాలు తీసుకోవడం మంచిదని సూచిస్తోంది. అలాగే జలుబు, దగ్గు కారణంగా ముక్కు మూసుకుపోయి తలనొప్పి వస్తే, ఆయుర్వేద మూలికల నూనె లేదా నెయ్యిని ముక్కు రంధ్రాలలో వేయడం ద్వారా ఉపశమనం లభిస్తుంది. బ్రాహ్మి తలనొప్పిని తగ్గించడంలో ఉపయోగపడే ముఖ్యమైన ఆయుర్వేద మూలికగా చెప్పవచ్చు. ఇది శరీరానికి చల్లదనాన్ని అందించడంతోపాటు ఒత్తిడి, మానసిక ఆందోళనను తగ్గించడంలో సహాయపడుతుంది. బ్రాహ్మి నూనెతో తలకు మసాజ్ చేయడం లేదా బ్రాహ్మి, నెయ్యి చుక్కలను ముక్కులో వేయడం వల్ల తలనొప్పి నుంచి ఉపశమనం లభించే అవకాశం ఉంటుంది. చందనం కూడా తలనొప్పికి ఉపయోగించే సంప్రదాయ చికిత్సల్లో ఒకటి. అర టీస్పూన్ చందనం పొడిలో కొద్దిగా నీరు కలిపి పేస్ట్ లా తయారుచేసి నుదుటిపై రాసి సుమారు 20 నిమిషాలు ఉంచితే చల్లదనాన్ని అందించి తలనొప్పిని తగ్గించడంలో సహాయపడుతుంది. తగర్ అనే ఔషధ మూలికను కూడా ఆయుర్వేదంలో ఉపయోగిస్తారు. ఈ మూలికతో తయారైన ఔషధ నూనెతో మసాజ్ చేయడం లేదా టీ రూపంలో తీసుకోవడం వల్ల కొంత ఉపశమనం పొందవచ్చు. చిన్న యాలకులను నమలడం కూడా కొన్ని రకాల తలనొప్పులను తగ్గించడంలో ఉపయోగపడుతుంది. అలాగే సాధారణ ఉప్పుకు బదులుగా రాక్ సాల్ట్ వాడడం కొందరికి ప్రయోజనకరంగా ఉంటుంది. గోరువెచ్చని నీటిలో చిటికెడు రాక్ సాల్ట్ కలిపి తాగడం కూడా కొన్ని రకాల తలనొప్పులకు ఉపశమనం కలిగిస్తుంది. ఆయుర్వేదం ప్రకారం తలనొప్పిని వాత, పిత్త, కఫ అనే మూడు రకాలుగా వర్గీకరిస్తారు. ఏ రకమైన తలనొప్పో గుర్తిస్తే దానికి తగిన చికిత్సను ఎంచుకోవడం సులభమవుతుంది. వాత సంబంధిత తలనొప్పి సాధారణంగా తల వెనుక భాగంలో ప్రారంభమై ముందుభాగానికి వ్యాపిస్తుంది. మెడ, భుజాల్లో బిగుతు, మలబద్ధకం, వీపు నొప్పి వంటి సమస్యలు కూడా దీంతోపాటు కనిపిస్తాయి. ఇలాంటి సందర్భాల్లో ప్రతి ముక్కు రంధ్రంలో మూడు నుంచి ఐదు చుక్కల గోరువెచ్చని నెయ్యి వేయడం వల్ల ఉపశమనం లభిస్తుంది. శరీరంలో నీటి కొరత లేకుండా చూసుకోవడం, ఒక గ్లాస్ నీటిలో ఒక టేబుల్ స్పూన్ చక్కెర, అర టీస్పూన్ ఉప్పు కలిపి తాగడం, జాజికాయ పొడితో పేస్ట్ తయారుచేసి నుదుటిపై రాయడం కూడా ఉపయోగపడతాయి. పిత్త సంబంధిత తలనొప్పి సాధారణంగా కణతల వద్ద ప్రారంభమై తల మధ్య భాగానికి వ్యాపిస్తుంది. ఎండలో ఎక్కువసేపు ఉండడం లేదా ఎక్కువ కారం ఉన్న ఆహారం తినడం వల్ల ఈ నొప్పి మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో రోజుకు మూడు సార్లు రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్ తీసుకోవడం వల్ల ఉపశమనం లభిస్తుంది. అలాగే చందనం పేస్ట్‌ను తలకు రాయడం, జీలకర్ర, ధనియాలతో తయారు చేసిన టీ తాగడం కూడా పిత్త సంబంధిత తలనొప్పిని తగ్గించడంలో సహాయపడుతుంది.



# రాగి జావతో షుగర్ నియంత్రణే కాదు.. ఇంకా ఎన్ని లాభాలో తెలుసా..?



రాగి జావ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇందులో శరీరానికి అవసరమైన అనేక పోషకాలు ఉంటాయి. క్యాల్షియం, ఐరన్, మెగ్నీషియం , ప్రోటీన్లు, ఫైబర్‌తో పాటు విటమిన్ B1, B2 వంటి పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి. ఉదయాన్నే రాగి జావ తాగితే ఎంతో మంచిదని షుగర్ రోగులకు వైద్యులు సూచిస్తుంటారు. కేవలం షుగర్ రోగులే కాదు, ఎవరైనా రాగి జావతో రోజును ప్రారంభిస్తే అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు. రాగిలో అధికంగా ఉండే క్యాల్షియం ఎముకల ఆరోగ్యానికి ఎంతో అవసరం. క్రమం తప్పకుండా రాగి జావ తాగడం వల్ల ఎముకలు బలపడతాయి. ముఖ్యంగా పిల్లలు, మహిళలు, వృద్ధులకు ఇది చాలా ఉపయోగకరం. ఎముకల బలహీనత సమస్యలను తగ్గించడంలో ఇది సాయపడుతుంది. రాగిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో హానికరమైన ఫ్రీ రాడికల్స్‌ను తగ్గిస్తాయి. దాంతో ఇన్ఫెక్షన్లను ఎదుర్కొనే శక్తి పెరుగుతుంది. శరీర రోగనిరోధక వ్యవస్థ బలపడటానికి రాగి జావ సహాయపడుతుంది. రాగి జావలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇది మలబద్ధకం సమస్యను తగ్గించి, పేగుల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రోజూ తీసుకుంటే జీర్ణవ్యవస్థ సజావుగా పనిచేస్తుంది. రాగిలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటంవల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా సహాయపడుతుంది. అందువల్ల డయాబెటిస్ ఉన్నవారు దీన్ని ఆహారంలో చేర్చుకుంటారు. రాగి జావలో ప్రొటీన్, ఫైబర్ ఎక్కువగా ఉండటంవల్ల ఎక్కువసేపు ఆకలి అనిపించదు. కడుపు నిండిన భావన కలుగుతుంది. దాంతో ఆహారం అధికంగా తీసుకోకుండా ఉంటారు. ఫలితంగా బరువు నియంత్రణ జరుగుతుంది.

# చర్మం నిగారించేలా!

కాసేపు పని చేస్తే చాలు.. ఎక్కడ లేని అలసట వచ్చేస్తుంది. ఈ అలసట మిగతా శరీర భాగాలకే కాదు.. చర్మానికీ ఉంటుందంటున్నారు నిపుణులు. అవును.. మనం అంతగా పట్టించుకోం కానీ.. మన చర్మం కూడా అలసిపోతుందట! అందుకు ఉదాహరణే అప్పుడప్పుడు ముఖం వాడిపోయినట్లు కనిపించడం. మరి, అలసిన చర్మం తిరిగి సాంత్వన పొంది తాజాగా మారాలంటే ఏం చేయాలి? చూద్దాం రండి.. చర్మం అలసిపోయినట్లు కనిపించడానికి సగం కారణం ముఖంపై ఏర్పడే మృతకణాలే. అందుకే వీటిని ఎప్పటికప్పుడు స్క్రబ్ చేస్తూ తొలగించుకుంటే చర్మం తాజాదనాన్ని సంతరించుకుంటుంది. చర్మ ఛాయ కూడా మెరుగుపడుతుంది. కనీసం వారానికి ఒకసారైనా ముఖం, చర్మంపై పేరుకున్న మృతకణాల్ని తొలగించుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం.. ఒక టేబుల్ స్పూను ఓట్స్ పొడి, పావు టీస్పూను ఉప్పు తీసుకొని, దీనికి నీళ్లు లేదా ఆలివ్ ఆయిల్ జత చేసి మెత్తని పేస్ట్‌లా చేయాలి. ఈ మిశ్రమంతో ముఖాన్ని మృదువుగా రుద్దుతూ ముఖంపై పేరుకున్న మురికి, దుమ్ము, మృతకణాల్ని తొలగించుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు. అలసిన చర్మానికి సాంత్వన చేకూర్చడానికి ఐస్ థెరపీ ఒక చక్కటి పరిష్కారం అంటున్నారు నిపుణులు. ఈక్రమంలో ఐస్ ముక్కల్ని ముఖంపై మృదువుగా రుద్దడం వల్ల చర్మానికి రక్తప్రసరణ మెరుగై ముఖం ప్రకాశవంతంగా మారుతుందని చెబుతున్నారు. నీళ్లు సరిపడినన్ని తాగడం వల్ల శరీరానికే కాదు.. చర్మ ఆరోగ్యానికీ మంచిది. శరీరంలో నీటి స్థాయిలు తగినంత ఉన్నప్పుడే చర్మం తాజాగా కనిపిస్తుంది. అందుకే సరిపడినన్ని నీళ్లు తాగడం, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు.. వంటి ద్రవాహారం తీసుకోవడం తప్పనిసరని సూచిస్తున్నారు. మనం తీసుకునే ఆహారంలో ఉప్పు పరిమాణం పెరిగితే కళ్ల కింద నల్లటి వలయాలు, ఉబ్బినట్లుగా కనిపించే అవకాశం ఉంటుందట. కాబట్టి నిపుణుల సలహా మేరకు ఉప్పును తగిన మోతాదులో తీసుకోవడం అటు ఆరోగ్యానికి, ఇటు అందానికీ మంచిదని చెబుతున్నారు. తగినంత నిద్ర లేకపోయినా చర్మం అలసిపోతుంది. అందుకే రోజుకు కనీసం ఏడు గంటలైనా నిద్రకు కేటాయించడం మంచిదంటున్నారు నిపుణులు. ర్మంలో తేమను నిలిపి ఉంచడంలో మాయిశ్చరైజర్ పాత్ర కీలకం! కాబట్టి ఏ కాలమైనా, రాత్రుళ్లు మేకప్ తొలగించాక మాయిశ్చరైజర్ రాసుకోవడం మర్చిపోకూడదు. ఇంట్లో తయారుచేసుకునే సహజసిద్ధమైన ఫేస్‌ప్యాక్‌లతోనూ చర్మాన్ని తాజాగా, ప్రకాశవంతంగా మెరిపించుకోవచ్చు. ఈ క్రమంలో మీ చర్మతత్వాన్ని బట్టి ఏ ప్యాక్ వేసుకుంటే మంచిదో నిపుణుల్ని అడిగి తెలుసుకొని ప్రయత్నించచ్చు.



## అమెరికాలో 23,000 ఉద్యోగాల కోత

జులైలో అమెరికాలో వాణిజ్య సంస్థలు 23,000 ఉద్యోగాల కోత విధించాయి. గత నెలలో లక్ష కొత్త ఉద్యోగాలు వస్తాయని విశ్లేషకులు అంచనా వేయగా, తాజా గణాంకాలు అందుకు విరుద్ధంగా వచ్చాయి. అమెరికా ఉపాధి రంగంలో సవాళ్లు, పశ్చిమాసియా యుద్ధం వల్ల చమురు ధరలు పెరగడం ఇందుకు కారణమయ్యాయి. మే, జూన్ నెలలకు సంబంధించిన ఉద్యోగాల సంఖ్యను సవరిస్తూ, ఆ రెండు నెలల్లో మరో 1,03,000 ఉద్యోగాలను అమెరికా కార్మిక శాఖ రికార్డుల్లో తగ్గించింది. జూన్‌లో నిరుద్యోగిత రేటు 4.2% నుంచి జులైలో 4.1 శాతానికి తగ్గింది.




# ఎస్‌బీఐ లాభం రూ.24.113 కోట్లు




ప్రభుత్వ రంగ అతిపెద్ద బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) జూన్ త్రైమాసికంలో రూ.24,113 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2025-26 ఇదే లాభం రూ.21,201.47 కోట్లతో పోలిస్తే ఇది 13.73% అధికం. ప్రధాన వడ్డీ ఆదాయం పెరగడం, కేటాయింపులు తగ్గడం ఇందుకు కలిసివచ్చింది. స్టాండలోన్ ఖాతాల ప్రకారం బ్యాంకు నికర లాభం రూ.19,160.44 కోట్ల నుంచి 10.23% వృద్ధితో రూ.21,121.22 కోట్లకు చేరుకుంది. బ్యాంకు నికర వడ్డీ ఆదాయం దాదాపు 15% పెరిగి రూ.46,992 కోట్లకు చేరుకుంది. ఇందుకు స్థూల రుణాల జారీలో 18.63% వృద్ధి సహకరించింది. దేశీయ నికర వడ్డీ మార్జిన్ 3 శాతానికి తగ్గినా, త్రైమాసికం వారీగా 0.07% పెరిగింది వడ్డీయేతర ఆదాయం 9% తగ్గి రూ.15,293 కోట్లకు చేరింది. ఫారెక్స్/డెరివేటివ్స్ ఆదాయాలు 70% క్షీణించడం ఇందుకు కారణం. డిపాజిట్లు 9.73% రాణించాయి. కరెంట్, సేవింగ్ ఖాతాలకిచ్చే తక్కువ వడ్డీ రుణాల వాటా 0.12% తగ్గి 39.36 శాతానికి పరిమితమైంది.

తగ్గిన మొండి బకాయిలు: ఈ ఏడాది జూన్ 30 నాటికి స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.47 శాతానికి మెరుగైంది. 2026 మార్చి 31 నాటి 1.49%తో పోల్చినా, 2025 జూన్ చివరిలోని 1.83 శాతంతో పోలిస్తే ఇది తక్కువే. 31-89 రోజుల పాటు చెల్లింపులు లేని రుణాలు (ఎన్‌పీఏలు కాదు) ఈ ఏడాది మార్చిలో రూ.3350 కోట్లుగా ఉండగా, జూన్ చివరికి రూ.4174 కోట్లకు పెరిగాయి. నిరర్థక ఆస్తులకు కేటాయింపులు రూ.4,934 కోట్ల నుంచి రూ.3,359 కోట్లకు తగ్గాయి. బ్యాంకు కనీస మూలధన నిష్పత్తి 15.67 శాతంగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 14-15% రుణ వృద్ధి లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి పేర్కొన్నారు. ఇందుకు డిపాజిట్ల వృద్ధి 10-11% ఉండాలన్నారు. ఫారెన్ కరెన్సీ నాన్ రెసిడెంట్ (బ్యాంక్)/ ఎఫ్‌సీఎన్ఆర్(బీ) పథకం మొదలైనప్పటి నుంచి ఇప్పటిదాకా ప్రవాసుల నుంచి తమ బ్యాంకుకు 6 బిలియన్ డాలర్ల (సుమారు రూ.57,000 కోట్ల) డిపాజిట్లు వచ్చాయన్నారు. సెప్టెంబరులో గడువు తీరే సమయానికి 10 బి. డాలర్ల (దాదాపు రూ.95,000 కోట్ల) వరకు రావొచ్చని శెట్టి అంచనా వేశారు.

## యూపీఐపై ఛార్జీలు ఉండవు: ఫోన్‌పే




యూపీఐ లావాదేవీలపై ఛార్జీల వసూలుకు సంబంధించిన బిల్లు లోక్‌సభలో ఆమోదంతో పొందడంతో.. డిజిటల్ లావాదేవీలపై ఛార్జీలు వసూలు చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సాధారణ వినియోగదారుల్లో ఛార్జీల ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో ఫోన్‌పే వ్యవస్థాపకుడు, సీఈవో సమీర్ నిగమ్ కీలక ప్రకటన చేశారు. యూపీఐ లావాదేవీలపై భారతీయ వినియోగదారుల నుంచి ఎలాంటి రుసుములు వసూలు చేయబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించారు. భారతీయ యూజర్లకు యూపీఐ సేవలు ఎప్పటికీ ఉచితంగానే ఉంటాయని, డిజిటల్ లావాదేవీలపై ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని నిగమ్ స్పష్టం చేశారు. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టం-2007 సవరణ బిల్లును లోక్‌సభలో ఆమోదించిన విషయం తెలిసిందే. అయితే ఈ సవరణల వల్ల ఒక వ్యక్తి తన కుటుంబ సభ్యులు లేదా స్నేహితుల బ్యాంకు ఖాతాలకు యూపీఐ ద్వారా పంపే వ్యక్తిగత నగదు లావాదేవీలకూ ఛార్జీలు వర్తించవు. రూ.1.5 కోట్లకు పైగా వార్షిక టర్నోవర్ కలిగి ఉండే షాపింగ్ మాల్స్, కార్పొరేట్ సూపర్ మార్కెట్లు, లగ్జరీ హోటళ్ల వంటి వాటిల్లో రూ.2,000 కంటే ఎక్కువ విలువైన చెల్లింపులపైనే ఎండీఆర్ ఛార్జీలు విధించే అవకాశం ఉందని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. అయితే భవిష్యత్తులో ఇతర లావాదేవీలకూ ఈ ఛార్జీలు వర్తింపజేస్తారన్న భయాలు ప్రజల్లో నెలకొన్నాయి. ఈ క్రమంలోనే ఫోన్‌పే సీఈవో ప్రకటన కీలకంగా మారింది.

## హిందాల్కో లాభంలో 75% వృద్ధి

ADITYA BIRLA
HINDALCO

ఆదిత్య బిర్లా గ్రూప్ సంస్థ హిందాల్కో ఇండస్ట్రీస్, ఏప్రిల్-జూన్‌లో రూ.7,013 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2025-26 ఇదే కాల లాభం రూ.4,004 కోట్లతో పోలిస్తే ఇది 75% ఎక్కువ. అన్ని వ్యాపార విభాగాల్లో మంచి పనితీరు సాధించామని కంపెనీ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.64,834 కోట్ల నుంచి 32% వృద్ధి చెంది రూ.85,882 కోట్లుగా నమోదైంది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో అల్యూమినియం అప్‌స్ట్రీమ్ విభాగ ఆదాయం రూ.13,403 కోట్లుగా, రాగి విభాగ ఆదాయం రూ.17,232 కోట్లుగా ఉంది. కంపెనీ అనుబంధ సంస్థ నొవెలిస్ ఆదాయం రూ.54,763 కోట్లకు చేరింది. ఏకీకృత ఎబిటా గతేడాదితో పోలిస్తే 37% పెరిగి రూ.14,989 కోట్లుగా నమోదైంది. అల్యూమినియం అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్, రాగి, నొవెలిస్ వ్యాపారాలు అత్యధిక త్రైమాసిక ఎబిటా సాధించాయి. కంపెనీ ఉత్పత్తి సామర్థ్యాలను పెంచేందుకు రూ.50,000 కోట్లతో మూలధన ప్రణాళికలు సిద్ధం చేసినట్లు హిందాల్కో ఎండీ సతీశ్ పాయ్ తెలిపారు. వీటితో అల్యూమినా, అల్యూమినియం, రాగి అప్‌స్ట్రీమ్ సామర్థ్యాలను పెంచడంతో పాటు వాల్యూ-యాడెడ్ డౌన్‌స్ట్రీమ్ ప్రాజెక్టులను విస్తరించనున్నారు. సమీక్షా త్రైమాసికంలో లోహాల ధరలు అధికంగా ఉండటంతో కొనుగోలుదారులు అప్రమత్తత పాటించారని, పశ్చిమాసియా సంక్షోభం వల్ల శుద్ధి చేసిన రాగి దిగుమతులతో పాటు అంతర్జాతీయ సరఫరాలపై ప్రభావం చూపుతోందని పాయ్ వెల్లడించారు.

# ఇ-20 పెట్రోల్ ప్రమాణాలు భేష్

దేశవ్యాప్తంగా నిర్వహించిన అదనపు పరీక్షల్లో ఇ-20 పెట్రోల్ (20% ఇథనాల్ కలిసిన పెట్రోల్) లో అధిక తేమ-క్లోరైడ్ ఉన్నట్లు ఆధారాలు లభించలేదని ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు స్పష్టం చేశాయి. ఈ విషయమై వాహన తయారీదారుల సమాఖ్య (సియామ్) పెట్రోలియం శాఖకు లేఖ రాసి, తదుపరి ఉపసంహరించుకున్న సంగతి విదితమే. గత కొన్ని రోజుల్లో ఈ ఇంధనంపై అదనపు తనిఖీలు నిర్వహించినట్లు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) సంయుక్త ప్రకటనలో తెలిపాయి. ఇంధన నాణ్యత నిర్దేశిత ప్రమాణాలకన్నా మెరుగ్గా ఉందని పేర్కొన్నాయి.

పెట్రోల్‌లో కలిపే ఇథనాల్‌లో క్లోరైడ్ స్థాయికి ప్రభుత్వం కఠిన ప్రమాణాలు నిర్దేశించిందని, వాటి అమలును నిర్ధారించేందుకు రిఫైనరీలు, డిస్టిలరీలు, డిపోలు, టెర్మినళ్లు, రిటైల్ అవుట్‌లెట్లలో తరచూ పరిశీలన నిర్వహిస్తున్నట్లు తెలిపాయి.

దేశంలోని 90,000 పెట్రోల్‌బంకుల భూగర్భ ట్యాంకుల్లో రోజుకు 8 నుంచి 12 సార్లు తేమశాతం పరీక్షలను మొబైల్ పరీక్షా ల్యాబ్‌లతో, స్వతంత్ర ప్రయోగశాలల ద్వారా పరిశీలిస్తున్నామని.. ఎక్కడా తేడా లేదని తేలినట్లు ప్రకటించాయి.

రిఫైనరీల నుంచి సేకరించిన 100కుపైగా పెట్రోల్ నమూనాల్లో క్లోరైడ్ స్థాయి మిలియన్‌కు ఒక భాగం (1పీపీఎం), అంతకంటే తక్కువగా నమోదైంది. 80 డిస్టిలరీల నుంచి సేకరించిన ఇథనాల్ నమూనాల్లో క్లోరైడ్ స్థాయి 3 పీపీఎం కంటే తక్కువగా ఉన్నట్లు




గుర్తించినట్లు తెలిపాయి. రిటెయిల్ పెట్రోల్ బంకుల్లో పరీక్షించిన 160కి పైగా ఇ20 నమూనాల్లో క్లోరైడ్ స్థాయి 0 - 3 పీపీఎం ఉన్నట్లు వెల్లడించాయి. రెండు చోట్ల క్లోరైడ్ స్థాయి కొంత ఎక్కువగా ఉన్నట్లు గుర్తించి, అక్కడ సరఫరా నిలిపివేశామని, దిద్దుబాటు చర్యలు తీసుకున్నాకే తిరిగి సరఫరా ప్రారంభిస్తామని పేర్కొన్నాయి.

సీహెచ్‌టీ వెబ్‌సైట్‌లో పరీక్షా ఫలితాలు: తాజా ఫలితాలను సెంటర్ ఫర్ హై టెక్నాలజీ (సీహెచ్‌టీ) వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని, ఎప్పటికప్పుడు ఫలితాలు వచ్చిన వెంటనే పొందుపరుస్తామని సంస్థలు వివరించాయి. దేశంలోని 1,07,000 బంకుల్లో పరీక్షలు నిర్వహించగా.. 4 చోట్ల మాత్రమే సమస్యలు కనిపించాయని కేంద్ర పెట్రోలియం మంత్రి హర్‌దీప్ సింగ్‌పురి పేర్కొన్నారు. ఏ ఉత్పత్తి అయినా అప్పుడప్పుడు కలుషితం కావచ్చని, అంతమాత్రాన మొత్తం వ్యవస్థలో లోపం ఉన్నట్లు పరిగణించకూడదన్నారు.






## కొరియా మాస్టర్స్ ఫైనల్‌కు చేరిన అస్మిత చాలిహా

భారత యువ షట్లర్ అస్మిత చాలిహా అదరగొట్టేస్తోంది. తన తొలి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టోర్నీలో ఫైనల్‌కు చేరుకుంది. కొరియా మాస్టర్స్ 300లో మరో భారత షట్లర్ రక్షిత రామరాజ్‌పై అస్మిత విజయం సాధించింది. చివరి గేమ్ వరకూ వెళ్లిన పోరులో అస్మిత 21-13, 16-21, 21-13 తేడాతో రక్షితపై గెలిచింది. దాదాపు మూడు నెలలపాటు ఆటకు దూరమైన 26 ఏళ్ల అస్మిత గత మేలోనే మైదానంలోకి దిగింది. ప్రతి మ్యాచ్‌లోనూ అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు చేరుకుంది. చైనా షట్లర్ కియాన్సి హాన్ ఫైనల్‌కు దూసుకొచ్చింది. మరో సెమీస్‌లో హాన్ 22-20, 18-21, 21-14 తేడాతో కొరియా ప్లేయర్ గ్రేస్ కిమ్‌పై విజయం సాధించింది. దీంతో ఆదివారం జరగనున్న ఫైనల్‌లో భారత షట్లర్ అస్మితతో హాన్ టైటిల్ కోసం తలపడనుంది.

## నేను అతడితో మాట్లాడను..
## కానీ ఆ కథనం నన్ను మార్చేసింది: అశ్విన్

భారత్ తరపున టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్ రవిచంద్రన్ అశ్విన్. అయితే.. కెరీర్ ఆరంభంలో టెక్నిక్‌ను పెంచుకునే క్రమంలో చాలా ఇబ్బందులే పడ్డాడు. ఫిట్‌నెస్ విషయంలోనూ ప్రశ్నలు ఎదుర్కొన్నాడు. మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్ ఓ సారి అశ్విన్‌పై ఘాటుగా ఓ కథనం రాశాడు. దీంతో అతడితో మాట్లాడలేదని.. ఒక్కసారి మాత్రమే మెసేజ్ చేసినట్లు అశ్విన్ వెల్లడించాడు. అయితే, అతడి ఆర్టికల్ తనను చాలా మార్చేసిందని అశ్విన్ అంగీకరించాడు. విమర్శలను కూడా పాజిటివ్‌గా తీసుకుంటేనే జీవితంలో మెరుగ్గా మారేందుకు అవకాశం ఉంటుందని గ్రహించినట్లు పేర్కొన్నాడు. ''తొలిసారి ఆస్ట్రేలియా పర్యటన అనంతరం నా గురించి సంజయ్ మంజ్రేకర్ ఓ పెద్ద ఆర్టికల్ రాశాడు. అక్కడ్నుంచి తిరిగి వచ్చేటప్పుడు పూర్తిగా చదివా. చాలా కోపం వచ్చింది. అదే సమయంలో బాధగానూ అనిపించింది. అప్పట్నుంచి అతడితో ఎక్కువగా మాట్లాడేవాడిని కాదు. స్వతహాగా నేనేమీ గొప్ప అథ్లెట్‌ను కాదు. ఫిట్‌నెస్ కోసం దాదాపు నాలుగేళ్లపాటు చాలా శ్రమించా. ఆ తర్వాత మరొక ఆర్టికల్ రాశాడు. నేను చాలా బాగా బౌలింగ్ చేశానని ప్రశంసించాడు. అప్పుడే అతడి నంబర్ తీసుకుని తొలిసారి మెసేజ్ చేశా. నీ ఆర్టికల్ నా జీవితంలో మార్పు తీసుకొచ్చిందని సందేశం పంపించా. అయినా సరే.. అతడితో మాట్లాడిందిలేదు. విమర్శల నుంచీ ఏదో ఒకటి నేర్చుకునేందుకు అవకాశం ఉంటుందని గ్రహించా'' అని అశ్విన్ తెలిపాడు. హార్దిక్ పాండ్య ను ట్రేడ్ చేసుకొని శివమ్ దూబే, ఖలీల్ అహ్మద్‌ను ముంబయికి ఇచ్చేందుకు చెన్నై సూపర్ కింగ్స్ ఆసక్తి చూపిస్తోందనే వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో సీఎస్‌కేకు అశ్విన్ కీలక సూచనలు చేశాడు. ''శివమ్ దూబే అరుదైన ఆటగాడు. అలాంటి ప్లేయర్‌ను వదులుకోవద్దు. ఖలీల్ అహ్మద్ గతేడాదే తనను రిలీజ్ చేయాలని అడిగినట్లు వార్తలు వచ్చాయి. ఒకవేళ వారిద్దరితోపాటు కాంబోజ్‌ను కూడా హార్దిక్ ట్రేడ్ కోసం వినియోగిస్తే.. ఒక్క భారత పేసర్ లేకుండానే సీఎస్‌కే ఆడాల్సి ఉంటుంది. సీఎస్‌కే బ్యాటింగ్ కంటే బౌలింగ్‌లోనే బలహీనంగా ఉంది. ఇద్దరు పేసర్లను ఇచ్చేస్తే సీఎస్‌కేకు మరింత ఇబ్బందికరంగా మారనుంది'' అని అశ్విన్ వ్యాఖ్యానించాడు.



## ఫిఫా ప్రపంచకప్ సమయంలో.. మెస్సి హత్యకు కుట్ర!



స్టార్ ఫుట్‌బాల్ ప్లేయర్ లియోనెల్ మెస్సి హత్యకు కుట్ర జరిగిందా? ఫిఫా ప్రపంచ కప్ సమయంలో అతడిని లక్ష్యంగా చేసుకొని టెర్రర్ ఎటాక్ ప్లాన్ చేశారా?.. ఇందుకు సంబంధించి అంతర్జాతీయ మీడియాలో సంచలన కథనాలు వస్తున్నాయి. అర్జెంటీనా జట్టు సారథిని హత్య చేయాలని ఉగ్రమూకలు ప్రయత్నించాయని స్పానిష్ న్యూస్ పేపర్ కథనం ప్రచురించింది. ఈ మేరకు అమెరికా పోలీసుల వద్ద పక్కా సమాచారం ఉందని అందులో పేర్కొంది. అయితే, భద్రతాపరమైన ముప్పులను ఎఫ్‌బీఐ, అంతర్జాతీయ పోలీసు సహకార విభాగం నేతృత్వంలోని సెక్యూరిటీ నెట్‌వర్క్ సమర్థంగా ఎదుర్కొన్నాయి. మెస్సిని టార్గెట్ చేస్తూ ఓ అనుమానితుడు తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు కూడా పెట్టినట్లు సదరు పత్రికా కథనం పేర్కొంది. ''నేను నడుచుకుంటూ అట్లాంటా స్టేడియం వద్దకు వెళ్తా. నాలుగు బాంబులు నా శరీరానికి ఉంటాయి. వాటితో మెస్సి(Lionel Messi)ని పేల్చేస్తా'' అని పోస్టు పెట్టి డిలీట్ చేసినట్లు సమాచారం. దీంతో భద్రతా అధికారులు ఉన్నత స్థాయిలో సమీక్షించి కఠిన చర్యలు తీసుకున్నట్లు స్పానిష్ పత్రిక వెల్లడించింది. డాలస్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన ఓ ఫోన్ కాల్‌ను కూడా అధికారులు పరిశీలించినట్లు సమాచారం. ఆ కథనం ప్రకారం.. ఇంట్లో తయారు చేసిన బాంబులతో పాటు ఏఆర్-15 తుపాకీతో స్టేడియానికి వెళ్తున్నట్లు ఆ అనుమానితుడు పేర్కొన్నాడు. మెస్సి మాత్రమే కాకుండా.. ఇతర క్రీడాకారులు, పోలీసు అధికారులు కూడా తమ లక్ష్యమని చెప్పినట్లు భద్రతా సిబ్బంది గుర్తించారు. మెస్సితోపాటు క్రిస్టియానో రొనాల్డో కూడా వారి జాబితాలో ఉన్నట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి. పోర్చుగల్ ఫుట్‌బాల్ జట్టు బస ఎక్కడని ఆరా తీసినట్లు జూన్ 14న ఫిఫా ఉద్యోగి ఒకరు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అప్పట్నుంచి భద్రతపరంగా అప్రమత్తమంగా ఉన్నారు. చివరికి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రపంచ కప్ (FIFA World Cup) ప్రశాంతంగా ముగియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## వార్మప్ మ్యాచ్‌లో సెంచరీ.. అతడికి బదులు వన్ డౌన్‌లో పడిక్కల్!

శ్రీలంక XIతో జరుగుతున్న మూడు రోజుల వార్మప్ మ్యాచ్ రెండో రోజు ఆటలో భారత బ్యాటర్ దేవదత్ పడిక్కల్ సెంచరీ బాదాడు. శ్రీలంక స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కొని 121 బంతుల్లోనే 103 పరుగులు చేశాడు. అనంతరం రిటైర్డ్ హర్ట్‌గా పెవిలియన్‌కి వెళ్లాడు. టీ బ్రేక్ సమయానికి భారత్ స్కోరు 50 ఓవర్లకు 4 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. క్రీజ్‌లో రవీంద్ర జడేజా (29), మానవ్ సుతార్ (3) ఉన్నారు. అంతకుమందు ఓపెనర్ యశస్వి జైస్వాల్ (0) డకౌట్ కాగా.. రిషభ్ పంత్ (2), ధ్రువ్ జురెల్ (1) విఫలమయ్యారు. మరో ఓపెనర్



కేఎల్ రాహుల్ (40) ఫర్వాలేదనిపించాడు. శ్రీలంక XI ఓవర్‌నైట్ 363/8 స్కోరు వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. శ్రీలంకతో 15 నుంచి జరగనున్న రెండు టెస్టుల సిరీస్ భారత స్క్వాడ్‌లో సాయి సుదర్శన్‌కు అవకాశం దక్కింది. కానీ, అతడు ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సి ఉంది.

## వైభవ్ సూర్యవంశీ స్పెషాలిటీ ఏంటి?
## సింపుల్‌గా చెప్పేసిన శిఖర్ ధావన్

చిన్న వయసులోనే పరిణతితో ఆడటం సాధారణ విషయం కాదని.. వైభవ్ సూర్యవంశీ చాలా స్పెషల్ అని మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ ప్రశంసించాడు. స్ట్రోక్ ప్లేతోపాటు నిర్భయంగా ఆడే మనస్తత్వం అతడి సొంతమని తెలిపాడు. 15 ఏళ్ల వయసులోనే స్టార్ బౌలర్లపైనా ఆధిపత్యం ప్రదర్శించడం అద్భుతమన్నాడు. 'కేవలం దూకుడుగా ఆడటంతోనే వైభవ్ సూర్యవంశీ హైలైట్ కావడం లేదు. అతడిలో మరో ప్రత్యేకత కూడా ఉంది. ఎలాంటి షాట్‌నైనా మనసు పెట్టి ఆడతాడు. నైపుణ్యంతోపాటు ఇలాంటి అలవాటు ఉంటే అతడిని ఆపడం చాలా కష్టం. చిన్న వయసులోనే ఆ సత్తాను అందుకోవడం అభినందనీయం. అంతర్జాతీయ క్రికెట్‌లో 15 ఏళ్లకు అడుగు పెట్టడమే అతడు సాధించిన అతిపెద్ద ఘనత. ఐపీఎల్‌లోనూ ఫోర్లు, సిక్స్‌లు చాలా దూకుడుగా బాదేవాడు. మున్ముందు కూడా అతడి భవిష్యత్తు అద్భుతంగా ఉండబోతోంది'' అని ధావన్ తెలిపాడు.



# వుదయం సినిమా

## 'డ్రాగన్' తర్వాత కొత్త ప్రాజెక్ట్‌పై ఎన్టీఆర్ ఫోకస్



**వుదయం సినిమా:** 'అరవింద సమేత వీరరాఘవ' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత గ్లోబల్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో మరో భారీ ప్రాజెక్ట్ రూపుదిద్దుకోబోతోంది. వీరి కలయికలో రానున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి 'గాడ్ ఆఫ్ వార్' (God Of War) అనే వర్కింగ్ టైటిల్‌ను పరిశీలిస్తున్నారు. అనౌన్స్‌మెంట్ రాకముందే ఈ ప్రాజెక్ట్‌పై టాలీవుడ్‌తో పాటు సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.లార్డ్ కార్తికేయ కథాంశంతో మైథలాజికల్ ఎపిక్‌ఈ సినిమా పురాణాల నేపథ్యంతో కూడిన ఒక పవర్ ఫుల్ మైథలాజికల్ ఎపిక్‌గా తెరకెక్కనున్నట్లు ఇండస్ట్రీ వర్గాల సమాచారం. లార్డ్ కార్తికేయ (సుబ్రహ్మణ్య స్వామి) కథ ఆధారంగా ఈ చిత్రాన్ని మలచబోతున్నారని, ఇందులో ఎన్టీఆర్ ఒక దైవిక యోధుడి (డివైన్ వారియర్) పాత్రలో కనిపిస్తారని తెలుస్తోంది. త్రివిక్రమ్ మార్క్ సంభాషణలు, కథనానికి ఎన్టీఆర్ నటనతోడైతే బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం ఖాయమని భావిస్తున్నారు.షూటింగ్ ఎప్పుడు ప్రారంభం కానుంది?ఈ భారీ విజువల్ వండర్ కోసం మేకర్స్ విస్తృతమైన ప్రీ–ప్రొడక్షన్ పనులను ప్లాన్ చేస్తున్నారు. 2027 మార్చి తర్వాత ఈ సినిమా ప్రీ–ప్రొడక్షన్ పనులు వేగవంతం కానున్నాయి. గ్రాఫిక్స్, స్క్రిప్ట్ వర్క్ , ఆర్ట్ వర్క్ పూర్తయిన అనంతరం, 2027 ద్వితీయార్థంలో (సెకండ్ హాఫ్) ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ కోసం సెట్స్ పైకి వెళ్లనుంది.ఎన్టీఆర్ హెల్త్ అప్‌డేట్ అండ్ లైన్‌అప్‌ఇటీవల జరిగిన ఒక ఘటనలో ఎన్టీఆర్ భుజానికి స్వల్ప గాయమైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన వైద్యుల సూచన మేరకు విశ్రాంతి తీసుకుంటున్నారు. గాయం నుంచి కోలుకున్న తర్వాత ఎన్టీఆర్ మొదట తన ప్రస్తుతం ప్రాజెక్ట్ 'డ్రాగన్' (Dragon) షూటింగ్‌ను పూర్తి చేయనున్నారు. ఆ సినిమా పనులు ముగిసిన వెంటనే పూర్తిగా 'గాడ్ ఆఫ్ వార్' ప్రాజెక్ట్‌పై దృష్టి సారించనున్నారు.



## 12న 'ఇరుముడి' ట్రైలర్

**వుదయం సినిమా:** మాస్ మహారాజా రవితేజ మచ్ అవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 21న భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది. సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్‌తోనూ ప్రేక్షకుల్లో ఉత్సాహం పెరుగుతోంది. ఇప్పటికే విడుదలైన 'గ్లింప్స్', పాటలతో ఆసక్తిని రేకెత్తించిన చిత్ర బృందం, ఇప్పుడు థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయడానికి సిద్ధమవుతోంది. ఆగస్టు 12న భీమవరంలో జరిగే భారీ కార్యక్రమంలో 'ఇరుముడి' ట్రైలర్ విడుదల కానుంది. ఈ కార్యక్రమానికి రవితేజ స్వయంగా హాజరుకానుండటంతో, ఇది సినిమా ప్రచారంలో ఒక కీలక ఘట్టం కానుంది. ట్రైలర్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో రవితేజ రెండు విభిన్న అవతారాల్లో కనిపిస్తున్నారు. ఒకవైపు నోటిలో గొడ్డలితో మాస్ లుక్‌లో కనిపిస్తుండగా, మరోవైపు అయ్యప్ప మాల ధరించిన ఆధ్యాత్మిక అవతార్ లో కనిపిస్తున్నారు.




## 'శివ గాడి జిందగీ' మూవీ టైటిల్, సాంగ్ లాంచ్!



**వుదయం సినిమా:** ఐశ్వర్య సినీ క్రియేషన్స్ బ్యానర్‌పై సింధుసూర్య నిర్మిస్తున్న నూతన చిత్రం 'శివ గాడి జిందగీ'. సచిన్ రామ్ ప్రతాప్, హాసిని దేవరకొండ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి వినయ్ రెడ్డి చందుపట్ల దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్‌ను నిర్మాత సురేష్‌బాబు లాంచ్ చేశారు. సాంగ్‌ను అతిథులుగా పాల్గొన్న రీల్‌ఆన్ సీఈఓ దాశరథం బిట్ల, రాయల్ ఎన్‌ఫీల్డ్ డీలర్ ప్రిన్సిపల్ పూల సందీప్ కుమార్ నాయుడు, ప్రముఖ జర్నలిస్టు శివ మల్లాల విడుదల చేశారు. చిత్ర యూనిట్‌కు తమ శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రతి సగటు మనిషి జీవితానికి ప్రతిరూపం!కామెడీ, ఎమోషన్, డ్రామా, ఫ్రెండ్‌షిప్, లవ్ వంటి అన్ని రకాల వినోద అంశాలతో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఒక సామాన్య మనిషి తన జీవితంలో ఎదుర్కొన్న రకరకాల పరిస్థితులు, సంఘటనలు, భావోద్వేగాల సమాహారంగా ఈ చిత్రం సాగనుంది. ప్రతీ సన్నివేశానికి ఒక బలమైన కారణం, ప్రతీ పాత్రకు ఒక ప్రాధాన్యత, ప్రతీ ఎమోషన్‌కు ఒక అనుబంధం ఉండేలా దర్శకుడు ఈ కథను మలచడం విశేషం.లాంచ్ కార్యక్రమంలో దర్శకుడు వినయ్ రెడ్డి చందుపట్ల మాట్లాడుతూ..."'శివ గాడి జిందగీ' అనేది కేవలం ఒక వ్యక్తి కథ మాత్రమే కాదు... ఇది మన సమాజంలోని ప్రతి సగటు మనిషి జీవితానికి ఒక చక్కటి ప్రతిరూపం. జీవితంలో వచ్చే ఎత్తుపల్లాలు, స్నేహం, ప్రేమ, భావోద్వేగాలను చాలా సహజంగా చూపే ప్రయత్నం చేశాం. ప్రతి ఒక్కరినీ ఈ కథ ఆకట్టుకుంటుంది. అలాగే నేను రాసిన పాటను భావయుక్తంగా పాడిన పావని వాస గారికి, అద్భుతమైన సంగీతాన్ని అందించిన సాయి గారికి నా ప్రత్యేక ధన్యవాదాలు.

## అంచనాలు పెంచేసిన విశాల్ 'మకుటం' ట్రైలర్



**వుదయం సినిమా:** హీరోగా, దర్శకుడిగా విశాల్ చేస్తున్నతొలి చిత్రం 'మకుటం'పై ఏర్పడిన హైప్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ మూవీ సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్ మీద 99వ స్వర్గీయ ఆర్ బీ చౌదరి నిర్మాణంలో రూపుదిద్దుకుంది. ఈ సినిమాలో అంజలి, దుషార విజయన్ హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రాన్ని ఆగస్ట్ 14న భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన గ్లింప్స్, టీజర్, పాటలు అన్నీ కూడా ట్రెండ్ అయ్యాయి. ఇక తాజాగా విడుదల చేసిన ట్రైలర్ ఒక్కసారిగా అంచనాలు పెంచేసింది.ఫుల్ యాక్షన్ మోడ్‌తో ట్రైలర్ ఓపెన్ చేయడం.. ఆ తర్వాత ఫ్యామిలీ ఎమోషన్స్‌కి షిఫ్ట్ అవ్వడం.. మూడు డిఫరెంట్ గెటప్స్‌లో విశాల్ తన మాడ్యులేషన్‌ను చూపిస్తుండటం ట్రైలర్‌కి హైలెట్‌గా నిలిచింది.

## 10న 'రంభ ఊర్వశి మేనక' టీజర్ రిలీజ్



**వుదయం సినిమా:** గత కొన్నేళ్లుగా విభిన్న పాత్రలు, కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలతో ప్రేక్షకులను అలరించిన అల్లరి నరేష్, ఇప్పుడు తన మార్క్ కామెడీ జోనర్ 'రంభ ఊర్వశి మేనక'తో సిద్ధమయ్యారు. చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌ను అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్లపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు."Comedy Goes Cosmic" అనే ట్యాగ్‌లైన్‌తో రూపొందుతున్న ఈ సినిమా అల్లరి నరేష్ మార్క్ వినోదంతో మేళవించిన వినూత్న కథగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తొలి పాట 'నా కంటి మీద కునుకే'కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ టీజర్ రిలీజ్ డేట్ అప్డేట్ ఇచ్చారు. ఆగస్ట్ 10న టీజర్ ని లాంచ్ చేయనున్నారు. అనౌన్స్మెంట్ పోస్టర్ లో అల్లరి నరేష్ చిరునవ్వుతో కనిపించడం ఫీల్ గుడ్ వైబ్ ని తీసుకొచ్చింది. ఈ చిత్రంలో వెన్నెల కిశోర్, వీకే నరేష్, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్ తదితర ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వీరందరూ తమదైన కామెడీ టైమింగ్‌తో సినిమాకు మరింత వినోదాన్ని అందించనున్నారు.ఈ చిత్రానికి రామ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, చైతన్ భరద్వాజ్ సంగీతం సమకూరుస్తున్నారు. బ్రహ్మ కడలి ఆర్ట్ డిజైన్‌ను రూపొందించగా, చోటా కె. ప్రసాద్ ఎడిటింగ్.'రంభ ఊర్వశి మేనక' చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.తారాగణం: అల్లరి నరేష్, వెన్నెల కిషోర్, నరేష్ వీకే, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్.

## 'అగధ' డివైన్ మిస్టిక్ థ్రిల్లర్‌గా ఉంటుంది..

**వుదయం సినిమా:** శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద అజయ్ కేఆర్ సమర్పణలో కాశీ విశాలాక్షి బలుసు నిర్మాణంలో ఎం.ఎస్. రాజు తెరకెక్కించిన చిత్రం 'అగధ'. ఈ క్రమంలో హీరో శ్రవణ్ రెడ్డి శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ చిత్ర విశేషాల్ని పంచుకున్నారు.

**'డర్టీ హరి' తర్వాత ఇంత గ్యాప్ ఎందుకు వచ్చింది?**

'డర్టీ హరి' కరోనాలో రిలీజ్ అయింది. ఓటీటీలోకి నేరుగా వచ్చినా అక్కడ మాకు అద్భుతమైన రెస్పాన్స్ దక్కింది. ఆ టైంలోనే నాకు చాలా ఆఫర్స్ వచ్చాయి.

**'అగధ'లో మీ పాత్ర తీరు గురించి చెప్పండి?**

'డర్టీ హరి'కి పూర్తి భిన్నంగా 'అగధ' పాత్ర ఉంటుంది. చాలా పార్శ్వాలు ఉండేలా కారెక్టర్‌ను డిజైన్ చేశారు. చాలా షేడ్స్ ఉన్న ఈ పాత్రను పోషించడం ఆనందంగా ఉంది.

**'అగధ' ట్రైలర్ చూస్తే మీదే నెగెటివ్ పాత్రలా కనిపిస్తోంది?**

ఇందులో నెగెటివ్ పాత్ర అనేది ఉండదు. పరిస్థితుల వల్లే పాత్రలు అలా ప్రవర్తిస్తుంటాయి. గుడ్ వర్సెస్ బ్యాడ్, గాడ్ వర్సెస్ ఈవిల్ అన్నట్టుగా సాగుతుంది.

**'అగధ' విజయంపై, మీ పాత్రపై ఎలాంటి అంచనాలున్నాయి?**

అంచనాలు లేకుండాఎలా ఉంటాయి (నవ్వుతూ).

**ఎం.ఎస్. రాజు గారితో మీ వర్క్ ఎక్స్‌పీరియెన్స్ గురించి చెప్పండి?**

డర్టీ హరి', 'అగధ' కోసం ఎంఎస్ రాజు గారు రాసిన కథ, నా పాత్ర చాలా కొత్తగా అనిపిస్తుంది. ఎంఎస్ రాజు గారిని 'అగధ' సెట్‌లో చూస్తే చాలా కొత్తగా కనిపించారు.




## బంగారు బోనం ఎత్తిన సినీ నటి, నిర్మాత నిహారిక కొణిదెల

**వుదయం సినిమా:** హైదరాబాద్ నగరంలో బోనాల వేడుకలు వైభవంగా కొనసాగుతున్న వేళ, సినీ నటి, నిర్మాత నిహారిక కొణిదెల పాతబస్తీ మీరాలం మండిలోని శ్రీ మహంకాళేశ్వర దేవాలయంలో అమ్మవారికి బంగారు బోనం ఎత్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. వేదమంత్రాల నడుమ అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందిన అనంతరం ఆలయ అధికారులు ఆమెను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ గాజుల



అంజయ్య నిహారికకు ఆలయ చరిత్రతో పాటు ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బోనాల ఉత్సవాల విశిష్టత, సంప్రదాయాలను వివరించారు.అనంతరం నిహారిక మాట్లాడుతూ, ప్రధాన బోనాల రోజు షూటింగ్ ఉండటంతో ఆలయానికి రాలేకపోయానని, అందుకే అమ్మవారి దర్శనానికి వచ్చినట్లు తెలిపారు. తాను హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగినప్పటికీ బోనాల సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బోనాలు ఎత్తుకుని వెళ్లే దృశ్యాలు ఎప్పుడూ తనను ఎంతో ఆకట్టుకునేవని చెప్పారు.కొద్ది రోజుల క్రితమే "నన్ను కూడా ఎవరైనా బోనాలకు తీసుకెళ్తే బాగుండేది" అని సరదాగా అన్నానని, ఆ కోరిక ఇంత త్వరగా నెరవేరడం అమ్మవారి అనుగ్రహమేనని పేర్కొన్నారు. "అమ్మవారు ఎంతో శక్తివంతమైన దేవత.

## 'దందా' సిరీస్‌తో హీరోగా దొర సాయి తేజ

**వుదయం సినిమా:** వర్టికల్ స్టోరీస్‌లో చాయ్ షాట్స్ నుంచి వచ్చిన 'దందా' సిరీస్‌తో హీరోగా దొర సాయి తేజ ఓ ట్రెండ్ క్రియేట్ చేశారు. దర్శకుడు ఆదిత్య దేవులపల్లి తెరకెక్కించిన ఈ సిరీస్ యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది. ఈ సిరీస్ సక్సెస్ ఫుల్‌గా సాగుతున్న తరుణంలో హీరో దొరసాయి తేజ తన జర్నీ గురించి కొన్ని విశేషాల్ని పంచుకున్నారు. ఆయన చెప్పిన సంగతులేంటో ఓ సారి చూద్దాం.

**మీ సినీ జర్నీ గురించి చెప్పండి?**

ప్రభాస్ గారి 'అడవి రాముడు' సినిమాలో హీరో చిన్నప్పటి చైల్డ్ కారెక్టర్‌కి డబ్బింగ్ చెప్పాను. 'కొత్తబంగారులోకం', 'హై స్కూల్' అనే సిరీస్‌లో నటించాను. 'అలా మొదలైంది' సినిమాలోనూ ఓ చిన్న పాత్రను పోషించాను. 2016 నుంచి ఆర్జీవీ గారితో అనుబంధం ఏర్పడింది.

**ఇంత చిన్న వయసులోనే వ్యాపారసుడిగా, నటుడిగా, కంటెంట్ క్రియేటర్‌గా సాధించడం ఎలా అనిపిస్తుంది?**

నేను నిద్ర లేచిన క్షణం నుంచి ఒక కంటెంట్ క్రియేటర్‌గా, డైరెక్టర్‌గా, యాక్టర్‌గా, ప్రొడ్యూసర్‌గా ఆలోచిస్తూనే ఉంటాను. నన్ను నేను కొత్తగా పరిచయం చేసుకోడానికి ఇదొక మార్గం.

**మీకు పార్టీలు చేసుకోవాలని, ఎంజాయ్ చేయాలని అనిపించదా?**

ప్రతీ విషయాన్ని నేనే నేర్చుకోవాలి. నాకు నేనుగానే అన్నీ నేర్చుకుంటాను. పడిపోయినప్పుడు ఓ కొత్త గుణపాఠం నేర్చుకుంటాను. నేను ఎప్పుడూ నా వయసు కంటే ఓ ఐదేళ్లు పెద్దవాడిలానే ఆలోచిస్తా.

**సోషల్ మీడియాలో వచ్చే ప్రశంసలు, విమర్శల్ని ఎలా తీసుకుంటారు?**

సోషల్ మీడియాలో అన్నీ ఉంటాయి. ప్రతీ వీడియోకి కొన్ని కొత్త ప్రశంసలు, కొన్ని తిట్లు వస్తుంటాయి. ఈ కంటెంట్ క్రియేషన్ అనే దాన్ని నేను ఒక బ్రిడ్జ్‌లా వాడతాను.

**సోషల్ మీడియా లైఫ్, ఈ క్రియేటర్ స్పేస్ గురించి కొత్తగా వచ్చేవాళ్లకు మీరు ఇచ్చే సలహా ఏంటి?**

కొద్దిగా ఫాలోవర్లు లైకులు షేర్లు కనిపించాయంటే చాలు, చూసే జనాలంతా అబ్బా 'లైఫ్ అంటే వీడిది రా' అనుకుంటారు. కానీ అది నిజం కాదు, వైకుంఠపాళీ లాగా నిచ్చెనెక్కిచ్చేది అదే, ఏదైనా తేడా కొడితే క్రింద పడేసేది అదే. చూడటానికి అందంగా ఫ్యాన్సీగా కనిపిస్తుంది,




Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.